ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 31.07.2026 | సంపుటి : 13 సంచిక : 11 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# వారెవ్వా.. ఎంతమంచి ముచ్చట

## మద్యంమత్తు నుంచి జెన్‌జీ బయటకు

- శరీర సౌష్టవం కోసం జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్లకు..
- 42% మంది 'డ్రై జనవరి'.. 58% మంది 'జీబ్రా స్ట్రిప్పింగ్'
- ముంబై, పూణే వంటి నగరాల్లో నిర్వహించిన సర్వేలో వెల్లడి

**ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా ఉన్న దేశంలో సానుకూల మార్పు**






ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన భారతదేశంలో యువత జీవనశైలిలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు వినోదం, పార్టీలు, మద్యం వంటి అంశాలపై ఆసక్తి చూపిన కొత్త తరం, ఇప్పుడు ఆరోగ్యం, ఫిట్‌నెస్, శరీర సౌష్టవం, మానసిక ప్రశాంతతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పలు తాజా సర్వేలు, పరిశ్రమ అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**హైదరాబాద్, జూలై 30 (జనంసాక్షి):**

పట్టణ ప్రాంతాల్లోని జెన్-జీ యువతలో మద్యం వినియోగాన్ని నియంత్రించాలనే అవగాహన వేగంగా పెరుగుతోంది. ఐడబ్ల్యూఎస్ఆర్ బెవ్ ట్రాక్ తదితర అధ్యయనాల ప్రకారం, ముంబై, పూణే వంటి నగరాల్లో నిర్వహించిన సర్వేలో 42 శాతం మంది యువత 'డ్రై జనవరి' వంటి కార్యక్రమాల్లో పాల్గొనగా, 58 శాతం మంది పార్టీల్లో ఆల్కహాలిక్, నాన్-ఆల్కహాలిక్ పానీయాలను మారుస్తూ తీసుకునే 'జీబ్రా స్ట్రిప్పింగ్' విధానాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడైంది. సోషల్ మీడియా ద్వారా ఫిట్‌నెస్‌పై అవగాహన పెరగడం, జిమ్ కల్చర్ విస్తరించడం, శరీర ఆకృతి పట్ల శ్రద్ధ పెరగడం, మంచి నిద్ర, మానసిక ఆరోగ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల యువతలో మద్యం వినియోగం తగ్గుతున్న ధోరణి కనిపిస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రముఖ ఆల్కహాల్ పరిశ్రమ సంస్థల విశ్లేషణలు కూడా యువతలో అధిక మోతాదులో మద్యం సేవించే అలవాటు తగ్గుతూ, మితంగా తీసుకోవడం లేదా పూర్తిగా దూరంగా ఉండే ధోరణి బలపడుతోందని పేర్కొంటున్నాయి. పరిమాణం కంటే నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చే వినియోగ విధానం కూడా పెరుగుతోంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5)లోనూ దేశవ్యాప్తంగా మద్యం వినియోగంలో తగ్గుదల ధోరణి నమోదైంది. ముఖ్యంగా యువతలో ఆరోగ్యకరమైన జీవనశైలిపై ఆసక్తి పెరగడం దీనికి తోడ్పడుతున్న అంశంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న భారతదేశంలో ఈ మార్పు దేశ భవిష్యత్తుకు శుభసూచకంగా భావిస్తున్నారు. మద్యం, ఇతర అనారోగ్యకర అలవాట్లకు దూరంగా ఉంటూ జిమ్‌లు, క్రీడలు, యోగా, సమతుల ఆహారం వంటి ఆరోగ్యకర జీవనశైలిని ఎంచుకుంటున్న యువత దేశాన్ని మరింత ఆరోగ్యవంతమైన సమాజంగా తీర్చిదిద్దే శక్తిగా మారుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.



## రాజ్యసభ ముందుకు లీకేజీ బిల్లు

- అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం
- బిల్లును సభలో ప్రవేశపెట్టిన కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్
- కుర్చీపోతుందనే భయంతోనే డిమాండ్లు అంగీకరించారు
- విద్యార్థులపై కాల్పులకు కేంద్ర హోంశాఖ మంత్రిదే బాధ్యత
- ఈ సమయంలో ఆయన సభకు రాకుండా దాక్కున్నారు
- ఒకరోజు ఆయన్ను బయటకు లాగి ప్రజల ముందు నిలబెడ్తాం: ఖర్గే
- వర్సిటీల్లో ఆర్ఎస్ఎస్ వాళ్లనే తీసుకుంటున్నారని విమర్శ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** లోక్‌సభలో ఆమోదం పొందిన యాంటీ పేపర్ లీక్ చట్ట సవరణ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు వచ్చింది. కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. దీనిపై ఏడు గంటల పాటు చర్చించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, పేపర్ లీకేజీ వల్ల నష్టపోయేది విద్యార్థులే అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, కొత్త చట్టం ప్రకారమే నీట్ ప్రశ్నపత్రం లీక్ ఈ కేసు విచారణ జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తును మిగతా 2లో..

### విద్యార్థులపై జరిగిన అరాచకాలపై కమిటీ ఏర్పాటు చేయాలి

అమిత్ షాను తొలగించాలి: రాహుల్ డిమాండ్ 2లో..

## నాణ్యమైన విద్యకు ఉపాధ్యాయులు దీక్షబూనాలి

- విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతైనా ఖర్చుపెడుతుంది
- ఏం కావాలో అడగండి.. ఎలాగైనా తెచ్చిస్తా
- పిల్లల భవిష్యత్ తీర్చి దిద్దేందుకే విద్యాశాఖ చూస్తున్నా
- విద్యారంగం బలోపేతానికి కృషి
- కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలల అభివృద్ధి
- హాస్టళ్లలో వేయడంతో దెబ్బతింటున్న కుటుంబ బంధాలు
- మండలం క్లస్టర్‌గా విద్యా ప్రణాళిక రూపొందిస్తున్నాం
- ఉపాధ్యాయుల పదోన్నతలపై అనుమానాలు వద్దు
- 2034 వరకు నేనే ముఖ్యమంత్రిగా ఉంటా
- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,జూలై30(జనంసాక్షి):** తెలంగాణను విద్యాపరంగా అగ్రగామిగా నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్కూళ్లను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకే రాష్ట్ర బడ్జెట్‌లో ఏకంగా 9 శాతం నిధులను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ఓట్ల రాజకీయం కోసం కాకుండా, పిల్లల బంగారు భవిష్యత్తును దిద్ది తీర్చాలనే ఏకైక లక్ష్యంతోనే విద్యాశాఖ బాధ్యతలను తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. గతంలో ఉన్నవారు ఇరిగేషన్ శాఖను ఎంచుకుంటే, నేను విద్యాశాఖ బాధ్యతను నా వద్దే ఉంచుకున్నా. 80 వేల పుస్తకాలు చదివానన్న నాయకుడి కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది. కానీ నా ప్రాధాన్యత ప్రాజెక్టులు కావు, పిల్లల చదువులే అని సీఎం అన్నారు. లక్షల మంది ఇంజనీరింగ్ పట్టాలు పొందుతున్నా, ఉద్యోగానికి దరఖాస్తు మిగతా 2లో..

"ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార బాధ్యతలను నేనే తీసుకుంటా. పిల్లల సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలు నాతో కొట్లాడాలి. ఐఏఎస్‌లను బదిలీ చేయడం చాలా తేలిక, ఉపాధ్యాయులను బదిలీ చేయడం మాత్రం అంత సులభంకాదు. దేశానికి విద్య, వైద్యంలో నాయకత్వాన్ని తెలంగాణ నుంచి ఎందుకు ఇవ్వలేం. మండలాల్లో విద్యాభివృద్ధికి ఏం కావాలో ఉపాధ్యాయులు సలహాలు, సూచనలు ఇవ్వండి. టీచర్ల సలహాలను తీసుకుని అధికారులు అమలు చేస్తారు"
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,

### కూరగాయల సాగును ప్రోత్సహించండి

సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి

ఆర్గానిక్ సాగు దిశగా రైతులకు అవగాహన కల్పించండి

నిపుణుల కమిటీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నివేదికను అందజేసిన కమిటీ 2లో..

## పొంగుతున్న నదులు.. నిండుతున్న జలాశయాలు



- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత
- ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు
- మేడిగడ్డ వద్ద వరద ఉధృతితో 85 గేట్లు ఎత్తివేత
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద ఉధృతి
- కడెం జలాశయానికి భారీగా వరదనీరు చేరిక
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి మట్టం
- బొగత జలపాతం సందర్శన నిలిపివేత

**హైదరాబాద్,జూలై30(జనంసాక్షి):** వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే రానున్న మరో మూడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణ వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు నదులు, ఉపనదులు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ, మహారాష్ట్రల్లోని ఎగువ ప్రాంతాల్లో మిగతా 2లో..





## అమెరికా దాడులతో దద్దరిల్లుతున్న ఇరాన్

ఖేష్మ్ ద్వీపాన్ని, అణువిద్యుత్ కేంద్రం ఉన్న తీరనగరం బుషెహర్‌ను లక్ష్యంగా బాంబుల వర్షం

**టెహ్రాన్(జనంసాక్షి):** అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణలు మళ్లీ పతాకస్థాయి చేరుకున్నాయి అగ్రరాజ్యం చేస్తోన్న దాడులతో ఇరాన్ దద్దరిల్లుతోంది. జోర్డాన్‌లోని తమ స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ చేసిన దాడికి ప్రతిగా ఈ శక్తిమంతమైన దాడులు చేపట్టామని యూఎస్ మిలిటరీ వెల్లడించింది. జోర్డాన్‌లోని బేస్‌లపై దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా పరిగణించారు. "మేం వారిని గట్టిగా దెబ్బకొడతాం" అని ప్రకటించారు. ఆ క్రమంలోనే మిగతా 9లో..

## మోదీ రాజీనామా చేసి మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

- విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు
- కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక
- హామీని కేంద్రం నిలబెట్టుకోవాలి: వాంగ్‌చుక్



**పుణె(జనంసాక్షి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు దీప్కే ఎద్దేవా చేశారు. మిగతా 2లో..

### మందుగుండు సామాగ్రి వివరాలు భద్రపరచండి

సుప్రీంలో పెల్లెట్ గన్స్ వినియోగంపై విచారణ 2లో..

నీట్ ఆందోళనలు..

## చట్టపరమైన చర్యలు వద్దు

ఢిల్లీ ప్రభుత్వం ప్రకటన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నీట్ పేపర్ లీకేజీని ఖండిస్తూ జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలిపిన ఆందోళనకారులపై చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. నిరసనల్లో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. అయితే, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం.. ఇప్పటికే నేర చరిత్ర కలిగిన వ్యక్తులకు ఈ మినహాయింపు వర్తించదని స్పష్టం చేసింది. మరోవైపు జులై 29న జరిగిన ఆందోళనల్లో 13 కేసులు నమోదైనట్లు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. నీట్ ప్రశ్నపత్రం మిగతా 2లో..

# నీట్ ఆందోళనలు.. చట్టపరమైన చర్యలు వద్దు

లీకేజీని నిరసిస్తూ కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) ఇటీవల చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తంగా మారిన సంగతి తెలిసిందే. చలో పార్లమెంట్ కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున నిరసనకారులు రోడ్లమీదకి రావడంతో పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. పలువురిపై కేసులు నమోదయ్యాయి.

# మందుగుండు సామాగ్రి వివరాలు భద్రపరచండి

## సుప్రీంలో పెల్లెట్ గన్స్ వినియోగంపై విచారణ

న్యూఢిల్లీ,జూలై30(జనంసాక్షి):జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో ఢిల్లీ పోలీసులు పెల్లెట్ గన్స్ వినియోగంపై వివాదం నడుస్తోంది. దీనిపై గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జనసమూహాన్ని నియంత్రించే సమయంలో పోలీసుల బలప్రయోగం ఎలా ఉండాలనే అంశంపై అమలులో ఉన్న గ్రేడెడ్ యూజ్ ఆఫ్ ఫోర్స్ స్టాండింగ్ ఆర్డర్‌ను కోర్టు ముందు సమర్పించాలని ఆదేశించింది. వాడటానికి స్పష్టమైన రూల్స్ ఉండాలని జస్టిస్ బాగ్చీ వ్యాఖ్యానించారు. అదే సమయంలో పెల్లెట్ గన్స్‌నూ పూర్తిగా నిషేధించలేమని చెప్పింది. మరోవైపు పిటిసనర్ల తరుపున న్యాయవాది వాదిస్తూ.. ప్రస్తుతం అమలులో ఉన్న మార్గదర్శకాల్లో నిరసనల సమయంలో మెటాలిక్ పెల్లెట్ గన్స్ వినియోగానికి అనుమతి లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ అలాంటి ఆయుధాలు వాడకంపై పోలీసుల చర్యలపై విచారణ కోరారు. ఈ వాదనల్ని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం, క్రౌడ్ కంట్రోల్‌లో బలప్రయోగానికి సంబంధించిన అధికారికి స్టాండింగ్ ఆర్డర్‌ను రికార్డ్‌లో ఉంచాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. అత్యవసర పరిస్థితుల్లో పెల్లెట్ గన్స్ వాడే అధికారం పోలీసులకు ఉందని చెప్పింది. ఇదే సమయంలో పోలీసులు వాడిన మందుగుండు సామాగ్రికి సంబంధించిన వివరాలు భద్రపరచాలని ఆదేశించింది. పెల్లెట్ గన్స్ కాల్పుల్లో గాయపడిన వారికి పూర్తి న్యాయ సహాయం అందించాలని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌ను ఆదేశించింది. ఈ కేసు విచారణలో ఢిల్లీ పోలీసులు సమర్పించే స్టాండింగ్ ఆర్డర్, పెల్లెట్ గన్ వినియోగంపై కోర్టు చేపట్టే పరిశీలన కీలకంగా మారే అవకాశం ఉంది.

# మోదీ రాజీనామా చేసి మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

దేశాన్ని పాలించడం కంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యతను మ రో నాయకుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువతలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉద్ధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు. వీరు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును ఇలాంటి పరిస్థితులకు గురి చేస్తే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే అవసరమైతే ప్రభుత్వాన్నీ మార్చే ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. ఈసారి ఆందోళన మరింత భారీస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సీజేపీ నిరసన సందర్భంగా విద్యార్థులపైపెల్లెట్ గన్ వినియోగించిన ఘటనపైనా అభిజీత్ స్పందించారు. అమిత్ షా అయినా, మరెవరైనా సరే పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను సీజేపీ వ్యవస్థాపకుడు తిప్పికొట్టారు. కార్యకర్తలు 36 రోజుల పాటు ఎండ, వర్షాన్ని లెక్కచేయకుండా కష్టపడి పోరాడారని, అలాంటి విజయం తర్వాత సంబరాలు చేసుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. తమ కార్యకర్తలు బీజేపీ మాదిరిగా రహదారులను దిగ్బంధం చేయలేదన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని విమర్శించారు.

**హామీని కేంద్రం నిలబెట్టుకోవాలి: వాంగ్‌చుక్**

యువతకు, ప్రభుత్వానికి మధ్య నమ్మకమే కీలకమని పర్యావరణ ఉద్యమకారుడు వాంగ్‌చుక్‌అన్నారు. అప్పుడే అద్భుతమైన దేశ నిర్మాణం సాధ్యపడుతుందని చెప్పారు. 'పబ్లిక్ పరీక్షల (అనుచిత పద్ధతుల నివారణ) సవరణ బిల్లు 2026'ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడాన్ని ఆయన స్వాగతించారు. కేవలం పరీక్షల్లో మాత్రమే కాకుండా.. దేశ విద్యా వ్యవస్థలో సమగ్ర మార్పులు తీసుకొచ్చేందుకు ఈ బిల్లు దోహదం చేస్తుందన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ వీడియో పోస్టు చేశారు.నీట్ ప్రశ్నపత్రం లీకేజీ నేపథ్యంలో దిల్లీలో చోటు చేసుకున్న ఆందోళనలపైనా ఆయన మాట్లాడారు. ఆందోళనకారులపై నమోదైన కేసులను కొట్టివేస్తామని లిఖిత పూర్వక హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం దానికి కట్టుబడి ఉండాలన్నారు.

## నాణ్యమైన విద్యకు ఉపాధ్యాయులు

# దీక్షబూనాలి



రాసుకోలేని పరిస్థితి రాకూడదని, విద్యా ప్రమాణాలను పెంచడమే తమ నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. చిన్న తనంలోనే పిల్లలను హాస్టళ్లలో వేయడం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బ తింటు న్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంటరి గా పెరిగే పిల్లలు పెద్దయ్యాక తల్లిదండ్రులను వృద్ధాశ్ర మాలకు పంపే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులే తల్లిదండ్రుల స్థా నంలో ఉండి పిల్లలకు సరైన మార్గదర్శనం చేయాలని పిలుపు నిచ్చారు. ప్రత్యామ్నాయం గా, ప్రతి మండలాన్ని ఒక క్లస్టర్‌గా తీసుకుని విద్యా ప్రణాళికలు తయారు చేయాలని సూ చించారు. విద్యాబోధనలో అంతర్జాతీయ ప్ర మాణాలు అందించేందుకు ఏటా 10 నుండి 12 మంది ఉపాధ్యాయులను 'స్టడీ లీవ్'పై విదేశాలకు పంపిస్తామని ప్రకటించారు. టీచర్ల ప్రమోషన్లు, బదిలీల బాధ్యతను తానే చూసుకుంటానని, అడగకుండానే ఒకటో తేదీన జీతాలు వేస్తున్నామని గుర్తుచేశారు. ఇదే క్రమంలో తన రాజకీయ ప్రస్థానంపై స్పందిస్తూ 2034 వరకు నేనే సీఎంగా ఉంటాను, ఎలాంటి సందేహాలు వద్దని ధీమా వ్యక్తం చేశారు. దీనిపై ఎవరూ ఎలాంటి అనుమానాలు, దౌట్లు పెట్టుకోవాల్సిన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయుల బృందంతో ఇవాళ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్వహణలో తాము మానవత్వంతో వ్యవహరిస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులతో మాట్లాడిన సీఎం, వారి సమస్యల పరిష్కార బాధ్యతను పూర్తిగా తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రమోషన్లు, బదిలీలు ఇంటికే వస్తాయని, ఉపాధ్యాయులు కేవలం విద్యార్థుల భవిష్యత్తు, బడులలో సౌకర్యాల పైనే దృష్టి పెట్టాలని కోరారు. ఐఏఎస్ అధికారుల నైనా సులభంగా బదిలీ చేయవచ్చుని, కానీ టీచర్ వ్యవస్థ అత్యంత శక్తివంతమైనదని కొనియాడారు. బడులలోని పిల్లల సమస్యలపై తనతో చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడులలో చదివితే ఏం అవుతావు?' అని ఎవరైనా అడిగితే, 'తెలంగాణ సీఎం అవుతాను' అని పిల్లలు ధైర్యంగా చెప్పాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తాను స్వయంగా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని, ఎలాంటి మంత్రి పదవి అనుభవం లేకపోయినా ఈరోజు సమర్థవంతంగా రాష్ట్రాన్ని పాలిస్తున్నానని గుర్తుచేశారు. ఇటీవల తాను హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని చెబుతూ, కేవలం తెలివి ఉంటే సరిపోదని, క్రమశిక్షణే మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడుతుందని నొక్కి చెప్పారు. ఉపాధ్యాయులు అడగకపోయినా 2024 జనవరి నుంచి ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా సమయానికి వేతనాలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ ఛార్జీలను సైతం పెంచామని వివరించారు. అమెరికాపైనే కాకుండా జర్మనీ, జపాన్ వంటి దేశాల వైపు దృష్టి సారించాలని, భాష అనేది కేవలం ఒక సంభాషణ మాధ్యమం మాత్రమేనని పేర్కొన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమై సమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇకపోతే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అప్పులు ఎక్కువగా చేశారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందరూ ప్రధాన మంత్రుల కంటే మోదీ అప్పులు ఎక్కువ చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకూ రూ.51లక్షల కోట్ల అప్పు ఉందని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు ప్రధాని రూ.151లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. విమర్శలు గుర్తు చేసుకుంటూ ఉంటే మనం మనుగడ సాధించలేమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుకి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. విద్యావ్యవస్థ తమ హయాంలో బలపడిందని తెలిపారు. 28వ స్థానంలో ఉన్న మన రాష్ట్రం ఇప్పుడు దేశంలో 18వ స్థానానికి చేరిందని వ్యాఖ్యానించారు. తాను ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. విద్యాశాఖకు మంత్రి లేరని.. తాను రాజీనామా చేయాలని ప్రతిపక్షాల నేతలు అంటున్నారని అన్నారు. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్, స్నాక్స్ పెట్టినందుకు రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. తాను కూడా మెళకువలు నేర్చుకోవడానికి హార్వర్డ్ వెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

# కూరగాయల సాగును ప్రోత్సహించండి

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది. గత ఏడాది ఈ సీజన్ లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్ప్రింక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందించి? పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది.



# వందేమాతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ(జనంసాక్షి):'వందేమాతరం' బిల్లును లోక్‌సభ ఆమోదించింది. విపక్షాల ఆందోళనల మధ్యే మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లును రాజ్యసభ బుధవారం ఆమోదించిన సంగతి తెలిసిందే. వందేమాతర గేయాన్ని అవమానించినా, ఆలపిస్తుండగా ఆటంకం కలిగించినా నేరంగా పరిగణించేందుకే కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చింది. వందేమాతరం బిల్లులో భాగంగా ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్-1971లో సవరణలు చేసింది. రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత ఇది చట్టంగా మారనుంది.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసే) శాఖ
కలెక్టరేట్ :: మహబూబ్‌నగర్

**ఫారం -VII**
**ప్రకటన**

(చట్టం-30 ఆఫ్ 2013లోని సెక్షన్ 19(1) మరియు రూల్-25 యొక్క సబ్ రూల్ (1) చూడండి)

నెం.ఆర్ఇవి/జి1/ఎల్ఏజి/0024/2026-జి-సెక్షన్ తేది: 16-07-2024

తెలంగాణ ప్రభుత్వం / కలెక్టర్ వారు మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలం, మద్దిగట్ల గ్రామంలో మొత్తం విస్తీర్ణం ఎ. 3.15 గుంటల గల భూమి ప్రజా ప్రయోజనం కోసం అనగా మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం క్రింద కమలుద్దీన్ మేజర్ కాలువ ఘన్‌పూర్ బ్రాంచ్ కాలువ త్రవ్వకం కొరకు అవసరమైందని ప్రభుత్వం వారు భావిస్తున్నారు.

కావున మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలం, మద్దిగట్ల గ్రామంలో పైన తెల్పిన సదరు ప్రాజెక్టు కొరకు స్వాధీనత క్రింద ఎ. 3.15 గుంటల మొత్తం కొద్దిగా ఎక్కువ లేదా తక్కువ ప్రామాణిక కొలతల గల భూమి యొక్క భాగం కొరకు ప్రకటన జారీ చేయబడినది. దాని యొక్క వివరణాత్మక వివరము ఈ దిగువ విధంగా ఉన్నది.

గ్రామం:మద్దిగట్ల మండలం:భూత్పూర్ జిల్లా: మహబూబ్‌నగర్

| క్రమ సంఖ్య | సర్వే నెం. | మెట్ట/ఐ.తరి/మాగాణి | భూమి రకం | సేకరణ క్రింద ప్రతిపాదించిన విస్తీర్ణం (ఎకరాల్లో) ఎ.గుం. | ఆసక్తి గల వ్యక్తి పేరు & చిరునామా | సరిహద్దులు ఉ | ద | తూ | ప | [illegible] | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 401 | మెట్ట | పట్టా | 0.23 | బండ శ్రీశైలం తండ్రి బండ చంద్రయ్య | 399 | విబి | విబి | 402 | - | - |
| 2 | 402 | మెట్ట | పట్టా | 0.01 | పి.తిరుపతయ్య తండ్రి గోపాల్ | 397 | 402 | 399 | 404 | - | - |
| 3 | 403 | మెట్ట | పట్టా | 1.08 | భానుమతి భర్త జనార్ధన్ | 397 | 402 | 399 | 404 | - | - |
| 4 | 404 | మెట్ట | పట్టా | 0.15 | ఎర్రగొల్ల వెంకటయ్య తండ్రి బుచ్చన్న | 412 | విబి | 403 | 405 | - | - |
| 5 | 443 | మెట్ట | పట్టా | 0.10 | ప్రభుత్వ భూమి | 433 | 439 | 429 | 435 | - | - |
| 6 | 444 | మెట్ట | పట్టా | 0.36 | సొన్నతి విజయలక్ష్మి భర్త మురళీధర్ | 445 | విబి | 437 | 450 | - | - |
| 7 | 534 | మెట్ట | పట్టా | 0.02 | సొన్నతి విజయలక్ష్మి భర్త మురళీధర్ | 530 | 444 | 445 | 549 | - | - |
| | మొత్తం: | | | 3.15 | | | | | | | |

చట్టం నెం. 30 ఆఫ్ 2013 యొక్క సెక్షన్ 15 క్రింద ఇవ్వబడిన విధంగా తగు విచారణ మరియు ఆసక్తి గల వ్యక్తుల నుంచి అభ్యంతరాలను విచారించిన పిమ్మట తరువాత ఈ ప్రకటన జారీ చేయనైనది. భూస్వాధీనత కారణంగా ఎటువంటి కుటుంబాలు పునరావాసం జరగలేదు.

భూసేకరణ తలపెట్టిన సదరు ప్రాజెక్టు నిర్మాణ దశలో త్రవ్వవలసిన తొలగించవలసిన లేదా ఉపయోగించవలసిన గనులు లేదా ఖనిజాలలో అట్టి భాగం సదరు భూమి నిర్దిష్ట భాగంలో ఉన్న బొగ్గు, ఇనుము, రాయి, పలక లేదా ఇతర ఖనిజాల గనులు అవసరం లేదు.

భూమి ప్లాన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎల్ఏ ఆర్&ఆర్, యూనిట్-II, ఇరిగేషన్ ప్రాజెక్ట్, మహబూబ్‌నగర్ వారి కార్యాలయంలో ఏ పని దినమునైనా పరిశీలించుకొనవచ్చును.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్ఏ ఆర్&ఆర్ యూనిట్, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, మహబూబ్‌నగర్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహబూబ్‌నగర్
సం/- ఖుష్బూ గుప్త ఐఎఎస్ జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్

DIPR RO.No.545/LA/PP/Advt/Pub/2026-27


# విద్యార్థులపై జరిగిన 'అరాచకాల'పై కమిటీ ఏర్పాటు చేయాలి

న్యూఢిల్లీ(జనంసాక్షి):దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీఛార్జ్ జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. విద్యార్థులకు న్యాయం జరగాలని, వారిపై జరిగిన 'క్రూరత్వాల'పై విచారణ జరిపేందుకు సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఒక కమిటీని నియమించి దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ 'క్రూరమైన హింస'పై వివరణ ఇవ్వడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు రావడానికి 'భయపడుతున్నారని' వ్యాఖ్యానించారు. అమిత్ షా పార్లమెంట్‌కు రాకపోవడం ఆయనలోని అపరాధ భావనను స్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించారు. జులై 20న జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జ్‌కు సంబంధించిన వీడియోను రాహుల్‌ఎక్స్‌లో పంచుకున్నారు. అంతకుముందు విద్యార్థులపై పెల్లెట్ గన్‌లను ఉపయోగించారని ఆరోపిస్తూ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను పదవి నుంచి తొలగించాలని బుధవారం డిమాండ్? చేశారు. ఒకవేళ దేశంలో నిరసనకారులపై పెల్లెట్ గన్లు వాడుతున్న విషయం హోంమంత్రికే తెలియకపోతే ఆయన ఆ పదవికి ఏమాత్రం సమర్థుడు కాదని కీలక వ్యాఖ్యలు చేశారు. పోలీసుల దురాగతాలు, విద్యార్థి నిరసనకారులపై దాడుల వెనుక అమిత్ షా ఉన్నారని రాహుల్ ఆరోపించడంతో, పార్లమెంటు లోపల, వెలుపల అధికార పక్షం నుంచి భారీ నిరసనలు వెల్లువెత్తాయి. లోక్‌సభలో రాహుల్ చేసిన వ్యాఖ్యలను స్పీకర్ తొలగించారు.

**పార్లమెంట్‌ఆవరణలో విపక్షాల నిరసనలు**

మరోవైపు, అయోధ్యలోని రామమందిర ఆలయ విరాళాలు దుర్వినియోగం అయ్యాయని ఆరోపిస్తూ, విపక్షాలు పార్లమెంట్ ప్రాంగణంలో మకర ద్వారం వద్ద నిరసన చేపట్టాయి. ఇండీ కూటమికి చెందిన పలువురు ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శించారు. అలాగే జంతర్ మంతర్ వద్ద జరిగిన పోలీసు చర్యకు ఎవరు ఆదేశించారని ప్రశ్నిస్తూ, ఆ ఘటనపై కేంద్రం సమాధానం చెప్పాలని నినాదాలు చేశారు.ఇదిలా ఉండగా, రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ గట్టి కౌంటర్? ఇచ్చింది. విపక్ష నేత నిరాధారమైన ఆరోపణలు చేసి సభను దుర్వినియోగం చేస్తున్నారని, అందుకు గానూ ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎదురుదాడి చేసింది.

**విద్యావ్యవస్థలో అవినీతి లోతుగా పాతుకుపోయింది!**

భారత విద్యావ్యవస్థలో అవినీతి, లోపాలు చాలా లోతుగా పాతుకుపోయాయని కాంగ్రెస్ ఆరోపించింది. ఇటీవల కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం అనేది వ్యవస్థ సమగ్రతను పునరుద్ధరించే సుదీర్ఘ ప్రయాణంలో కేవలం మొదటి అడుగు మాత్రమే గురువారం వ్యాఖ్యానించింది.మహారాష్ట్రలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ ప్రవేశాల ప్రక్రియ ఇప్పుడు తీవ్ర విమర్శలపాలైందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. గత మూడేళ్లుగా ఇంజినీరింగ్ కోసం నిర్వహించే మహారాష్ట్ర కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలకు, 12వ తరగతి బోర్డ్ పరీక్షల మార్కులకు మధ్య భారీ వ్యత్యాసం ఉందన్నారు. టాపర్లుగా నిలిచిన వారు తమ బోర్డు పరీక్షల్లో రాణించలేకపోతున్నారని, ఇలా ఎందుకు జరుగుతుందన్న విషయంపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అయితే, పేపర్ లీకేజీలను అరికట్టడానికి, కేంద్రం తీసుకొచ్చిన ఫాస్ట్ ట్రాక్ కోర్టులతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకదని ఆయన స్పష్టం చేశారు.కాగా, పేపర్ లీక్ ఘటనలను అరికట్టడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీని ద్వారా పేపర్ లీకేజీలకు పాల్పడిన నిందితులను విచారించి, 2 నుంచి 3 నెలల్లో కఠిన శిక్షలు ఖరారు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. అలాగే, దోషులుగా తేలిన వ్యక్తులకు 5 నుంచి 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించనుంది.

# రాజ్యసభ ముందుకు లీకేజీ బిల్లు

సీబీఐకి అప్పగించినట్లు చెప్పారు. దర్యాప్తు సంస్థ ఇప్పటికే ఛార్జ్‌షీటు కూడా దాఖలు చేసినట్లు తెలిపారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చను రాజ్యసభలో ప్రారంభించిన మంత్రి జితేంద్రసింగ్ నీట్ పేపర్ లీక్‌పై దర్యాప్తు ఐదు నెలల్లో పూర్తవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై మంత్రి జితేంద్రసింగ్ విమర్శలు గుప్పించారు. ఆర్టికల్ 370 రద్దు, ఎన్టీఏ ఏర్పాటు ఆలస్యానికి కారణం ఎవరని ప్రతిపక్షాలను నిలదీశారు.'ఇటీవలి కేసుకు సంబంధించి వెంటనే సీబీఐకి అప్పగించాం. మొన్న ఛార్జిషీట్ దాఖలు చేశాం. నిన్నటి నుంచి విచారణ ప్రారంభమైందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ఈ కొత్త చట్టం ప్రకారం దర్యాప్తు 2 నెలల్లో పూర్తవుతుంది. ఆ తర్వాత మూడునెలల్లో విచారణ జరుగుతుంది. అంటే మొత్తం 5నెలల్లో ప్రక్రియ పూర్తవుతుంది. వారి నిబద్ధతగా ఉన్న ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి 70ఏళ్లు పట్టింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని తీసుకురాకుండా అడ్డుకోవడానికి 33ఏళ్లు తీసుకున్నారు. ఇప్పుడు ఈ బిల్లును తీసుకువస్తున్న తరుణంలో వారు చేస్తున్న గగ్గోలు బిల్లుకు వ్యతిరేకం కాదు. ఇకపై ప్రమాదంలో పడబోయే వారి స్వార్థ ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరుగుతున్న గగ్గోలు ఇది. 33ఏళ్లపాటు వారు చేయలేని పని ఇప్పుడు నెరవేరబోతోంది' ఖర్గే తెలిపారు. కుర్చీపోతుందనే భయంతోనే కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లకు అంగీకరించిందని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఏమాత్రం లేదన్నారు. రాజ్యసభలో యాంటీ పేపర్ లీక్ చట్టసవరణ బిల్లుపై మాట్లాడిన ఖర్గే, విద్యార్థులపై పెల్లెట్ గన్ల వాడకానికి కేంద్ర హోంశాఖ మంత్రిదే బాధ్యత అని, ఇప్పుడు ఆయన దాక్కున్నారని ఎద్దేవా చేశారు. ఒకరోజు ఆయన్ను బయటకు లాగి ప్రజల ముందు నిలబెడ్తామని ఖర్గే తేల్చిచెప్పారు.పరీక్షలు, ఉద్యోగుల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఖర్గే అన్నారు. పాఠశాలలు, కళాశాలలు, వర్సిటీల్లో 10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా వికసిత్ భారత్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వర్సిటీల్లో వీసీలు, ప్రొఫెసర్లలో ఆర్ఎస్ఎస్ వాళ్లనే తీసుకుంటున్నారని, అర్హతలు లేకుండానే వారిని నియమిస్తున్నారని విమర్శించారు. యూనివర్సిటీల్లో వీసీలు, బోధకులుగా సమర్థులనే నియమించాలని చెప్పారు. విద్యా వ్యవస్థలో మను స్మృతిని, ఆర్ఎస్ఎస్ సిలబస్‌ను పెడుతున్నారని ఆరోపించారు. వేద పాఠశాలల్లో చదివే బడుగు వర్గాలను వేధిస్తున్నారని అన్నారు.మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై ఎన్డీఏ ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థ, సిలబస్‌పై ఖర్గే చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేపీ నడ్డా మాట్లాడుతూ, మను స్మృతిపై ఖర్గే వ్యాఖ్యలతో సమాజంలో అశాంతి నెలకొంటుందని అన్నారు. ఇలాంటి విషయాలు సభలో ప్రస్తావించడం సరికాదని తెలిపారు. ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తామని చెప్పారు.

# పొంగుతున్న నదులు.. నిండుతున్న జలాశయాలు

వర్షాపాతం తీవ్రమవడంతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని పలు కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలాశయాలు సంతరించుకుంటున్న జలకళ రైతుల్లోనూ, ప్రజల్లోనూ తీవ్ర ఆనందాన్ని నింపుతోంది. నిజామాబాద్ జిల్లాలోని ప్రతిష్టాత్మక శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 12,900 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, ప్రాజెక్టు నీటి నిల్వ 17.103 టీఎంసీలకు చేరింది. కాకతీయ కాలువ ద్వారా దిగువకు 300 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. అలాగే, నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలంలో ఉన్న స్వర్ణ ప్రాజెక్టుకు ఉదయం వేళకు నీటి సామర్థ్యం అర టీఎంసీ దాటి, ఇన్ ఫ్లో దాదాపు 10 వేల క్యూసెక్కులకు చేరింది. నిర్మల్ జిల్లాకే తలమానికమైన కడెం ప్రాజెక్టుకు వరద నీరు విపరీతంగా పోటెత్తుతోంది. ఉదయం 11:00 గంటల సమయానికి కడెం ప్రాజెక్టుకు ఏకంగా 77,442 క్యూసెక్కుల భారీ ఇన్ ఎ÷-లో నమోదు కాగా, పరిస్థితికి అనుగుణంగా అధికారులు 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇక జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద ప్రాణహిత, గోదావరి ఉభయ నదులు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అక్కడ నీటిమట్టం 6.320 మీటర్ల ఎత్తులో మెట్ల వద్దకు చేరడంతో తీరం కొత్త రూపు సంతరించుకుంది. గోదావరి జలాలు పోటెత్తడంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ కి ఇన్ ఫ్లో భారీగా పెరిగింది. ఎన్డీఎస్ఏ సూచనలను పాటిస్తూ అధికారులు బ్యారేజ్ కి చెందిన మొత్తం 85 గేట్లను ఎత్తి ఉంచారు. ప్రస్తుతం అక్కడ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో సమంగా 1,01,530 క్యూసెక్కులుగా కొనసాగుతుండటంతో గోదావరి ప్రవాహం దిగువకు వేగంగా పయనిస్తోంది. ప్రాజెక్టుల్లో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతుండటంతో నీటిపారుదల శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురియనుండటంతో 9 జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు భారీ వర్షాల నేపథ్యంలో 6 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాలకు ఉత్తర తెలంగాణతో పాటు నిజామాబాద్ జిల్లాలోని చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలను దృష్టిలో పెట్టుకొని జగిత్యాల జిల్లాలో పాఠశాలలకు సెలవను ప్రకటించారు. ఈ సీజన్‌లో తొలిసారిగా జూరాల ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదలారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితోపాటు, పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటిమట్టం పెరుగుతోంది. గురువారం ఉదయానికి 27 అడుగులకు చేరింది. నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తున్నది. దీంతో అప్రమత్తమైన ప్రాజెక్టు అధికారులు ప్రాజెక్టు 6 వరద గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఇన్ ఫ్లోగా ప్రాజెక్టులోకి 77,442 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు 6 వరద గేట్లు 10 ఫీట్లు గేట్లు ఎత్తి అవుట్ ఎ÷-లోగా 67, 000 క్యూసెక్కుల నీటిని దిగవనున్న గోదావరిలోకి అధికారులు వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు 3.495 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 693.725 అడుగులు 2.212 టీఎంసీలలో ప్రాజెక్టు నీటి సామర్థ్యం కొనసాగుతుంది. కడెం ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రవాహ ప్రాంతాలకు ఎవరు కూడా వెళ్లకూడదని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని అధికారులు కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు మత్తడి పారుతున్నాయి. ఆదిలాబాద్ సహా ఇంద్రవెల్లి, తలమడుగు మండలాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఉట్నూరు, నార్నూరు, జైనూరు మండలాల్లో రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి నర్సాపూర్, శాంతాపూర్ వాగులు పొంగాయి. దీంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బ్యారేజ్‌కి వరద ప్రవాహం పోటెత్తుతుంది. గురువారం బ్యారేజ్ వద్ద 81,060 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా బ్యారేజ్‌లోని 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరదనీటిని భారీ నీటిపారుదల శాఖ అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బ్యారేజీకి వరద ప్రవాహం మరింత పెరుగుతుందని, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం లో కురుస్తున్న భారీ వర్షానికి చీకుపల్లి అటవీప్రాంతంలో ఉన్న తెలంగాణ నయాగర బొగత జలపాతం ఉప్పొంగింది.

# కడెం ప్రాజెక్టుకు భారీగా వరద

- 16 గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల





**కడెం, జూలై 30 (జనంసాక్షి) :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. భారి నుండి అతిబరీ వర్షాలు కుడుతున్న కారణంగా నిర్మల్ జిల్లాలోని కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు నిండికుండ లాగా మారింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు3.495 కాగా ప్రస్తుతం 691.775, 1.883/ టీఎంసీల వద్ద కొనసాగుతుంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాజెక్టులోకి 1,29,982 క్యూసెక్కుల భారీ వరద నీరు చేరడంతో, ప్రాజెక్టు 16 గేట్లు ఎత్తి గోదావరిలోకి 1,49,852 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, జె ఈ మురళి మాట్లాడుతూ...లోతట్టు ప్రాంత ప్రజలు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, గోదావరి నది ప్రవాహక ప్రాంతంలోకి జాలరులు, పశువుల కాపరులు ఎవరు రాకూడదని విజ్ఞప్తి చేశారు.

**కడెం ప్రాజెక్టును సందర్శించిన ఎస్పీ జానకి షర్మిల...**

కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టుకు భారీ వరద నీరు రావడంతో గురువారం రోజున 9 గేట్లు ఎత్తి నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు వద్ద భద్రతా చర్యలను పరిశీలించారు. నిర్మల్ జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో ప్రాజెక్టులోకి వరద ప్రవాహం భారీగా పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు వద్ద క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను, వరద ఉధృతిని ఆమె పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి ప్రస్తుత నీటి మట్టం, వరద ప్రవాహం వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరద ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులకు, పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ పలు కీలక సూచనలు చేశారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ప్రాజెక్టు సమీపంలోకి ఎవరూ వెళ్లకూడదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# కన్న తండ్రే కాటేశాడు!


- బాలికపై పలుమార్లు లైంగిక దాడి
- బాలిక స్నేహితురాలి ద్వారా బయటకు పక్కన దారుణం
- సి డబ్ల్యూ సి కి సమాచారం ఇచ్చిన ప్రిన్సిపల్
- వికారాబాద్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు నిందితుడు అరెస్టు రిమాండ్



**వికారాబాద్ జిల్లా బ్యూరో జులై 30 (జనం సాక్షి) :** కంటికి రెప్పల కాపాడవలసిన తండ్రి వారి పాలిట కాలయముడయ్యాడు. కామంతో కళ్ళు మూసుకుపోయి అనేక సార్లు కన్నా కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ దారుణ సంఘటన వికారాబాద్ జిల్లా రాజీవ్ గృహకల్పన జరిగింది. వికారాబాద్ సిఐ రఘు కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ పట్టణంలోని రాజీవ్ గృహకల్ప లో నివాసముంటున్న ఒక మైనర్ బాలికపై కన్న తండ్రి జగన్నాథం(44) అనేకసార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు తెలియజేశారు. ఈనెల 27వ తేదీన సిడబ్ల్యుసి సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలియజేశారు. నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన జగన్నాథం గత 20 సంవత్సరాల క్రితం వికారాబాద్ కు బతుకుదెరువుకోవచ్చు స్థిరపడ్డాడు. వృత్తిరీత్యా ఆటో డ్రైవర్ అయినా జగన్నాథం ఆటో నడుపుకుంటూ జీవనోపాధి గడుపుతున్నాడు. తన ముగ్గురు కూతుళ్లను పట్టణంలోని ఒక సమీకృత హాస్టల్లో ఉంచి చదివిస్తున్నాడు. జగనాథంకు ఇద్దరు భార్యలు ఒక భార్యకు ముగ్గురు కూతుళ్లు కాగా మరో భార్యకు ఇద్దరు కూతుళ్లు ఒక కుమారుడు ఉన్నాడు. మొదటి భార్య చనిపోవడంతో రెండో పెండ్లి చేసుకున్నాడు. ఆమె మొదటి భార్య కూతుళ్లను సరిగ్గా చూసుకోక పోవడంతో హాస్టల్లో ఉంచి చదివిస్తున్నాడు. సెలవుల సమయంలో కూతుళ్లను ఇంటికి తెచ్చే క్రమంలో మూడో కూతురుపై అనేకసార్లు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఇటీవల ఒక అడవి ప్రాంతంలోని పాడుబడిన బంగ్లాలోకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడడంతో తండ్రి వేధింపులు తట్టుకోలేక ఆ మైనర్ బాలిక తోటి స్నేహితురాలికి జరిగిన దారుణాన్ని వివరించింది. ఈ విషయం ఆ బాలిక హాస్టల్ ప్రిన్సిపాల్ కు తెలియజేయడంతో వారు సిడబ్ల్యుసి సభ్యులకు సమాచారం అందించారు. వారు బాలిక కౌన్సిలింగ్ ఇచ్చి జరిగిన దారుణాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సమాచారాన్ని వికారాబాద్ పోలీసులకు అందించడంతో పట్టణ సీఐ రఘుకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఆయన దర్యాప్తులో దారుణమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కన్న కూతురికి నీలి చిత్రాలు అశ్లీత చిత్రాలు చూపిస్తూ మైనర్ బాలికపై అనేకసార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు తేలింది. ఈ విషయమై మైనర్ బాలికకు పోలీసులు వైద్య పరీక్షలు నిర్వహించారు. మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. విషయం తెలిసిన నిందితుడు పరారీ కావడంతో నిందితుని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. నిందితుడు ఒక ఆటోలు రాజీవ్ గృహ కల్పకు వచ్చినట్లు విశ్వంయ సమాచారం ద్వారా తెలుసుకున్న పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. విచారణ అనంతరం నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# హిందూత్వ అంటే మన జీవనవిధానం

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్య



**విజయవాడ, జూలై30 (జనంసాక్షి) :** హిందుత్వం అంటే మతం కాదని.. జీవన విధానమని భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. దేశభక్తి సమాజ ఐక్యత లోపిస్తే దేశం వెనకపడుతుందని పేర్కొన్నారు. గురువారం కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్లో 'కర్మవీరులారా కదిలి రండి' గీతం ఆవిష్కరణ, విద్యార్థులతో మాటామంతిలో పాల్గొని వెంకయ్యనాయుడు ప్రసంగించారు. మంచి గీతాలు వినాలని, తద్వారా స్ఫూర్తిని పొందాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వందేమాతరం గీతం మనందరికీ సమాధానమని తెలిపారు. అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని సూచించారు. శక్తివంతమైన భారత్ కావాలంటే యువతి, యువకుల పాత్రే కీలకమని ఉద్ఘాటించారు. మొబైల్ ఫోన్, యూట్యూబ్లపై యువత ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని చెప్పుకొచ్చారు. యువత మంచి గురువును ఎంచుకోవాలని, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను ఎక్కువగా చదవాలని సూచించారు. యువత తమ భవిష్యత్తును తామే నిర్దేశించుకునే స్థాయికి ఎదగాలని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

- అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాల స్వీకరణ
- జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సుల నిర్వహణ
- అధికారులతో సమీక్షించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, జూలై30 (జనంసాక్షి) :** అంగన్‌వాడీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాలు, సూచనలు స్వీకరించేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్లు, ఆయాలకు అందించే నూతన యూనిఫామ్‌లను పరిశీలించి, అక్టోబర్ మొదటి వారంలోగా వాటిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం 17 ఉన్న శిశు దత్తత కేంద్రాలను విస్తరించి ప్రతి జిల్లాలోనూ ఒక అడాప్షన్ సెంటర్ ఉండేలా చూడాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో కలెక్టర్లతో మాట్లాడి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ నిధులు ల్యాప్స్ కాకుండా పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులకు నిర్దేశిరచారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక పక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

# విధి నిర్వహణలో భయానికి తావు లేదు

- నిజాయితీగా విద్యుక్త ధర్మం నిర్వహించండి
- సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర





**న్యూఢిల్లీ, జూలై30 (జనంసాక్షి) :** సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. విధుల్లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సిబ్బందికి సన్మానం చేసిన కార్యక్రమంలో ఆయన ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. ఎలాంటి భయం లేకుండా పనిచేయాలని బలగాలకు పిలుపునిచ్చారు. సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్‌గా ఇక్కడ నేను మీకో హామీ ఇస్తున్నాను. విధులు నిజాయతీగా నిర్వర్తించడంలో మీరు తీసుకునే నిర్ణయాలు, చర్యలకు నేను బాధ్యత వహిస్తాను. ప్రజాప్రయోజనం కోసం తీసుకునే చర్యలకు జవాబుదారీగా వ్యవహరించాల్సి వస్తే.. దానిని నేను పూర్తిగా స్వీకరిస్తానని జ్ఞానేంద్ర తన సిబ్బందిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఈ నెల 20న 'చలో పార్లమెంటు' నిరసనల సమయంలో భద్రతా విధులు నిర్వర్తించిన సీఆర్పీఎఫ్-ఆర్‌ఏఎఫ్ బలగాలు, పోలీసులు.. విద్యార్థులపై బుల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతోన్న వేళ.. జ్ఞానేంద్ర ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఆరోపణలపై సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ అంతకుముందు కూడా స్పందించారు. ఏదైనా భారీ ఆపరేషన్ తర్వాత తాము వృత్తిపరమైన మూల్యాంకనం చేపడతామని చెప్పారు. నిరసనకారులపై ఆర్‌ఏఎఫ్ సిబ్బంది తీసుకున్న చర్యల విషయంలోనూ ఆ పరిశీలన చేస్తామని తెలిపారు. అది తమ నిబంధనల్లో భాగమేనని చెప్పారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు దేశవ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర పోలీసులతో సహకరిస్తూ.. వైవిధ్య పరిస్థితులకు తగ్గట్టుగా వేగంగా స్పందించగల సామర్థ్యం వారి సొంతం. ఇక, ఏదైనా ప్రాంతంలో ఘర్షణలు, రద్దీ, అశాంతియుత పరిస్థితులను నెలకొన్నప్పుడు వాటిని నియంత్రించేందుకు సీఆర్‌పీఎఫ్‌లోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ను రంగంలోకి దింపుతారు.

## భారీ వర్షాలపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**నిర్మల్ బ్యూరో, జూలై 30 (జనంసాక్షి) :** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జిల్లా ప్రజలకు భారీ వర్షాలు, వరదల కారణంగా ఏవైనా ఇబ్బందులు కలిగినట్లయితే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబరు 9100577132ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. 24 గంటల పాటూ కంట్రోల్ రూమ్ సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజల నుంచి వచ్చే కాల్స్ స్వీకరిస్తారని వివరించారు. వర్షాలు, వరదల వల్ల ప్రజలు ఎవరికైనా ఇబ్బందులు కలిగినట్లయితే పై కంట్రోల్ రూమ్ నంబరునకు సంప్రదించి సహాయం పొందవచ్చునని కలెక్టర్ ఆ ప్రకటన ద్వారా తెలిపారు.

## గోదావరిలో చేపల వేట వద్దు

- మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారుల ఆదేశం

**బాసర, జులై 30 (జనంసాక్షి) :** జిల్లాలో రాబోయే రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో జిల్లా మత్స్య శాఖ అధికారి మత్స్యకారులందరికీ కీలక సూచనలు జారీ చేశారు. భారీ వర్షాల కారణంగా గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో చేపల వేటపై నిషేధం విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ కారణంగా మత్స్యకారులు ఎవరూ కూడా చేపల వేటకు వెళ్లవద్దని కోరారు. ఎవరూ కూడా చెరువులు, వాగులు, కాలువులు, సరదా ఈత కొట్టడానికి వెళ్లవద్దని మత్స్య శాఖ స్పష్టం చేసింది. భారీ వర్షాల సూచన ప్రకారం చేపల వేట నిషేధించబడిందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువులు, కుంటల వద్ద చేపల కోసం వేసిన జాలీలు, వలలు వెంటనే తొలగించాలని మత్స్య శాఖ ఆదేశించింది. నిబంధనలు పాటించని వారి లైసెన్స్, సంఘాల రిజిస్ట్రేషన్ రద్దు చేయ బడుతుందని తెలిపారు.ముఖ్యంగా గోదావరి ప్రవాహిక మండలాల్లో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో టాం టాం ద్వారా కూడా ప్రజలకు సమాచారం అందించాలని అధికారులు కోరారు.

## ఉద్యోగులకు అలర్ట్

- జారీ చేసిన ట్రాఫిక్ పోలీసులు

**హైదరాబాద్, జూలై30 (జనంసాక్షి) :** తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక సూచనలు జారీ చేశారు. నగరంలోని కంపెనీలు, సంస్థలు సాధ్యమైన చోట వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు చేయాలని సూచించారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉద్యోగులకు విడతల వారీగా ముందస్తు లాగౌట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా చూడడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రయాణ ప్రమాదాలు తగ్గించి, రహదారులపై ట్రాఫిక్‌ను నియంత్రించే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు. సంస్థలు తమ కార్యాలయ స్థానం, ముందస్తు లాగౌట్ సమయాలను ట్రాఫిక్ పోలీసులకు ఈ-మెయిల్ ద్వారా తెలియజేయాలని సూచించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని, వర్షం పడుతున్నప్పుడు జాగ్రత్తగా ప్రయాణించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

# ఫ్రాన్‌లో విధ్వంసం సృష్టిస్తున్న కార్చిచ్చు

- మంటలను ఆర్పేందుకు శ్రమిస్తున్న వేలాదిమంది సిబ్బంది



**ప్యారిస్, జూలై30 (జనంసాక్షి) :** ఫ్రాన్స్ నైరుతి ప్రాంతంలోని గిరోండ్ అడవుల్లో చెలరేగిన కార్చిచ్చు భారీ విధ్వంసం సృష్టిస్తోంది. ఇప్పటికే వేలాది హెక్టార్ల అడవి అగ్నికి ఆహుతి అయింది. తీవ్ర వేడి, దీర్ఘకాలిక కరువు పరిస్థితులు, బలమైన గాలులు మంటలను మరింత వేగంగా వ్యాపింపజేసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది .ఈ కార్చిచ్చు ఇప్పటివరకు పారిస్ నగర వైశాల్యానికి నాలుగు రెట్లకు సమానమైన ప్రాంతాన్ని దహనం చేసింది. లక్షలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వేలాది మంది అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల సెల్సియస్ వరకు చేరే అవకాశం ఉందని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. పొడి గాలుల కారణంగా ఇప్పటికే అదుపులోకి వచ్చిన ప్రాంతాల్లో కూడా మంటలు మళ్లీ చెలరేగవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తిరిగి ఇళ్లకు వెళ్లకుండా ఆంక్షలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం భారీ మంటలు ఫ్రాన్స్‌లోని అణు కేంద్రాలు, రఫేల్ యుద్ధ విమానాల తయారీ యూనిట్ల వైపు వేగంగా దూసుకొస్తున్నాయి. ఫ్రాన్స్ అణ్వాయుధ వ్యవస్థకు సంబంధించిన ప్రదేశాలతో పాటు, అత్యంత కీలక రక్షణ, ఏరోస్పేస్ సౌకర్యాలున్న ప్రాంతానికి కేవలం 12 కిలోమీటర్ల దూరంలో మంటలు ఉన్నాయి. మంటల వల్ల ఈ కీలక కేంద్రాలకు నష్టం జరగకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మంటలు వ్యాపించకుండా ఉండేందుకు ఈ కేంద్రాలకు సమీపంలో ఉన్న చెట్లను బుల్డోజర్లతో తొలగిస్తున్నారు.

# గోదావరి పరీవాహకంలో అప్రమత్తంగా ఉండండి

- ముంపు ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలి
- వర్షాల నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్



**జగిత్యాల, జూలై30 (జనంసాక్షి) :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి పరీవాహక మండలాల్లో అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, గోదావరి నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైతే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. గురువారం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించి వర్షాల పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొన సాగించాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు తమ పరిధిలోని పునరావాస కేంద్రాలను తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఆహారం, వైద్య సదుపాయాలతో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడితే వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, నాలాలు ఎక్కడా మూసుకుపోకుండా వెంటనే శుభ్రపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారులపై చెట్లు విరిగి పడితే వెంటనే తొలగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల్లో నీటిముంపు సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత భవనాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తాగునీటి బృందాలు, ఎమ్జర్గ÷న్సీ రెస్పాన్స్ బృందాలు, యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో 24 గంటలు పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. వర్షాల కారణంగా ప్రమాదాలు, నీటి ముంపు, ఆస్తి నష్టం లేదా ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, తీసుకున్న చర్యలను జిల్లా కంట్రోల్ రూమ్‌కు వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్లు బి. రాజ గౌడ్,బి.ఎస్. లత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
31 జూలై 2026

సంపాదకీయం

# రైతు గుండెల్లో నిండిన ఆశలు

**ప్రకృతి అనుగ్రహిస్తే** భూమి పచ్చగా నవ్వుతుంది. నదులు పరవళ్లు తొక్కుతాయి. జలాశయాలు నిండుకుండలవుతాయి. రైతు ముఖంలో చిరునవ్వు విరుస్తుంది. ఈ ఏడాది తెలంగాణలో కనిపిస్తున్న దృశ్యం అదే. ఎగువ రాష్ట్రాల్లోనూ, తెలంగాణలోనూ కురిసిన విస్తార వర్షాలతో గోదావరి, కృష్ణా నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాటి జలాలతో రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులు, జలాశయాలు, చెరువులు నిండిపోయాయి. కొన్ని ప్రాజెక్టులు గరిష్ఠ నీటిమట్టాన్ని చేరుకుని గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నాయి. ఇది కేవలం ఒక సహజ దృశ్యం మాత్రమే కాదు. తెలంగాణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరిని, కొత్త ఆశలను అందిస్తున్న శు భపరిణామం.

గోదావరి పరీవాహక ప్రాంతంలోని శ్రీరాంసాగర్, నిజాంసాగర్, కడెం, శ్రీపాద ఎల్లంపల్లి, లోయర్ మానేరు, మిడ్ మానేరు, ఎగువ మానేరు, కాళేశ్వరం వ్యవస్థలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు జలకళను సంతరించుకున్నాయి. అలాగే కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని శ్రీశైలం, నాగార్జునసాగర్, జూరాల, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరిధిలోని నిల్వలు కూడా ఆశాజనక స్థాయికి చేరుకున్నాయి. ఈ నీటి సమృద్ధి రాష్ట్ర భవిష్యత్ సాగునీటి అవసరాలకు బలమైన భరోసా కల్పిస్తోంది.

గతంలో వరుసగా కరవు పరిస్థితులు, తక్కువ వర్షపాతం, భూగర్భ జలాల క్షీణత రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టాయి. సాగు విస్తీర్ణం తగ్గిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే ఈసారి పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. జలాశయాలు నిండిపోవడంతో సాగునీటిపై రైతులకు విశ్వాసం పెరిగింది. వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి, పప్పుధాన్యాలు, ఉద్యాన పంటలు మరింత విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉంది. చెరువులు నిండటంతో గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పెరుగుతాయి. బోర్లు పునరుజ్జీవం పొందుతాయి. పశుసంపదకు తాగునీటి కొరత తగ్గుతుంది. గ్రామీణ జీవన విధానానికి ఇది శుభసూచకం.

*నిండిన జలాశయాలు రైతుకు మాత్రమే కాదు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా బలాన్నిస్తాయి. సాగు విస్తీర్ణం పెరిగితే ఉత్పత్తి పెరుగుతుంది. ఉత్పత్తి పెరిగితే రైతు ఆదాయం పెరుగుతుంది. వ్యవసాయ అనుబంధ రంగాలు పుంజుకుంటాయి. గ్రామీణ మార్కెట్లలో కొనుగోలు శక్తి పెరుగుతుంది. పరిశ్రమలకు, తాగునీటి అవసరాలకు కూడా భరోసా లభిస్తుంది. జలసంపద సమృద్ధిగా ఉన్న రాష్ట్రం పెట్టుబడులను ఆకర్షించడంలోనూ ముందుంటుంది. అయితే ఈ ఆనంద సమయంలో మరో విషయాన్ని మరవకూడదు. ప్రకృతి ప్రసాదించిన ప్రతి నీటి బొట్టును సంరక్షించడం మనందరి బాధ్యత. జలాశయాలు నిండాయని నీటిని నిర్లక్ష్యంగా వినియోగించడం సమంజసం కాదు. కాలువల ద్వారా నీరు చివరి ఆయకట్టుకు చేరేలా చూడాలి. చెరువుల పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, సూక్ష్మ నీటిపారుదల విధానాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. నీటి నిర్వహణలో శాస్త్రీయ దృక్పథం అవలంబిస్తేనే ఈ జలసిరి శాశ్వత సంపదగా నిలుస్తుంది.*

తెలంగాణ చరిత్రలో నీటి కోసం సాగిన పోరాటాలకు ప్రత్యేక స్థానం ఉంది. నేడు నిండిన జలాశయాలు ఆ పోరాటాల ఫలితాన్ని, ప్రకృతి అనుగ్రహాన్ని, ప్రజల ఆకాంక్షలను ఒకే వేదికపై నిలబెడుతున్నాయి. జలాశయాల్లో కనిపిస్తున్న నిండుదనం రైతు గుండెల్లో ఆశగా మారాలి. ఆ ఆశ పచ్చని పంటలుగా విరబూయాలి. రైతు ఇంట సిరిసంపద నింపాలి. గ్రామీణ తెలంగాణ సుభిక్షంగా ఎదగాలి. అదే నిజమైన అభివృద్ధికి కొలమానం.

నేడు తెలంగాణ అంతటా కనిపిస్తున్న జలవైభవం ప్రతి ఒక్కరికీ ఒక సందేశాన్ని ఇస్తోంది.. నీటిని గౌరవిస్తేనే భవిష్యత్తు సురక్షితం. జలమే జీవం. జలమే వ్యవసాయానికి ప్రాణం. జలమే తెలంగాణ అభివృద్ధికి శాశ్వత ఆధారం ఈ రూపం..!!

జనంసాక్షి

# పార్లమెంట్ సాక్షిగా 'జెన్-జీ' ఆక్రోశం

### పాలకుల వ్యూహాలు.. ప్రజాస్వామ్య సవాళ్లు

దేశ రాజధాని వీధుల నుంచి పార్లమెంట్ ఉభయ సభల వరకు నేడు మార్మోగుతున్న ఏకైక శబ్దం - నవభారత యువత, విద్యార్థుల ఆక్రోశం. నీట్ (చీజుజు), నెట్ (చీజు) వంటి జాతీయ అర్హత పరీక్షల్లో వరుసగా వెలుగుచూసిన ప్రశ్నపత్రాల లీకేజీలు, పేపర్ మార్కెటింగ్ దందాలు కోట్లాది మంది ప్రతిభావంతులైన విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేశాయి. పార్లమెంట్ వేదికగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ లేవనెత్తిన ప్రశ్నలు కేవలం ఒక రాజకీయ విమర్శ కాక, దేశంలోని ప్రతీ విద్యార్థి కుటుంబం తరఫున వినిపించిన నిలదీతగా మారాయి.

"హోం మంత్రి ఆదేశాలతో లాఠీఛార్జీలు, నిర్బంధాలు జరిగాయా? లేక ఆయనకు తెలియకుండానే ఇవన్నీ జరిగిపోయాయా? ఏది ఏమైనప్పటికీ పరిపాలనా వైఫల్యానికి హోం మంత్రిత్వ శాఖే బాధ్యత వహించాలి." - పార్లమెంట్ ఎదుట వెలువడిన సూటి బాణం ఇది.

**అధికార పక్షపు అహంకారం - చట్టాల రంగుల మార్పు**

లక్షలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి శాంతియుతంగా నిరసన తెలిపితే, వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్బంధ పర్వానికి తెరతీసింది. పార్లమెంట్‌లోనూ ప్రతిపక్షాల గొంతు నొక్కడం, చర్చకు అవకాశం ఇవ్వకపోవడం ద్వారా తమకు ఉన్న సంఖ్యాబల అహంకారాన్ని అధికార పక్షం మరోసారి ప్రదర్శించింది. విద్యావ్యవస్థలో నాటకీయ మార్పుల పేరిట ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణలు కేవలం పాత సీసాలో కొత్త సారాలాంటివే!

రూ.10 లక్షల జరిమానాను రూ.10 కోట్లకు, ఐదేళ్ల జైలు శిక్షను పదేళ్లకు పెంచితే సరిపోతుందా?

విద్యా సంస్థలను నియంత్రించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) నిర్మాణంలో, ఆర్ఎస్ఎస్ లేదా అధికార పక్ష అనుకూల నియమకాల స్థానంలో స్వతంత్రతను తీసుకురావడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. చీూా ఛైర్మన్‌ను మార్చి మరో పాత ఆర్ఎస్ఎస్ వ్యక్తిని కూర్చోబెట్టడం వల్ల మార్పు రాదు.

**'జెన్-జీ' ఉద్యమం - పరిమితులు, రాబోయే సంకేతాలు**

జంతర్ మంతర్ వేదికగా దేశ యువత (Gen-Z) ఆకస్మికంగా స్పందించిన తీరు, సామాజిక మాధ్యమాల వేదికగా దేశాన్ని ఊపేసిన శైలి ప్రజాస్వామ్యానికి కొత్త ఊపిరి పోసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, ముందస్తు హామీలతో విద్యార్థులు నిరసనలు విరమించినప్పటికీ, ప్రభుత్వం వారిపై మోపిన అక్రమ కేసులు వారి భవిష్యత్తును వెంటాడుతూనే ఉన్నాయి. కేవలం ఒక పరీక్ష రద్దు లేదా తాత్కాలిక ఉపశమనం కోసం సాగిన ఈ నిరసన... పాలకుల నిర్బంధం వల్ల మున్ముందు ఒక సమగ్రమైన వర్గ పోరాటం (Class Struggle)గా మారే దిశగా అడుగులు వేస్తోంది.

రాజకీయ మైలేజ్ కుట్రలు - ప్రజాస్వామ్యంలో అసలు ప్రశ్న

గోడీ మీడియా ద్వారా నిజాన్ని కప్పిపుచ్చి, ఈ విద్యార్థి ఉద్యమం ద్వారా కాంగ్రెస్ లేదా ప్రతిపక్షాలకు పొలిటికల్ మైలేజ్ దక్కకూడదనే ఏకైక లక్ష్యంతో పాలకవర్గం పనిచేస్తోంది. ఇందుకోసం రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలను, న్యాయస్థానాల నిర్ణయాలను కూడా తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తోంది.

పాలకుల ఎత్తుగడలు తాత్కాలికంగా నెగ్గవచ్చు గాక, కానీ ప్రశ్నించే




ధిక్కార స్వరాన్ని శాశ్వతంగా నొక్కడం ఎవరి తరమూ కాదు. నిష్పాక్షికమైన విద్యావిధానం, పారదర్శకమైన పరీక్షల నిర్వహణ సాధించే వరకు ఈ చైతన్యం ఏదో ఒక రూపంలో రగులుతూనే ఉంటుంది. సత్యం, న్యాయం వైపు నిలబడే సమాజమే ప్రజాస్వామ్యానికి నిజమైన రక్షణ !

**బండి దుర్గా ప్రసాద్,**
**సీనియర్ జర్నలిస్ట్, సామాజిక విశ్లేషకులు**

# భారతీయ విద్యా వ్యవస్థపై - ఆర్ఎస్ఎస్ ప్రభావం ఎంత?

*భారతదేశ విద్యా వ్యవస్థ అనేది ప్రపంచంలోనే అత్యం విస్తృతమైన విద్యా వ్యవస్థలలో ఒకటి. లక్షలాది పాఠశాలలు, వేల సంఖ్యలో కళాశాలలు, వందలాది విశ్వవిద్యాలయాలు, కోట్లాది విద్యార్థులతో కూడిన ఈ వ్యవస్థ దేశ భవిష్యత్తును నిర్దేశించే ప్రధాన శక్తిగా నిలుస్తోంది. అలాంటి విద్యా వ్యవస్థపై ఏ రాజకీయ, సామాజిక లేదా సాంస్కృతిక సంస్థ ప్రభావం చూపుతున్నదనే ప్రశ్న చాలా కాలంగా చర్చనీయాంశంగా ఉంది. ముఖ్యంగా జాతీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) విద్యా రంగంపై చూపుతున్న ప్రభావం గురించి అనేక అభిప్రాయాలు, విమర్శలు, సమర్థనలు వినిపిస్తున్నాయి.*



ఈ అంశాన్ని పరిశీలించేటప్పుడు రాజకీయ అభిప్రాయాలను పక్కనపెట్టి, రాజ్యాంగం, విద్యా విధానాలు, సంస్థాగత నిర్మాణం, చరిత్ర, పరిశోధనలు, ప్రజా చర్చలను ఆధారంగా చేసుకొని విశ్లేషించడం అవసరం. ఎందుకంటే విద్య అనేది కేవలం పాఠ్యాంశాల సమాహారం మాత్రమే కాదు; అది సమాజ విలువలను, శాస్త్రీయ దృక్పథాన్ని, జాతీయ గుర్తింపును, ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిర్మించే ప్రక్రియ.

భారతదేశంలో కేజీ నుంచి పీజీ వరకు విద్యా వ్యవస్థ అనేక స్థాయిలుగా విభజించబడి ఉంది. ప్రాథమిక విద్య, ఉన్నత ప్రాథమిక విద్య, మాధ్యమిక, ఉన్నత మాధ్యమిక, డిగ్రీ, పీజీ, పరిశోధన స్థాయిల వరకు ప్రభుత్వ, ప్రైవేటు, స్వయం ప్రతిపత్తి కలిగిన విద్యాసంస్థలు పనిచేస్తున్నాయి. వీటి నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, వివిధ నియంత్రణ మండళు ,, స్వచ్ఛంద సంస్థలు, మతపరమైన సంస్థలు, ప్రైవేటు ట్రస్టులు భాగస్వాములుగా ఉంటాయి. అందువల్ల మొత్తం భారతీయ విద్యా వ్యవస్థను ఒకే సంస్థ పూర్తిగా నియంత్రిస్తోందని చెప్పడం వాస్తవ పరిస్థితిని సరళీకరించిన వ్యాఖ్య అవుతుంది.

అయితే ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా పనిచేసే విద్యా సంస్థల ప్రభావం మాత్రం గమనించదగినది. దేశవ్యాప్తంగా విద్యా రంగంలో పనిచేస్తున్న పలు సంస్థలు భారతీయ సంస్కృతి, జాతీయత, భారత చరిత్ర, సాంప్రదాయ విలువలను ప్రధానంగా బోధించే లక్ష్యంతో పనిచేస్తున్నాయి. వీటిలో ముఖ్యంగా విద్యా భారతి నిర్వహించే పాఠశాలల నెట్‌వర్క్ ప్రముఖంగా ప్రస్తావించబడుతుంది. ఈ పాఠశాలల్లో సాధారణ ప్రభుత్వ పాఠ్యాంశాలతో పాటు భారతీయ సంస్కృతి, యోగా, దేశభక్తి, సంస్కృత భాష, నైతిక విలువలకు ప్రాధాన్యం ఇవ్వబడుతుందని నిర్వాహకులు చెబుతారు. విమర్శకులు మాత్రం ఇక్కడ బోధించే కొన్ని అంశాలు హిందుత్వ భావజాలాన్ని ప్రతిబింబిస్తాయని అభిప్రాయపడుతున్నారు.

కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా విధానంలో కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయని విద్యా విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా కొత్త జాతీయ విద్యా విధానం--2020లో భారతీయ జ్ఞాన సంపద, ప్రాచీన విజ్ఞాన వ్యవస్థలు, మాతృభాషలో బోధన, భారతీయ తత్వశాస్త్రం, స్థానిక విజ్ఞానం వంటి అంశాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వబడింది. దీనిని కొందరు భారతీయతకు ప్రాధాన్యం ఇచ్చే సంస్కరణగా స్వాగతించగా, మరికొందరు ఇది ఆర్ఎస్ఎస్ చాలాకాలంగా ప్రతిపాదిస్తున్న భావనలకు దగ్గరగా ఉందని వ్యాఖ్యానించారు. అయితే జాతీయ విద్యా విధానాన్ని ప్రభుత్వం అధికారికంగా రూపొందించింది; అది ఆర్ఎస్ఎస్ అధికారిక పత్రం కాదు అనే విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి.

పాఠ్యపుస్తకాల మార్పుల విషయంలోనే ఎక్కువ చర్చ జరిగింది. చరిత్ర, సామాజిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం, సంస్కృతి వంటి అంశాల్లో కొన్ని అధ్యాయాలు తొలగించడం, కొన్ని కొత్త అంశాలు చేర్చడం, ప్రాచీన భారతదేశానికి సంబంధించిన వివరాలను విస్తరించడం వంటి చర్యలపై దేశవ్యాప్తంగా విభిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఒక వర్గం దీన్ని భారతీయ దృష్టికోణాన్ని ప్రతిబింబించే ప్రయత్నంగా పేర్కొంటే, మరో వర్గం చరిత్రను రాజకీయ అవసరాలకు అనుగుణంగా పునర్వ్యాఖ్యానించే ప్రయత్నంగా విమర్శించింది.

విశ్వవిద్యాలయాల స్థాయిలో కూడా చర్చ కొనసాగుతోంది. ఉపకులపతుల నియామకాలు, పరిశోధన అంశాల ఎంపిక, పాఠ్య ప్రణాళికల రూపకల్పన, విద్యార్థి రాజకీయాలపై ప్రభుత్వ ప్రభావం పెరిగిందని కొందరు విద్యావేత్తలు పేర్కొంటున్నారు. అయితే ఇది కేవలం ఆర్ఎస్ఎస్ ప్రభావమేనా, లేక అధికారంలో ఉన్న ప్రభుత్వ విధానాల ప్రభావమా అనే అంశం వేరు. ప్రజాస్వామ్య దేశాల్లో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు విద్యా విధానాలను ప్రభావితం చేయడం సహజమే. కానీ ఆ ప్రభావం రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉండాలా లేదా అనే ప్రశ్న ప్రధానమైనది.

భారత రాజ్యాంగం విద్యను సమానత్వం, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పథం, మానవతా విలువల ఆధారంగా అభివృద్ధి చేయాలని సూచిస్తుంది. అదే సమయంలో భారతీయ సంస్కృతి, వారసత్వాన్ని కూడా పరిరక్షించాల్సిన బాధ్యతను గుర్తు చేస్తుంది. అందువల్ల భారతీయతను బోధించడం తప్పు కాదు; కానీ అది బహుళత్వాన్ని, మత వైవిధ్యాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీయకూడదు. ఇదే విద్యా రంగంలో ప్రధాన సమతుల్యత.

చాలామంది అడిగే ప్రశ్న -- "భారత విద్యా వ్యవస్థపై ఆర్ఎస్ఎస్ ప్రభావం ఎంత శాతం ఉంది?" దీనికి ఖచ్చితమైన శాతాన్ని చెప్పే అధికారిక అధ్యయనం లేదా ప్రభుత్వ గణాంకం లేదు. ఎందుకంటే "ప్రభావం" అనేది సంఖ్యలతో కొలవలేని సామాజిక-రాజకీయ అంశం. విద్యా విధానాలపై ఆలోచనా ప్రభావం ఒకటి, పాఠశాలల నిర్వహణ మరోటి, పాఠ్యపుస్తకాల రూపకల్పన ఇంకొకటి. కాబట్టి "40 శాతం", "60 శాతం" వంటి సంఖ్యలను ఆధారాలు లేకుండా చెప్పడం శాస్త్రీయంగా సరైంది కాదు.

అయితే విశ్లేషణాత్మకంగా చూస్తే మూడు స్థాయిల్లో ప్రభావాన్ని చర్చించవచ్చు. మొదటిది భావజాల ప్రభావం. భారతీయ సంస్కృతి, జాతీయత, ప్రాచీన విజ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచనలు విధాన చర్చల్లో ఎక్కువగా వినిపిస్తున్నాయి. రెండోది సంస్థాగత ప్రభావం. ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా పనిచేసే విద్యాసంస్థలు లక్షలాది విద్యార్థులకు విద్య అందిస్తున్నాయి. మూడోది విధాన చర్చలపై పరోక్ష ప్రభావం. ప్రభుత్వాలు, విద్యా కమిటీలు, మేధావుల మధ్య జరిగే చర్చల్లో ఆ భావజాలానికి ప్రాతినిధ్యం పెరిగిందని కొందరు పరిశోధకులు పేర్కొంటున్నారు.

అదే సమయంలో భారతీయ విద్యా వ్యవస్థపై ప్రభావం చూపే ఇతర శక్తులను కూడా విస్మరించరాదు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సమాచార సాంకేతిక విప్లవం, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల ప్రమాణాలు, పరిశ్రమల అవసరాలు, న్యాయస్థానాల తీర్పులు, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, అంతర్జాతీయ ర్యాంకింగ్ వ్యవస్థలు కూడా విద్యను ప్రభావితం చేస్తున్నాయి. అందువల్ల మొత్తం విద్యా వ్యవస్థను కేవలం ఒకే సంస్థ ప్రభావానికి పరిమితం చేయడం వాస్తవ చిత్రాన్ని అసంపూర్ణంగా చూపుతుంది.

విద్యా రంగంలో అత్యంత ముఖ్యమైన అంశం స్వతంత్ర అకాడమిక్ స్వేచ్ఛ. పరిశోధకులు ఆధారాలతో మాట్లాడే అవకాశం, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి, విమర్శనాత్మక ఆలోచన, భిన్నాభిప్రాయాలను గౌరవించే వాతావరణం బలంగా ఉంటేనే విద్యా వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఏ భావజాలమైనా ప్రశ్నలను అంగీకరించాలి; శాస్త్రీయ పరిశోధనకు అవకాశమివ్వాలి; చరిత్రను బహుముఖ దృక్పథంతో అధ్యయనం చేయాలి.

మిగితా తరువాయి రేపటి సంచికలో..



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# జెన్-జీ గర్జన.. మోదీ ఇమేజ్‌కు అంతర్జాతీయ హెచ్చరిక

భారత రాజకీయాల్లో ఎన్నో ఉద్యమాలు వచ్చాయి, వెళ్లాయి. కానీ ఇటీవల జెన్-జీ యువత ఆధ్వర్యంలో జరిగిన "కాక్రోచ్ జనతా పార్టీ" ఉద్యమం మాత్రం కేవలం దేశీయ రాజకీయ సంఘటనగా మిగలలేదు. ఇది ప్రపంచ మీడియా దృష్టిని ఆకర్షించింది. నిరుద్యోగం, పరీక్షా పత్రాల లీకులు, విద్యా వ్యవస్థపై అవిశ్వాసం, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి అంశాలను కేంద్రంగా చేసుకున్న ఈ ఉద్యమాన్ని అనేక అంతర్జాతీయ మీడియా సంస్థలు భారత రాజకీయాల్లో కొత్త మలుపుగా అభివర్ణించాయి. ఈ పరిణామం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యక్తిగత ప్రతిష్ఠకు ఎంత మేర ప్రభావం చూపిందనే అంశంపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రజాస్వామ్యంపై చర్చను మళ్లీ తెరపైకి తీసుకువచ్చిందనేది తిరస్కరించలేని వాస్తవం.

ఈ ఉద్యమాన్ని అంతర్జాతీయ మీడియా కేవలం విద్యార్థుల ఆందోళనగా కాకుండా, యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతీకగా చిత్రీకరించింది." రాయిటర్స్" ఈ ఉద్యమాన్ని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన ఎదుర్కొన్న అతిపెద్ద యువజన సవాలుగా పేర్కొంది. విద్యా వ్యవస్థలో అవకతవకలు, నిరుద్యోగం, సామాజిక మాధ్యమాల ద్వారా యువత వేగంగా సమీకృతం కావడం వంటి అంశాలను ప్రత్యేకంగా ప్రస్తావించింది. అలాగే ఉద్యమానికి సామాజిక మాధ్యమాల్లో కోట్లాది మంది యువత మద్దతు లభించిందని పేర్కొంది.

"అసోసియేటెడ్ ప్రెస్" ఈ నిరసనల్లో హాస్యం, వ్యంగ్యం, మీమ్స్‌ను ఆయుధాలుగా ఉపయోగించిన తీరును ప్రత్యేకంగా విశ్లేషించింది. ఒకప్పుడు మోదీ రాజకీయ ఎదుగుదలకు బలమైన వేదికగా నిలిచిన సామాజిక మాధ్యమాలనే ఇప్పుడు యువత ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి వినియోగిస్తోందని వ్యాఖ్యానించింది. భారత జనాభాలో దాదాపు సగం మంది 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారేనని గుర్తుచేస్తూ, ఈ తరం రాజకీయ చైతన్యం భవిష్యత్తు రాజకీయాలను ప్రభావితం చేయగలదని సూచించింది.

"ది గార్డియన్" ఈ ఉద్యమాన్ని మోదీ "బలమైన నాయకత్వం" అనే ఇమేజ్‌కు వచ్చిన అతిపెద్ద సవాళ్లలో ఒకటిగా అభివర్ణించింది. ముఖ్యంగా పోలీసు చర్యలు, ఉద్యమకారులపై బలప్రయోగం, ప్రముఖుల మౌనం వంటి అంశాలను ప్రశ్నించింది. ఉద్యమం ప్రభుత్వంపై మాత్రమే కాకుండా, భయ వాతావరణం తగ్గుతున్న సంకేతంగా కూడా నిలిచిందని విశ్లేషించింది.

అయితే విదేశీ మీడియా కథనాలను యథాతథంగా అంగీకరించడం



కూడా సరైన విధానం కాదు. ప్రతి అంతర్జాతీయ మీడియా సంస్థకు తనదైన సంపాదకీయ దృక్కోణం ఉంటుంది. కొన్ని సంస్థలు ప్రజాస్వామ్య హక్కులు, పౌర స్వేచ్ఛలపై ఎక్కువ దృష్టి పెడితే, మరికొన్ని రాజకీయ ప్రభావాలపై దృష్టి సారిస్తాయి. అందువల్ల వాటి విశ్లేషణలను విమర్శనాత్మక దృష్టితో చదవడం అవసరం. అయినప్పటికీ, ఒక విషయం మాత్రం స్పష్టమైంది. ప్రపంచ మీడియా ఈ ఉద్యమాన్ని చిన్న సంఘటనగా చూడలేదు; భారత పాలన, యువత ఆకాంక్షలు, రాజకీయ జవాబుదారీతనం వంటి విస్తృత ప్రశ్నలతో అనుసంధానించింది.

ఇటీవలి సంవత్సరాల్లో "భారత ప్రజాస్వామ్య ప్రమాణాలు, మీడియా స్వేచ్ఛ, పౌర హక్కుల" పై అంతర్జాతీయ నివేదికలు తరచూ చర్చకు వస్తున్నాయి. ఉదాహరణకు, "ఫ్రీడమ్ హౌస్" తన 2026 నివేదికలో భారతదేశంలో మీడియాపై ఒత్తిడి, విమర్శనాత్మక స్వరాలపై చట్టాల వినియోగం, స్వీయ సెన్సార్ పెరుగుతున్న అంశాలను ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో జెన్-జీ ఉద్యమం ప్రపంచ దృష్టిని మరింత ఆకర్షించడం సహజమే.

ఇక్కడ ఒక కీలకమైన ప్రశ్న ఉత్పన్నమవుతుంది. మోదీ ఇమేజ్ నిజంగానే దెబ్బతిన్నదా? అంతర్జాతీయ స్థాయిలో కొంత మేర విమర్శలు పెరిగిన మాట వాస్తవమే. అయితే ఒకే ఉద్యమం వల్ల ఒక నాయకుడి మొత్తం అంతర్జాతీయ ప్రతిష్ఠ కూలిపోయిందని చెప్పడానికి తగిన ఆధారాలు లేవు. ఎందుకంటే భారత ఆర్థిక వృద్ధి, విదేశాంగ విధానం, వ్యూహాత్మక భాగస్వామ్యాలు, డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాల కారణంగా మోదీకి ప్రపంచవ్యాప్తంగా ఇంకా గణనీయమైన గుర్తింపు ఉంది. అదే సమయంలో ప్రజాస్వామ్య విలువలు, యువత అసంతృప్తి, ఉపాధి సంక్షోభం వంటి అంశాలు ఆ ప్రతిష్ఠపై ప్రశ్నార్థకాలు కూడా లేవనెత్తుతున్నాయి. ఈ రెండు వాస్తవాలు ఒకేసారి సహజీవనం చేస్తున్నాయి.

ప్రజాస్వామ్యంలో ఒక ఉద్యమం విజయం సాధించిందా లేదా అనేది కేవలం ఒక మంత్రి రాజీనామాతో నిర్ణయించబడదు. అసలు విజయం అధికారాన్ని ప్రశ్నించే ధైర్యం సమాజంలో ఎంత పెరిగిందన్నదానిపై ఆధారపడి ఉంటుంది. అదే విధంగా ప్రభుత్వం బలాన్ని పోలీసు చర్యలతో కాకుండా, ప్రజల విశ్వాసంతో కొలవాలి. యువత లేవనెత్తిన ప్రశ్నలకు రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలతో సమాధానం చెప్పలేరు. ఉపాధి, విద్య, పారదర్శకత, జవాబుదారీతనం వంటి అంశాల్లో స్పష్టమైన చర్యలే సమాధానం.

చరిత్ర చెబుతున్న పాఠం ఒక్కటే. ప్రపంచంలో ఏ నాయకుడైనా తన ఇమేజ్‌ను ప్రచారంతో నిర్మించుకోవచ్చు ఈ విషయంలో ప్రపంచం మొత్తంలో నరేంద్ర మోదీని మించిన వారు ఎవరూ లేరు. కానీ దాన్ని శాశ్వతంగా నిలబెట్టేది ప్రజల విశ్వాసం మాత్రమే. జెన్-జీ ఉద్యమం మోదీ ప్రభుత్వాన్ని కూల్చివేసిందని చెప్పడం అతిశయోక్తి. కానీ ఈ ఉద్యమం ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశాన్ని పంపింది. భారత యువత ఇక కేవలం ఓటర్లు మాత్రమే కాదు; వారు పాలనను ప్రశ్నించే, జవాబుదారీతనం కోరే శక్తిగా ఎదుగుతున్నారు. ఆ సందేశాన్ని ప్రభుత్వం ఎంత త్వరగా అర్థం చేసుకుంటే, అంత త్వరగా ప్రజాస్వామ్యం బలపడుతుంది; లేకపోతే అంతర్జాతీయ విమర్శలు మరింత తీవ్రమయ్యే అవకాశాన్ని పూర్తిగా తోసిపుచ్చలేం.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# గురువు: జ్ఞానానికి దీపస్తంభం.. జాతి భవిష్యత్తుకు శిల్పి

"గురువు ఒక వ్యక్తి కాదు; ఒక విలువ, ఒక మార్గం, ఒక స్ఫూర్తి." ఈ ఒక్క వాక్యం భారతీయ సంస్కృతిలో గురువు స్థానం ఎంత ఉన్నతమైనదో తెలియజేస్తుంది. మన సంప్రదాయంలో గురువును దైవంతో సమానంగా భావించారు. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే, గురువు జీవితానికి దిశానిర్దేశం చేస్తాడు. అందుకే "మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ" అనే మహావాక్యం భారతీయ సంస్కృతికి మూలస్తంభంగా నిలిచింది. గురువు అనేది కేవలం ఒక ఉద్యోగం కాదు. అది ఒక బాధ్యత, ఒక తపస్సు, ఒక సామాజిక ధర్మం. "గు" అంటే అజ్ఞానం, "రు" అంటే దానిని తొలగించేవాడు. అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించేవాడే గురువు. పాఠ్యపుస్తకంలోని విషయాలను చెప్పడం మాత్రమే ఆయన పని కాదు; శిష్యునిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, విలువలను నాటుతూ, సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దడం గురువు అసలైన కర్తవ్యం.

భారతదేశ గురుకుల వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. అక్కడ విద్య అనేది ఉద్యోగం కోసం కాదు; జీవితాన్ని సార్థకం చేసుకోవడం కోసం. గురు-శిష్య సంబంధం విశ్వాసం, వినయం, క్రమశిక్షణ, పరస్పర గౌరవం అనే నాలుగు స్తంభాలపై నిలిచేది. గురువు జ్ఞానాన్ని పంచేవాడు, శిష్యుడు దానిని ఆచరణలో పెట్టేవాడు. ఈ బంధమే భారతీయ నాగరికతను వేల సంవత్సరాలుగా నిలబెట్టింది.

నేడు ప్రపంచం వేగంగా మారుతోంది. కృత్రిమ మేధస్సు, డిజిటల్ సాంకేతికత, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలు సమాచారాన్ని ప్రతి ఒక్కరి చేతిలోకి తీసుకొచ్చాయి. కొన్ని సెకన్లలో ప్రపంచంలోని ఏ అంశంపైనైనా సమాచారం తెలుసుకోవచ్చు. కానీ సమాచారం ఎక్కువగా ఉండటం అంటే జ్ఞానం పెరిగిందని కాదు. నిజాన్ని అసత్యం నుంచి వేరు చేయడం, సమాచారాన్ని విజ్ఞానంగా మలచడం, విజ్ఞానాన్ని విలువలతో అనుసంధానం చేయడం గురువు మాత్రమే చేయగలడు.

నేటి విద్యార్థి ఎదుర్కొంటున్న సవాళ్లు గతంతో పోలిస్తే భిన్నంగా ఉన్నాయి. డిజిటల్ వ్యసనం, సామాజిక మాధ్యమాల ప్రభావం, పోటీ ఒత్తిడి, మానసిక ఆందోళనలు, ఉపాధి అనిశ్చితి-ఇలాంటి పరిస్థితుల్లో గురువు పాత్ర మరింత విస్తరించింది. స్వామి వివేకానంద జీవితాన్ని శ్రీరామకృష్ణ పరమహంస మలిచారు. ఛత్రపతి శివాజీ వ్యక్తిత్వ నిర్మాణంలో సమర్థ రామదాస్ పాత్ర చిరస్మరణీయం. డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం తన జీవిత విజయాలకు తన ఉపాధ్యాయులే కారణమని అనేక సందర్భాల్లో చెప్పారు. నిజమైన గురువు సమాధానాలు మాత్రమే చెప్పడు; ప్రశ్నించే ధైర్యాన్ని పెంపొందిస్తాడు. అనుకరించే వ్యక్తిగా కాదు, ఆలోచించే వ్యక్తిగా శిష్యుణ్ని తీర్చిదిద్దుతాడు.

జాతీయ విద్యా విధానం-2020 కూడా గురువులపై మరింత బాధ్యతను ఉంచింది. గురుపూర్ణిమ మనకు కేవలం ఒక పండుగ కాదు; జ్ఞానానికి, గురుత్వానికి కృతజ్ఞత చెప్పే రోజు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థి తన గురువును గౌరవించాలి. గురువు చెప్పిన విలువలను జీవితంలో ఆచరించాలి. అదే సమయంలో ప్రతి గురువు కూడా కాలానుగుణంగా తన బోధనా విధానాన్ని మెరుగుపరచుకుంటూ, విద్యార్థుల్లో జిజ్ఞాస, సృజనాత్మకత, మానవీయతను పెంపొందించే దిశగా కృషి చేయాలి. వేగంగా మారుతున్న ఈ యాంత్రిక ప్రపంచంలో మనిషికి సమాచారం కొరత లేదు. కానీ సంస్కారం, సద్బుద్ధి, మానవీయత కొరవడుతున్నాయి. సాంకేతికత సమాచారాన్ని అందించవచ్చు. అందుకే గురువును గౌరవించడం అంటే జ్ఞానాన్ని గౌరవించడం. జ్ఞానాన్ని గౌరవించడం అంటే నాగరిక సమాజాన్ని నిర్మించడం. గురువు ఒక ఉద్యోగి కాదు; జాతి నిర్మాత. గురువు ఒక బోధకుడు కాదు; భావితరాలకు దిశానిర్దేశం చేసే దీపస్తంభం. గురువు ఒక వ్యక్తి కాదు; శాశ్వతమైన విలువలకు ప్రతీక.

*జీవితంలో గొప్ప సంపద ధనం కాదు; ఒక గొప్ప గురువు లభించడమే.*

డా. కొమ్మల్ల ఇంద్రసేన రెడ్డి,
లైబ్రేరియన్, కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, వరంగల్,9849375829

# నారాయణపేట చేనేత చీరల బ్రాండ్‌ను మరింత బలోపేతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 30 (జనం సాక్షి) :** నారాయణపేట చీరలను స్థానిక, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో విస్తృతంగా ప్రోత్సహించి విక్రయించేలా కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. జిల్లా మహిళా సమాఖ్య (మీా) తన విజయవంతమైన పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ నిర్వహణ అనుభవాన్ని ఆదర్శంగా తీసుకుని, నారాయణపేట ప్రసిద్ధ కాటన్, పట్టు చీరల బ్రాండింగ్, ప్రచారం, మార్కెటింగ్ కార్యక్రమాలను ప్రారంభించాలన్నారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో డీఆర్డీఏ, చేనేత జౌళి శాఖ అధికారి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నారాయణపేట చీరల మార్కెటింగ్‌కు శ్రీకారం చుట్టాలని, ఈ కార్యక్రమం ద్వారా చేనేత కార్మికులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడంతో పాటు స్వయం సహాయక సంఘాల( ఎస్ హెచ్ జి ఎస్) మహిళలకు స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. నారాయణపేట చీరలు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందినప్పటికీ, కాలానుగుణంగా డిజైన్లలో నూతనత లేకపోవడం, సమర్థవంతమైన బ్రాండింగ్, మార్కెటింగ్ వ్యవస్థలు లేకపోవడం వల్ల వాటి విక్రయాలు తగ్గుముఖం పట్టాయని, ఫలితంగా అనేక మంది చేనేత కార్మికులు ఈ వృత్తికి దూరమవుతూ జీవనోపాధి సమస్యలను ఎదుర్కొన్నారన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆధునిక డిజైన్లు, ఉత్పత్తి అభివృద్ధి, బ్రాండింగ్, డిజిటల్ మార్కెటింగ్, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఉత్పత్తుల రూపకల్పన వంటి అంశాల్లో శిక్షణ అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం వారు ఈ కార్యక్రమం ద్వారా నారాయణపేట చీరలకు ప్రత్యేక బ్రాండ్ గుర్తింపును మరింత బలోపేతం చేయడం, విక్రయాలను పెంచడం, చేనేత రంగానికి కొత్త ఊపు తీసుకురావడం, చేనేత కార్మికులు, స్వయం సహాయక సంఘాల మహిళల ఆదాయాన్ని పెంచడం జిల్లా మహిళా సమాఖ్య ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు. జిల్లా సమాఖ్య కు అప్పుగా 5 లక్షలు మంజూరు చేయాలని, వాటితో చీరలను కొనుగోలు చేసి వెబ్ సైట్ లో పెట్టి ఆన్ లైన్ విక్రయాలు చేయాలన్నారు. ఆన్ లైన్ విక్రయాలను బట్టి కొత్త కొత్త మెడల్స్ చీరలను తయారు చేసి మహిళా పెట్రోల్ బంక్ లా నారాయణ పేట కాటన్ చీరల వ్యాపారాన్ని దిన దిన అభివృద్ధి చేసి జిల్లా మహిళా సమాఖ్య మరో మైలు రాయి చేరుకోవాలని కలెక్టర్ ఆకాశీక్షించారు. కాగాజిల్లా మహిళా సమాఖ్య చేపట్టే ఈ వినూత్న కార్యక్రమం సంప్రదాయ చేనేత కళకు పునర్వైభవం తీసుకురావడంతో పాటు గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డీఆర్డీవో వెంకట్ రాములు, చేనేత జౌళి శాఖ ఏ డీ ద్వారక్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, డీపీఎంలు గోవింద్, మాసన్న, యాస్పిరేషన్ బ్లాక్ సమన్వయ కర్త బాలాజీ, జిల్లా సమాఖ్య ఓబీలు పాల్గొన్నారు.

## ఓబీసీ మహాసభలను విజయవంతం చేయాలి



**మహేశ్వరం, జూలై 30 (జనంసాక్షి) :** బెంగళూరులో ఆగస్టు 7న జరగనున్న ఓబీసీ మహాసభలను బీసీ ఉద్యోగులు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం మైసిగండిలో ఓబీసీ మహాసభల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుల్కచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ...రంగారెడ్డి జిల్లాలో పలు శాఖలలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులు భారీ ఎత్తున తరలివచ్చి ఓబీసీ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, ఉపాధ్యక్షుడు రాసూరి జ్ఞానేశ్వర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజమోని మహేశ్వర్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు ఎడ్ల వెంకటేష్ ముదిరాజ్, మహేష్ ముదిరాజ్ ,రమేష్ ముదిరాజ్, గణేష్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి



**హయత్‌నగర్, జూలై 30 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) నాయకులు డిమాండ్ చేశారు. బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు, రంగా రెడ్డి జిల్లా బీజేవైఎం అధ్యక్షులు సాయిరాం గౌడ్ ఆదేశాల మేరకు హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్ల పరిధిలోని అభ్యాస మహిళా కళాశాల, శ్రీ జ్ఞాన చైతన్య జూనియర్ కళాశాల, ఎక్సెల్ జూనియర్ కళాశాల, శ్రీరామ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంతకాల సేకరణ, మిస్డ్ కాల్ ప్రచార కార్యక్రమానికి విద్యార్థులు విశేషంగా స్పందించి తమ మద్దతు తెలిపారు. విద్యార్థుల ఉన్నత విద్యకు ఆటంకం కలగకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బీజేవైఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రంగా రెడ్డి జిల్లా బీజేవైఎం నాయకులు చింటూ, పారంద సాయి, విష్ణుచారి, హయత్‌నగర్ డివిజన్ బీజేవైఎం ప్రధాన కార్యదర్శి అభిలాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత రైతులకు భూ పట్టాలు ఇవ్వాలి

- దళిత రైతుల సంక్షేమ భూ పరిరక్షణ సంఘం



**హయత్‌నగర్, జూలై 30 (జనం సాక్షి) :** హయత్‌నగర్ మండలం అన్మగల్ గ్రామ సర్వే నంబర్ 255/1లోని 74 ఎకరాల 30 గుంటల భూమిని నిజాం కాలం నుంచి సాగు చేస్తున్న దళిత రైతులకు ప్రభుత్వం వెంటనే పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని దళిత రైతుల సంక్షేమ భూ పరిరక్షణ సంఘం (రిజి. నెం. 1474/2012) డిమాండ్ చేసింది. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఎస్సీ మాదిగ కుటుంబాలకు 37 ఎకరాల భూమిపై హక్కులు గుర్తించి ప్రభుత్వం కేటాయించిందని, 1996 వరకు శిస్తు కూడా వసూలు చేసిందని తెలిపారు. అడవిగా ఉన్న భూమిని ఎన్నో కష్టనష్టాలు భరించి సాగుకు అనువుగా మార్చుకున్నామని, ప్రస్తుతం కేవలం 18 ఎకరాల భూమి మాత్రమే తమ ఆధీనంలో ఉందని పేర్కొన్నారు. తాము బోర్లు వేసి వ్యవసాయం చేస్తున్న సమయంలో గతంలో అధికారులు బోర్లను తొలగించి సాగు చేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. హెచ్‌ఎండీఏ అభివృద్ధి పేరుతో ప్లాట్లు ఇస్తామని చెప్పి భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరిగాయని తెలిపారు. తమ వద్ద పహాణీలు, పన్ను రసీదులు, పైసా పట్టి, ప్రభుత్వ రికార్డుల్లో సాగుదారులుగా నమోదైన ఆధారాలు ఉన్నప్పటికీ ప్రస్తుతం అధికారులు భూమి ప్రభుత్వానిదేనని చెబుతూ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి దేవేందర్ గౌడ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు గతంలో తమకు పట్టాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ సభలో సాగు చేస్తున్న దళితులకు భూములపై హక్కులు కల్పిస్తామని ప్రకటించిన విషయాన్ని అమలు చేయాలని కోరారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములపై తమ హక్కులను ప్రభుత్వం గుర్తించి వెంటనే పట్టాలు జారీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యమకాల ఫోరం (టియుఎఫ్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్, గంగని నాగేష్, కాటపాక స్కైలాబ్, గంగని రాము, గంగని శ్రీను, జయ ఈశ్వర్, బోడ శ్రీరాములు, కాటపాక మల్లేష్, సూలారం నరసింహ, కాటపాక బాబురావు, జెనిగె శంకర్, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## హామీలను అమలు చేసే వరకు కార్మికులు పోరాటం చేయాలి

- ఏఐటీయూసీ నాలుగో మహాసభను విజయవంతం చేయాలి
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు




**మహేశ్వరం, జూలై 30 (జనంసాక్షి) :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు కార్మికులు ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. గురువారం ఇమామ్ గూడ ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో ఏఐటీయూసీ నాయకుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ... కార్మికుల వైద్య సదుపాయాల కోసం జిల్లా కేంద్రంగా ఈఎస్ఐ హాస్పిటల్ ను నిర్మించాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. ఆగస్టు 2 న ఇమామ్ గూడ లోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగే ఏఐటీయూసీ నాల్గోవ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దత్తు నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చందు యాదవ్, పబ్బతి లక్ష్మణ్, దేవేందర్ గౌడ్, కొమ్మగల్ల రాజు, యాదగిరి, శివ, అప్సర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే



**కల్హేర్, జూలై 30 (జనం సాక్షి) :** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కల్హేర్ మండల ఎంపీడీవో కార్యాలయం పైకప్పు నుంచి వర్షపు నీరు కారుతూ కార్యాలయం లోపలికి చేరుతున్న పరిస్థితిని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. కార్యాలయ భవనం దుస్థితిని పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసే వరకు బీజేపీ పోరాటం



**వనపర్తి బ్యూరో, జూలై 30 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు వనపర్తి జిల్లా కేంద్రంలో గురువారం "ఫీజుల బకాయి – బీజేపీ లడాయి" కార్యక్రమాన్ని నిర్వహించారు. యువమోర్చా జిల్లా కోఆర్డినేటర్ నల్లవోతుల అరవింద్ ఆధ్వర్యంలో స్కాలర్స్ కళాశాల, విజ్ఞాన్ కళాశాల, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ గత టీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలోని సుమారు 40 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కళాశాలల్లో విద్యార్థుల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల వివరాలతో సంతకాల సేకరణ చేపట్టి, వాటిని ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు. అలాగే యువమోర్చా కాల్ సెంటర్ 8239523455 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి ఉద్యమానికి మద్దతు తెలపాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, యువమోర్చా జిల్లా కోఆర్డినేటర్ నల్లవోతుల అరవింద్, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ అంజి యాదవ్, యువమోర్చా నాయకులు కాట్రావత్ వెంకటేష్ నాయక్, చిలుక నవీన్ సాగర్, చింతకాయల శివ చంద్రశేఖర్, బీజేపీ పట్టణ కార్యదర్శి చినరాయుడు, జానీ నాయక్ పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, జూలై 30 (జనంసాక్షి) :** రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నిమజ్జనోత్సవాల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సెప్టెంబర్ 14 నుంచి 25 వరకు జరిగే వినాయక చవితి, నిమజ్జనోత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో రహదారులు మరమ్మతు చేయడం, అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మలను తొలగించడం, పత్తికుంట (వినాయక సాగర్), పల్లె చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తోందని తెలిపారు. జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు ఆలె భాస్కర్ రాజ్ , కార్యదర్శి కె మహేందర్, సెంట్రల్ కమిటీ సభ్యులు ఎన్. మల్లారెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్, రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, రాజేంద్రనగర్ జోనల్ ఎస్ ఈ. నరేందర్ గౌడ్, రాజేంద్రనగర్ విద్యుత్ డీఈ రత్నాకర్ రావు, రాజేంద్రనగర్ , అత్తాపూర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ లు బి సురేందర్ రెడ్డి, మల్లారెడ్డి, జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ జోహార్ అలీ, జీహెచ్ ఎంసీ ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన సత్యనారాయణ రెడ్డి, నాయకులు బిజెఎంసీ మాజీ మేయర్ మహేందర్ గౌడ్, వై. శ్రీధర్, ఎన్. ధనుంజయ, జోగి రవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- తపస్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ నర్సిరెడ్డి



**నంగునూరు, జూలై 30 (జనం సాక్షి) :** విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యల పట్ల నిర్లిప్తత విడనాడి ప్రభుత్వము తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నంగునూరు మండల శాఖ ఆధ్వర్యంలో జరిగిన సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నంగునూరు లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా ప్రభుత్వము ఆరు డి.ఏ లను పెండింగ్లో పెట్టిందని , మూడు సంవత్సరాలు గడిచిన పిఆర్సి ఊసే లేదని, బదిలీలు ప్రమోషన్లను పట్టించుకోవడంలేదని, సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి పట్టించుకోవడంలేదని, 2003 డీఎస్సీ వారికి సిపిఎస్ రద్దు చేయమని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమం కొనసాగిస్తామని పేర్కొనడం జరిగింది. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బీరకాయల తిరుపతి మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అలుపెరగని పోరసాగిస్తుందని, పోరాట క్రమంలో భాగంగా ఆగస్టు ఒకటిన ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున జరిగే ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ భారీ సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరడం జరిగింది. ప్రభుత్వం తక్షణమే నిర్లక్ష్య వైఖరి విడనాడి ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పట్ల దృష్టి సారించాలని డిమాండ్ చేయడం జరిగింది. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నంగునూరు మండల శాఖ అధ్యక్షులు కత్తుల రాంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం పట్ల ఉపాధ్యాయులు చూపిస్తున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని, ఉపాధ్యాయ రంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొనడం జరిగింది. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సిద్దిపేట డివిజన్ కార్యదర్శి అనుముల వీరేశం మాట్లాడుతూ నంగునూరు మండల సభ్యత్వ అభియాన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని, ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని, కేజీబీవీ మరియు మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో గడీల శ్రీకాంత్, చంద్రకాంత్ ,శ్రీనివాస్ రెడ్డి, జి వెంకటేశం, మునరాశి రాములు,మురళీధర్ రెడ్డి, పల్నాటి శ్రీనివాస్, రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, వీరారెడ్డి అనిల్ యాదవ రెడ్డి, గోవర్ధన్ ,పరుశరాములు, బాలకిషన్, సుమలత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## అత్తాపూర్‌లో అక్రమ ఫుడ్ యూనిట్ సీజ్



**రాజేంద్రనగర్, జూలై 30 (జనంసాక్షి) :** హైదరాబాద్ అత్తాపూర్‌లో ఎలాంటి పేరు బోర్డు, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేకుండా రహస్యంగా నిర్వహిస్తున్న ఫుడ్ ఎస్టాబ్లిష్మెంట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. తనిఖీల్లో తీవ్ర అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలు, వాడిన నూనెను మళ్లీ వినియోగించడం వంటి లోపాలు గుర్తించారు. సుమారు 3 వేల పానీపూరీలు, 4 కిలోల సమోసాలు, 2 కిలోల వాడిన వంటనూనెను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఆహార నమూనాలను పరీక్షల కోసం సేకరించి, ఫుడ్ యూనిట్‌ను సీజ్ చేసి కార్యకలాపాలను నిలిపివేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
31 జూలై 2026

# నారాయణపేటను డ్రగ్స్ రహిత జిల్లాను నిర్మిద్దాం



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 30 (జనం సాక్షి) :** డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల నుండి సమాజాన్ని విముక్తి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా ముందుకు రావాలని తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఎస్పీ పి.వి. పద్మజ, జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ లు పిలుపునిచ్చారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్,నారాయణపేట జిల్లా పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో డ్రగ్స్ వ్యతిరేకంగా భారీ అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఎస్పీ పి.వి. పద్మజ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఎస్పీ పి.వి. పద్మజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన కోసం విస్తృత స్థాయిలో దాడులు నిర్వహిస్తూ సమర్థవంతంగా పనిచే స్తోందన్నారు. డ్రగ్స్ నిర్మూ లనలో ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో అవ సరమని పేర్కొన్నారు. నారాయణపేట జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువత తమ జీవిత లక్ష్యా లను దృష్టిలో పెట్టుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. స్నేహితులు లేదా పరిచయ స్తుల్లో ఎవరైనా డ్రగ్స్ విని యోగిస్తున్నట్లు తెలిసినా, విక్రయిస్తున్నట్లు గమనిం చినా వెంటనే 1908 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా సమీప పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, లెక్చరర్లు విద్యార్థుల ప్రవ ర్తనపై ప్రత్యేక నిఘా ఉంచా లని సూచించారు. విద్యా సంస్థల్లో డ్రగ్స్ వినియోగం లేదా విక్రయం జరిగినట్లు గుర్తిస్తే బాధ్యులపై చట్టపర మైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలవాటు కు గురైన విద్యార్థులను గుర్తించి డీ-అడిక్షన్ కేంద్రాల కు పంపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక మాట్లాడుతూ మాదకద్రవ్యాల విషయంలో ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని విద్యార్థులకు సూచించారు. ఒక్కసారి తీసుకుంటే ఎవరికీ తెలియదు"అనే భావన పూర్తిగా తప్పని స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల సహకారంతో పోలీసు శాఖ అక్రమ మాద కద్రవ్యాల కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచు తోందన్నారు. డ్రగ్స్‌కు ప్రోత్సహించే వారు నిజమైన స్నేహితులు కాదని, చెడు అలవాట్లకు "లేదు" అని చెప్పగలిగే ధైర్యమే నిజమైన వ్యక్తిత్వమని అన్నారు. ఎవరైనా డ్రగ్స్ వినియో గిస్తున్నా లేదా విక్రయిస్తు న్నా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలపై విద్యార్థులు సమాజంలో అవగాహన కల్పిస్తూబాధ్యతాయుతమైన పౌరులుగా నిలవాలని, తమ తోటి విద్యార్థులను కూడా వ్యసనాలకు దూరం గా ఉంచే బాధ్యత తీసుకో వాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూరాష్ట్ర ఈగల్ ఫోర్స్ బృందం డ్రగ్స్ నిర్మూ లన కోసం నిరంతరం ప్రత్యే క దాడులు నిర్వహిస్తోందని తెలిపారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఈగల్ ఫోర్స్ ఎస్పీ పద్మజ జిల్లాలో డ్రగ్స్, గంజాయి అంశంపై రివ్యూ నిర్వహిం చడం జరిగింది. ఈ సంద ర్భంగా జిల్లాలో డ్రగ్స్ అమ్ముతున్న వినియోగి స్తున్న సరఫరా చేస్తున్న వ్యక్తులపై నిఘా ఉంచి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, విరివిగా డ్రగ్స్ కిట్లతో తనిఖీలు నిర్వ హించాలని ఎవరైనా బాధి తులు ఉంటే వారిని డీ అడిక్షన్ సెంటర్కు పంపించి కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సమూలంగా నిర్మూలించాలని అధికారు లు తెలిపారు. ఈ కార్య క్రమంలో డీఎస్పీలు నల్లపు లింగయ్య, తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఉమ్మడి మహబూబ్‌నగర్ ఇన్‌చార్జి డీఎస్పీ బుచ్చయ్య, డీఎంహెచ్‌వో జయచంద్ర మోహన్, సీఐలు శివశం కర్, రామ్‌లాల్, సైదులు, భగవంత్ రెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్ను వసూలు చేయండి

- కంటెస్టెడ్ ఎమ్మెల్యే క్యాండిడేట్ గాదగోని చక్రధర్ గౌడ్



**సిద్దిపేట బ్యూరో, జూలై 30 (జనం సాక్షి) :** మున్సిపల్ అధికారుల తీరు అయిన వారికి ఆకుల్లో కాని వారికి కంచాల్లో అన్న చందానా ఉందని కంటెస్టెడ్ ఎమ్మెల్యే క్యాండిడేట్ గాదగోని చక్రధర్ గౌడ్ అన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల పెండింగ్ ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేయాలని కోరుతూ గురువారం మున్సిపల్ కార్యాలయంలో చక్రధర్ గౌడ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సాధారణ ప్రజలకు సంబంధించిన ఆస్తి పన్ను విషయంలో ముక్కు పిండి వసూలు చేసే బల్దియా అధికారులు ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఆస్తి పన్ను వసూలు విషయంలో నిర్లక్ష్యం వ్యవహరించడం సరికాదన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో 73 ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి రూ. 4 కోట్ల మేర ఆస్తి పన్ను బకాయిలు ఉందన్నారు. అందులో 37 ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి లక్షల్లో బకాయిలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. పోలీసు కన్వెన్షన్ రూ.10 లక్షల పైచిలుకు, విద్యుత్ కార్యాలయానికి సంబంధించి రూ.32 లక్షల పెండింగ్ ఉందని అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తుంది అన్నారు. శత శాతం పన్ను వసూలు పేరిట పేద ప్రజల వద్ద పన్నులు వసూలు చేయడానికి ఉత్సాహం చూపే మున్సిపల్ అధికారులు ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఆస్తి పన్ను ఎందుకు వసూలు చేయడం లేదని సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఆస్తి పన్ను మున్సిపల్ అధికారులు వసూలు చేయని పక్షంలో కోర్టును ఆశ్రయిస్తానని గాదగోని చక్రధర్ గౌడ్ హెచ్చరించారు.

## పాముకాటుతో విద్యార్థి మృతి



**అయిజ, జూలై 30 (జనంసాక్షి) :** అయిజ మండలం వెంకటాపూర్ గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. 8వ తరగతి చదువుతున్న కే. తిరుమలేష్ (14) రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటేసింది. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తిరుమలేష్ మృతి చెందాడు. సమీపంలో వైద్యం అందుబాటులో లేకపోవడమే తిరుమలేష్ మరణానికి కారణమని గ్రామస్తులు అంటున్నారు. సరైన వైద్యం లేక మృత్యువాత పడినట్టు కుటుంబ సభ్యుల ఆరోపణ. తండ్రి పాము కాటుని గుర్తించిన తర్వాత మోటు వైద్యానికి ప్రయత్నించి వెంటనే ఐజ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ రాత్రి అత్యవసరా ఎంబీబీఎస్ డాక్టర్లను నియమించకపోవడంతో స్టాఫ్ నర్స్ ఉన్నారు కానీ తిరుమలేష్ పరిస్థితి అప్పటికే కొంత సీరియస్ ను గుర్తించిన స్టాఫ్ నర్స్ గద్వాల్ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. మళ్లీ అక్కడి నుండి కర్నూలుకి రెఫర్ చేశారు ఈ ప్రాసెస్ అంతా జరిగేసరికి తిరుమలేష్ పరిస్థితి చాలా తీవ్రంగా మారి మృత్యువాత పడినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

## అంతరాష్ట్ర దొంగలు అరెస్ట్

- 84 కేసుల నేరచరిత్ర కలిగిన ప్రధాన నిందితులు
- చోరీ సొత్తు, వాహనాలు స్వాధీనం
- వెల్లడించిన సంగారెడ్డి డి.ఎస్.పి సత్తయ్య గౌడ్



**సంగారెడ్డి జులై 30 (జనం సాక్షి) :** ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను అరెస్టు , అరెస్టు చేసి డిమాండ్ పంపిస్తున్నట్లు సంగారెడ్డి డి.ఎస్.పి సత్తయ్య గౌడ్ గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా పోలీసులను చూసి ద్విచక్ర వాహనాలపై పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా సంగారెడ్డి జిల్లా మామిడిపల్లి, బేగంపేట గ్రామాలతో పాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాలు, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు ప్రాంతాల్లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.. విచారణలో భాగంగా మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ బ్యాటరీలు, సీపీయూలు, జే బోర్డులు తదితర సామగ్రి చోరీ చేసిన కేసుతో పాటు బేగంపేట గ్రామంలో బంగారు, వెండి ఆభరణాల చోరీ కేసులను కూడా వీరే చేసినట్లు తేలిందని పోలీసులు వెల్లడించారు. పోలీసుల సమాచారం ప్రకారం ప్రధాన నిందితుడు అమర్ రాజ్ కుమార్ రెడ్డిపై హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో మొత్తం 84 చోరీ కేసులు నమోదై ఉండగా, ఇప్పటికే పలుమార్లు జైలు శిక్ష అనుభవించాడు. ఇటీవల జైలు నుంచి విడుదలైన అనంతరం తన సహచరులు సాయికిరణ్, షేక్ సలీమ్‌తో కలిసి మళ్లీ చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. దొంగిలించిన బంగారు ఆభరణాలను హైదరాబాద్‌లోని ఓ వ్యక్తికి విక్రయించి వచ్చిన నగదును నిందితులు పరస్పరం పంచుకుని ఖర్చు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి గతంలో మియాపూర్, ఎస్.ఆర్.నగర్ పోలీస్ స్టేషన్ పరిధుల్లో చోరీకి గురైన రెండు హిమాలయన్ రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిళ్లు, ఒక ఆక్టివా స్కూటీ, సెల్‌ఫోన్‌తో పాటు చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరుపరచగా, తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఈ కార్యక్రమంలో సంగారెడ్డి రూరల్ సిఐ నయుముద్దీన్, ఎస్సై మధుసూదన్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిబంధనలు తుంగలో తొక్కిన హనుమమ్మ ఫంక్షన్ హాల్

- జనం సాక్షి కథనానికి స్పందన
- అధికారుల మౌనం వెనుక కారణాలేంటి..?
- అనుమతులు, పార్కింగ్, అగ్నిమాపక భద్రతపై ప్రశ్నలు
- ప్రజలకు ఇబ్బందులు.. పట్టించుకోని యాజమాన్యం?
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్


చాట్లపల్లోని కుంట అలుగు కబ్జా
చట్టబద్ధమైన అనుమతులు లేకుండా ఫంక్షన్ హాల్



**మెదక్ బ్యూరో, జూలై 30 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టి పల్లి చౌరస్తా వద్దనున్న ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి... చాట్లోని కుంట అలుగును ఆక్రమించి నిర్మించిన హనుమమ్మ ఫంక్షన్ హాల్ పట్ల రెవిన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు ఉదాసీన వైఖరి అలంభించడం పట్ల స్థానికులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పోతంశెట్టిపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 581 లో విస్తీర్ణం ఒక ఎకరం రెండు గుంటల భూమితో పాటు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేయడమే కాకుండా, మరో పక్క ఉన్న చాట్లోని కుంట అలుగును ఆక్రమించి గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే 10 సంవత్సరాల క్రితం నిర్మాణం గావించారు. అప్పటినుంచి గ్రామపంచాయతీకి... ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎగ్గొడుతున్నా అధికారులు అటువైపు చూడకపోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కాలేదు. 2017- 18 సంవత్సరంలో అప్పట్లో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి గ్రామపంచాయతీ రికార్డులో మాన్యువల్ గా నమోదు చేశారు. అట్టి ఆస్తికి అసెస్మెంట్ నెంబర్ లేకపోవడం... ఆ తర్వాత ఆన్లైన్లో అప్పట్నుంచి ఇప్పటివరకు ఎలాంటి అనుమతులు లేవు. అలాగే గ్రామ పంచాయతీకి ఎలాంటి పనులు చెల్లించలేదు.

రోడ్డు పక్కనే ఉన్న ఫంక్షన్ హాల్‌కు భద్రత కరువు

వివాహాలు, ఇతర శుభకార్యాల సందర్భంగా భారీ సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నప్పటికీ, అవసరమైన భద్రతా ప్రమాణాలు, పార్కింగ్ సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను యాజమాన్యం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫంక్షన్ హాల్‌కు సంబంధించిన నిర్మాణ అనుమతులు, అగ్నిమాపక శాఖ నుంచి ఫైర్ సేఫ్టీ ఎన్ఓసీ, పార్కింగ్ స్థలం, అత్యవసర నిష్క్రమణ మార్గాలు వంటి అంశాలపై అధికారులు సమగ్ర తనిఖీ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఫంక్షన్ హాళ్లు స్థానిక సంస్థల అనుమతులు, భద్రతా ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. శుభకార్యాల సమయంలో రహదారులపై వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని, స్థానికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని నివాసితులు చెబుతున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు.

### ప్రజల ప్రాణాలను గాలికి వదిలేస్తున్న ఫంక్షన్ హాల్ యాజమాన్యం

ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే వేడుకల అనంతరం మిగిలిన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో పారవేయకుండా ఖాళీ స్థలంలో పడేయడం, వాటిని కాల్చివేయడం వల్ల పరిసర ప్రాంతాల్లో కాలుష్యం పెరుగుతోందని అంటున్నారు. వర్షాకాలంలో ఈ చెత్త కారణంగా దోమలు, దుర్వాసన, అంటువ్యాధుల ప్రమాదం కూడా పెరుగుతోందని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### నోటీసులు ఇచ్చిన గ్రామపంచాయతీ అధికారులు

కొల్చారం మండలం పోతంశెట్టి పల్లి చౌరస్తా సమీపంలో గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా గ్రామ పంచాయతీకి ఎలాంటి పన్నులు చెల్లించకుండా గత ఏడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న హనుమమ్మ గార్డెన్ ఫంక్షన్ హాల్ కు గ్రామపంచాయతీ కార్యదర్శి పోచయ్య గురువారం నోటీసులు జారీ చేశారు. పంచాయతీ అనుమతులు లేకుండా ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేయడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఫంక్షన్ హాల్ వ్యర్థాలను తగలబెట్టిడం వల్ల చుట్టుపక్కల ఇండ్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ఇలాంటి చర్యలు మానుకోవాలని నోటీసులు ఇచ్చారు.

## పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



**రాయికోడు, జూలై 30 (జనం సాక్షి) :** పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రముఖ న్యాయవాది జి అంజయ్య పేర్కొన్నారు. రాష్ట్ర వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రమైన రాయికోడ్ లోని రైతు వేదికలో తాసిల్దార్ ఆశాజ్యోతి, డిప్యూటీ తాసిల్దార్ నరేష్, స్థానిక సర్పంచ్ రాధా తుకారం లతో కలిసి వివిధ గ్రామాలకు సంబంధించిన 41 మంది లబ్ధిదారులకు 41, లక్షల 4, వేల 756 రూపాయల కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని గుర్తు చేశారు. రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో రాయికోడు మండల అభివృద్ధికి వందల కోట్ల రూపాయలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు,సింగీతం నుండి కోదూరు వరకు, రాయికోడు ఎక్స్ రోడ్డు నుండి కంకోల్ వరకు డబ్బులు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. మెటల్ కుంటా అల్లాదుర్గం రోడ్డు నిర్మాణానికి మంత్రి దామోదర్ 218 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్న పాటిల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలాజీ నర్సింలు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు కేదార్నాథ్ పాటిల్, వైస్ చైర్మన్ వినయ్ కుమార్, వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విదర్భన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ప్రభాకర్, పిఏసిఎస్ అధ్యక్షులు నాగిశెట్టి, మాజీ అధ్యక్షులు నజీర్,ఆయా గ్రామాల సర్పంచులు చరణ్,ఎర్రోళ్ల నరేష్,నాయకులు సంగమేశ్వర పాటిల్, సుభాష్ ,దుర్గేష్,పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రిలో తీవ్ర తాగునీటి ఎద్దడి

- రోగుల అవస్థలు
- గర్భిణీలకు వేడినీళ్లు కూడా కరువు
- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి. నరసింహ గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జుట్ల చిన్న హన్మతు విమర్శ



**మక్తల్, జూలై 30 (జనంసాక్షి) :** మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రిలో గత కొంతకాలంగా రోగులు, గర్భిణీ స్త్రీలు మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి. నరసింహ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జుట్ల చిన్న హన్మతు విమర్శించారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ బృందం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న నీటి సమస్యను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆసుపత్రిలో నీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అయితే గత కొంతకాలం క్రితం ఆ వాటర్ ప్లాంట్ రిపేర్ కు రావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. కనీసం ఆ వాటర్ ప్లాంట్ ను రిపేరు చేయించేందుకు కూడా స్థానిక ఆసుపత్రి అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గత కొన్ని నెలలుగా ఆసుపత్రిలో మంచినీళ్లు లేక రోగులు నానా ఇబ్బందులు పడుతున్నా వారి గోడును పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలకు కావాల్సిన వేడినీళ్లు అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రి ముందున్న ఒక సెంటర్ వద్ద ప్రతిరోజూ తెచ్చుకుని కాలం గడుపుతున్నామని ఆసుపత్రిలోని మహిళలు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వెంటనే మహిళలకు వేడినీళ్ల ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం 6 నెలల క్రితం జరిగిందని, ఇప్పటివరకు మళ్లీ సమావేశం జరగలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. నీటి సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అది తమ పరిధిలో లేదని అక్కడి డాక్టర్లు, సిబ్బంది చెబుతున్నారని తెలిపారు. వెంటనే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గ కేంద్రంలోని ఆసుపత్రి పరిస్థితే ఇలా ఉంటే, మారుమూల ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలు అర్థం చేసుకోవచ్చని అన్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో టెలిఫోన్ లో మాట్లాడుతూ సమస్య పరిష్కారం కాకపోతే తానే సొంతంగా వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా వైద్యాధికారి ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి పెట్టి మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మొగిలి లప్ప, శివారెడ్డి, అభిరామ్ గౌడ్, అమ్రేష్, ఉప్పరి రఘు, ఎలిగండ్ల బాలప్ప, మారెప్ప, మహమ్మద్, నర్సింలు నాయుడు, కె. ఆంజనేయులు, అశోక్ కుమార్ యాదవ్, నేతాజీ రెడ్డి, ఆంజనేయ రెడ్డి, తిరుమలాపూర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మేను ప్రకారం భోజనం అందించాలి

- గ్రంథాలయ చైర్మెన్ జి. అంజయ్య



**రాయికోడు, జూలై 30 (జనం సాక్షి) :** విద్యార్థిని విద్యార్థులందరికీ మేను ప్రకారమే భోజనం అందించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య అధికారులకు సమాచారం సూచించారు. గురువారం మండల పరిధిలోని అల్లాపూర్ చౌరస్తాలో గల ఎస్సీ గురుకుల పాఠశాలను ఆయన మండల అధికారులు, ప్రజాప్రతినితో కలిసి సందర్శించారు. పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ విద్యార్థులకు మేను ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ దత్తురాని,స్థానిక సర్పంచ్ చరణ్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలాజీ నరసింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేదార్నాథ్ పాటిల్, వీరభద్ర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, నాయకులు ఏ ప్రభాకర్,ఎం శివకుమార్,సుభాష్, తుకారం తదితరులు పాల్గొన్నారు.

# భూ సర్వేకు గ్రామ ప్రజలందరూ సహకరించాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**రేగొండ (కొత్తపల్లిగోరి) జూలై 30( జనం సాక్షి):** మండలంలోని చెన్నాపూర్ రెవిన్యూ గ్రామా భూ సర్వే గ్రామసభకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గురువారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భూ సర్వేకు ముందు గ్రామ ప్రజలకు నోటీసులు అందజేసి పారదర్శకంగా సర్వే నిర్వహిస్తామని, ప్రతి రైతు, ప్రతి కుటుంబం ఈ సర్వేకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సర్వే ద్వారా భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ధారించబడటంతో పాటు, ఒకరి పేరుపై ఉన్న భూమిని అసలు యాజమాని పేరుకు మార్చే అవకాశం కలుగుతుందని తెలిపారు. అలాగే అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లు అందజేయడం ద్వారా రైతు భరోసా, రైతు బీమా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పల్లెబోయిన బిక్షపతి, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, గోరుకొత్తపల్లి రేగొండ మాజీ జెడ్పిటిసి సాయిని విజయ ముత్యం తహసీల్దార్, హేమ ఎంపీడీవో, ఏడీ సర్వే అధికారులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు అల్లే దేవేందర్ ఉపసర్పంచ్ తోట సారంగపాణి వార్డ్ మెంబర్లు రాజేందర్ రవి శంకర్ కొడగాని తిరుపతి డోకుల రాజేందర్ బండారి మూర్తి గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలు ఆందోళన చెందొద్దు

- దామిని 541 మిర్చి విత్తనాలపై ఆరోపణలు నిరాధారం
- విత్తన డీలర్ తాళ్లపల్లి రాజు



**నడికూడ, జూలై 30 (జనం సాక్షి) :** దామిని 541 మిర్చి రకం గింజ లపై ఇటీవల వెలువడిన ఆరోప ణలు నిరాధారణమని పరకాల ఆర్.కె. ఫర్టిలైజర్ అధినేత తాళ్ల పల్లి రాజు అన్నారు. గురువారం నడికూడ మండలం వరికోల్ గ్రామంలో 90 శాతం మంది రైతులు దామిని 541 మిర్చి పంటలను వేయడానికి పంట చేనులలో నారు పోయడం జరిగింది . నేల స్వభావం, రైతుల నిర్లక్ష్యంతో కొంతమంది రైతుల మిర్చి విత్తనాలు మొలకె త్తలేదని ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. భూమి సారవంతాన్ని బట్టి, సాధారణం కంటే నాలుగైదు రోజులు ఆలస్యంగా గింజలు మొలకెత్తుతాయని, వీటిపై ఆందోళన అవసరం లేదని తెలిపారు. వరి కోల్ గ్రామంలో స్థానిక రైతులు రైతులు నాటిన మొలకలను రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు . గింజ నాటిన నుండి తొమ్మిది రోజుల నుండి 11 రోజుల వరకు మొలకెత్తు తాయన్నారు. స్థానిక రైతు గాలిపు రాజు వ్యవసాయ భూలోని మిరప నారాయణ పరీక్షించి 90 శాతం మొలకెత్తింద న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత సంవత్సరం ఎకరానికి 40 క్వింటాళ్ల చొప్పున దామిని 541 రకం మిర్చి అధిక దిగుబడి వచ్చిందని చెప్పారు. ఈ రకంపై ఇటీవల చేసిన ఆరోప ణలు నిరాధారణమని రైతులు తెలిపారు. మిర్చి గింజలు భూమిలో నాటినప్పటినుండి పంట పూర్తయి కోతకు వచ్చే వరకు కంపెనీ వారు దగ్గరుండి వాటి పరిరక్షణకై , సూచనలు సలహాలు ఇస్తున్నారని అన్నారు. అన్నదాతలకు అండగా మేము ఉంటామని వరికోల్ గ్రామంలో 90 శాతం మంది రైతులు దామిని 541 రకం మిర్చి పంటను వేయడం జరుగుతుందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనచెందకుండా దామి ని 541 రకం విత్తనాలను వాడ వచ్చని తెలియ జేశారు. విత్తనాలు పోసిన రైతులు పరిశీలిం చిన రైతులు .. మెతుకుపెల్లి శ్రీనివాసరెడ్డి, బాలుగు మొగిలి, ఎసి రెడ్డి రాజు, మండల కుమారస్వామి, ఆరె రాజు, ఆరె రమేష్, మూత శ్రీనివాస్, పింగిలి శంకర్, ఆర్ ఏ కుమార స్వామి మిర్చి నారి మళ్లను పరిశీలించారు.

# భారీ వర్షాలతో జాగ్రత్తగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వాతావరణ శాఖ సూచన మేరకు రానున్న రెండు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అందరూ జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజలు అవసరం లేకుండా బయటకు రావద్దని సూచించారు. బయటకు వచ్చే పరిస్థితి ఉంటే తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. వాగులు, వంకలు, చెరువులు, కల్వర్టుల వద్దకు వెళ్లవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. రహదారులపై నీరు ప్రవహిస్తుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ రవాణా చేయకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పశువుల సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 9030632608 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రజల భద్రతే తమ ప్రాధాన్యమని, ఈ విషయంలో ప్రజలు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఏడు బావుల జలపాతం వద్ద సందర్శన నిషేధం



**గంగారం జులై 30 (జనం సాక్షి) :** గంగారం మండలంలోని ఏడు బావులు జలపాతం ఇటీవల కురిసిన వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్నందున, గతంలో జరిగిన ప్రాణ నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని జలపాతం వద్ద ఏర్పాటుచేసిన భద్రత చర్యలను ఈరోజు మహబూబాబాద్ డిఎస్పి తిరుపతి రావు మరియు గూడూరు సీఐ వినయ్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సందర్శకులు ఎవరు కూడా జలపాతం వద్దకు రావద్దని డిఎస్పి తిరుపతి రావు తెలియజేశారు. ఈ మేరకు అటవీశాఖ మరియు పోలీస్ శాఖ సిబ్బంది తో గంగారం ఎస్సై కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జలపాతం సందర్శనకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమించిన వారికి పై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలియజేశారు.

# గోదావరికి పోటెత్తుతున్న వరద

- క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం



**మంగపేట, జూలై 30(జనంసాక్షి) :** నాలుగు రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాలకు గోదావరి నది నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో పాటు, కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్దగల సమ్మక్క-సారక్క బ్యారేజ్ గేట్లు ఎత్తి దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేయడంతో గురువారం గోదావరిలో నీటి ప్రవాహం మరింత పెరిగింది. ప్రస్తుతం మంగపేటలోని బిల్ట్ ఇంటెక్‌వెల్, పుష్కరఘాట్ వద్ద గోదావరి నది పరవళ్ళు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. నది పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# వదలని వాన.. అదే జోరు..

- జిల్లాలో 118.7 మి.మీ సగటు వర్షం
- ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి నది
- మానేరు వాగులో రాకపోకలు బంద్
- చెరువులకు జలకళ
- సింగరేణిలో నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వరుసగా రెండో రోజు కూడా వర్షాలు ధారాపాతంగా కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వర్షాభావంతో బోసిపోయిన చెరువులు, కుంటలు, వాగులు జలకళను సంతరించుకుంటున్నాయి. ఈ వర్షాలతో ఖరీఫ్ పంటలకు మేలు జరుగుతోంది. విత్తనాలు వేసిన రైతులకు ఉపశమనం కలిగింది. భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**జిల్లా సగటు 118.7 మి.మీ.. -పలిమెలలో అత్యధికం 175.6 మి.మీ..**

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా సగటు వర్షపాతం 118.7 మి.మీ నమోదైంది. రెండు రోజుల్లో జిల్లాలో మొత్తం 1306 మి.మీ వర్షం కురిసింది. అత్యధికంగా పలిమెల మండలంలో 175.6 మి.మీ వర్షం నమోదైంది. కాటారం 161.2 మి.మీ, మహదేవ్‌పూర్ 156.4 మి.మీ, మహాముత్తారం 155.4 మి.మీ, మల్హర్‌రావు 135.2 మి.మీ, భూపాలపల్లి 129.6 మి.మీ వర్షపాతం నమోదు కాగా, టేకుమట్ల 100.8 మి.మీ, గణపురం 90 మి.మీ, చిట్యాల 75.8 మి.మీ, రేగొండ 73.2 మి.మీ, మొగుళ్లపల్లి 52.8 మి.మీ వర్షం కురిసింది.

**బ్యారేజీలకు భారీగా చేరిన నీరు..**

ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరదతో కాళేశ్వరం వద్ద గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. మహదేవ్‌పూర్ మండలంలోని లక్ష్మి, మేడిగడ్డ బ్యారేజీల వద్ద పూర్తి స్వేచ్ఛా ప్రవాహ స్థితికి చేరుకుంది. గురువారం మధ్యాహ్నం 12 గంటల సమాచారం ప్రకారం బ్యారేజీలోకి 1,31,420 క్యూసెక్కుల నీరు వస్తుండగా, అదే స్థాయిలో 85 గేట్లను ఎత్తి కిందకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం ం90.70 మీటర్లుగా ఉంది. గత 18 గంటల్లో ఇన్‌ఫ్లో 57,000 క్యూసెక్కులు పెరిగింది. కాళేశ్వరం వద్ద కూడా గోదావరి నిండు కుండలా ప్రవహిస్తోంది. నీటి మట్టం 6.5 మీటర్లుగా నమోదైంది. ఎగువన ఇంకా వర్షాలు కురుస్తున్నందున ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. నదీ పరివాహక గ్రామాల ప్రజలు, మత్స్యకారులు, దిగువ ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**వర్షాల ధాటికి పలుచోట్ల నష్టం..**

భారీ వర్షాల ప్రభావం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కనిపించింది. కాళేశ్వరంలోని మజీద్‌పల్లి ప్రాంతంలో చేపల వర్షం కురిసింది. గ్రామ పల్లె ప్రకృతి వనం సమీపంలో ఆకాశం నుంచి చేపలు పడ్డాయని స్థానికులు చెప్పారు. అదే మండలంలో గగ్గురి లక్ష్మి, గౌరయ్య ఇల్లు వర్షాలకు పూర్తిగా కూలిపోయింది. మహదేవ్‌పూర్ మండలం మద్దులపల్లిలో చక్కినారపు మల్లయ్య ఇంటి గోడ భారీ వర్షాలకు కూలింది. ఘటన సమయంలో కుటుంబ సభ్యులు బయట ఉండటంతో ప్రమాదం తప్పింది. సర్పంచ్ సరిత, వార్డు సభ్యులు శ్రీజ, మనక్కా ఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందించేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. టేకుమట్ల మండలంలోని బోర్నపల్లి వాగులో వరద ఉధృతి కొనసాగుతోంది. ఎస్సై అమూల్య ఆదేశాలతో కానిస్టేబుల్ మహేందర్ వాగు పరిస్థితిని పరిశీలించారు. గరిమిల్లపల్లి, ఓడేడు గ్రామాల మధ్య మానేరు వాగు ఉప్పొంగడంతో తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాల ప్రభావంతో భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తి, రవాణా నిలిచిపోయింది. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలోని ఆసరల్లి-పాతగూడెం మధ్య జాతీయ రహదారి 63పై ఇంద్రావతి నది నీరు చేరడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, వరద నీటిలోకి వెళ్లవద్దని, అధికారులు జారీ చేసే సూచనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**మావల, జూలై 31(జనం సాక్షి):** ప్రభుత్వ సంక్షేమ, పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగపరచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాల కింద ద్విచక్ర, త్రిచక్ర వాహనాల మంజూరు కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కలెక్టర్ సమక్షంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అత్యంత పారదర్శకంగా, లాటరీ పద్ధతి ద్వారా చేపట్టడం జరిగిందన్నారు. అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన గిరిజన మత్స్యకారులకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం జరిగిందని స్పష్టం చేశారు. జిల్లాకు మరిన్ని యూనిట్లు మంజూరు అయ్యేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించస్తామన్నారు. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు మంజూరైన లబ్ధిదారులు వారి వినియోగంతో ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా మత్స్యకారులు, ప్రజలు, అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల తీవ్రతను గమనిస్తూ తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. రీల్స్, చేపల వేట కోసమని సాహసాలు చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని విజ్ఞప్తి చేశారు. అపారమైన నీటి ప్రవాహాలు ఉన్న చోట అజాగ్రత్తగా ఉంటే తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశముందని గుర్తుచేశారు. ముఖ్యంగా నేటి యువత సోషల్ మీడియా రీల్స్, ఫొటోలు, సరదాల కోసం ప్రమాదకర స్థాయిలో నిండిన చెరువులు, పొంగిపొర్లుతున్న చెక్ డ్యామ్‌ల వద్దకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఈ లక్కీ డ్రా లో జిల్లా మత్స్య శాఖ అధికారి సాంబశివ రావు, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్, ఎల్డియం ఉత్పల్ కుమార్, మత్స్య సంఘాల నాయకులు, మత్స్యకారులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి బండ్‌పై పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- బల్దియా కమిషనర్ టి.వెంకన్న
- భద్రకాళి,వడ్డేపల్లి బండ్ లపై కొనసాగుతున్న పనుల పరిశీలన



**వరంగల్ ఈస్ట్, జులై 30 (జనం సాక్షి) :** భద్రకాళి బండ్ పై పెండింగ్ పనులను పూర్తి చేసేలా చూడాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. గురువారం నగర పరిధిలోని భద్రకాళి, వడ్డేపల్లి బండ్ లను క్షేత్ర స్థాయిలో సందర్శించి పూర్తి చేసిన పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొని వేగవంతం గా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భం గా భద్రకాళి బండ్ పై పూర్తి చేసిన పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీ వారు పక్షం రోజులో బండ్ పై మిగిలిపోయిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని అన్నారు. అనంతరం వడ్డేపల్లి బండ్ ను సందర్శించిన కమిషనర్ బండ్ పై కొనసాగుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని ఆగస్టు లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. భద్రకాళి బండ్ పై హార్టికల్చర్ కు సంబంధించి గ్రీనరీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అందుకోసం అంచనాలు తయారు చేయాలని అన్నారు. వడ్డేపల్లి బండ్ పైన గ్రీనరీ ఏర్పాటు కు టెండర్ ప్రక్రియ పూర్తి అయినందున వెంటనే పనులను ప్రారంభించాలని హార్టికల్చర్ అధికారిని ఆదేశించారు. ఈ పర్యటన లో కమిషనర్ వెంట పర్యవేక్షక ఇంజనీర్ రాజ్ కుమార్, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, డి ఈ రాజ్ కుమార్, ఏ ఈ హరికుమార్ తదితరులు ఉన్నారు.

# ఆకాల వర్షానికి కూలిన ఇల్లు

- మంత్రి సహకారంతో ఇల్లు మంజూరు చేయిస్తాని హామీ ఇచ్చిన సర్పంచ్ హసీనా భాను
- బాధితుడికి తక్షణమే ఆర్థిక సాయం అందించిన సర్పంచ్



**మహదేవపూర్, జూలై 30 (జనంసాక్షి):** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి మహదేవపూర్ మండల కేంద్రంలో టస్సర్ కాలనీ చెందిన ఇస్మాయిల్ ఖాన్ ఇల్లు కూలిపోయింది. సమాచారం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ హసినాబాను ఆర్ ఐ జగన్మోహన్ రెడ్డి. బాధితుడిని పరామర్శించి తక్షణమేఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. మూడు రోజుల నుండి కురిచే వర్షం ఆ పేద కుటుంబానికి కన్నీరు మున్నీరైంది. ఇస్మాయిల్ ఖాన్ కుటుంబం తలదాచుకోవడానికి నీడలేక రోడ్డున పడడం జరిగిందని. కూలిపని చేసుకుంటూ బ్రతికేవాడని ఈ నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి పక్క గృహాన్ని నిర్మించే ఇచ్చే బాధ్యత తీసుకుంటామని సర్పంచ్ హసీనా భాను అక్బర్ హామీ ఇచ్చారు. గ్రామస్తులు సర్పంచ్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేసిన భాను అక్బర్ ఖాన్. ఆర్ ఐ జగన్మోహన్ రెడ్డి. పంచాయతీ కార్యదర్శి కల్పన. పంచాయతీ పాలకవర్గం పాల్గొన్నారు.

# లక్నవరం సరస్సులో పెరుగుతున్న జలకళ

- రైతుల్లో ఖరీఫ్‌పై కొత్త ఆశలు




**గోవిందరావుపేట జులై30 (జనం సాక్షి) :** ఇటీవల కురుస్తున్న వర్షాలతో లక్నవరం సరస్సులోకి వరద నీరు చేరుతుండటంతో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం సరస్సులో 21 అడుగుల మేర నీటి నిల్వ నమోదైనట్లు సమాచారం. మరో ఐదు అడుగుల నీరు చేరితే ఖరీఫ్ సాగుకు అవసరమైన నీటి లభ్యత ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా తగిన వర్షాలు లేకపోవడంతో సాగునీటి కొరతపై ఆందోళన చెందిన రైతులకు తాజా వర్షాలు ఊరటనిచ్చాయి. లక్నవరం సరస్సులో నీటి మట్టం పెరుగుతుండటంతో ఆయకట్టు రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. రానున్న రోజుల్లో కూడా ఇదే తరహాలో వర్షాలు కురిస్తే సరస్సు పూర్తిస్థాయిలో నిండడమే కాకుండా, ఖరీఫ్ సీజన్‌లో వరి సహా ఇతర పంటలకు సాగునీటి సమస్య తీరే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. నీటి నిల్వలు మరింత పెరిగితే భూగర్భ జలాలు కూడా మెరుగుపడి పరిసర ప్రాంత రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని వారు పేర్కొంటున్నారు.




# దక్షిణ మండల సీబీఎస్ఈ చెస్ ఛాంపియన్‌షిప్‌లో సేజ్ హై స్కూల్ విద్యార్థి ప్రతిభ

**జనగామ ప్రతినిది, జులై30(జనంసాక్షి):** సేజ్ హై స్కూల్, జనగామ జిల్లా విద్యార్థి పెర్నె అభినవ్ దక్షిణ మండల సీబీఎస్ఈ చెస్ ఛాంపియన్షిప్-2026 లో విశేష ప్రతిభ కనబరిచాడు. మొత్తం 6 రౌండ్లలో 5 విజయాలు సాధించి 1545 ఫిడే రేటింగ్ పాయింట్లు సంపాదించి పాఠశాలకు, జనగామ జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. అభినవ్ ఈ విజయానికి క్వెస్ట్ మిత్రా చెస్ అకాడమీ ప్రధాన కోచ్ ఎండబట్ల మధు అందించిన నాణ్యమైన శిక్షణ, నిరంతర మార్గదర్శకత్వం కీలక పాత్ర పోషించాయి. ఈ సందర్భంగా సేజ్ పాఠశాల కరస్పాండెంట్ రోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు, క్వెస్ట్ మిత్రా చెస్ అకాడమీ సభ్యులు, తల్లిదండ్రులు అభినవ్తో పాటు కోచ్ ఎండబట్ల మధు ను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# వికసిత్ భారత్ కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ఎంపిక



**హనుమకొండ ప్రతినిధి జూలై 30 (జనంసాక్షి) :** హనుమకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకుడు ఆర్. విఘ్నేష్ రాష్ట్ర స్థాయి 'నషా ముక్త యువ – వికసిత్ భారత్ 2026' కార్యక్రమానికి ఎంపికయ్యారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్-హనుమకొండ నిర్వహించిన జిల్లా స్థాయి 'నషా ముక్త యువ – వికసిత్ భారత్ 2026' కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన ఆయన రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి తెలిపారు. త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి విద్యార్థిని అభినందించి, రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. ఎస్.ఎం. రెహమాన్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాధికారులు డా. ఎస్. శ్రీదేవి, డా. ఎన్. చందర్, డా. ఎ. రమేష్, ఎ. శ్రీలత విద్యార్థిని అభినందించి శు భాకాంక్షలు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కట్టుబాటు

## ప్రజాదర్బార్‌లో విశేష స్పందన!

- 3,500 వినతుల స్వీకరణ
- రూ.2.77 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం
- భూ రీ-సర్వేకు వేగం
- ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక ప్రక్రియ
- రూ.70.76 లక్షల సంక్షేమ సహాయం



**కల్లూరు/ అన్నపురెడ్డిపల్లి/ చంద్రుగొండ, జూలై 30 (జనం సాక్షి):** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. కల్లూరులో ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించడంతో పాటు, అన్నపురెడ్డిపల్లిలో అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు చేశారు. చంద్రుగొండలో పలు అభివృద్ధి కార్యక్రమా లను ప్రారంభించి, అనంతరం కల్లూరులో సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, భూ రీ-సర్వే, ఇందిరమ్మ ఇళ్లు, ఓటరు నమోదు కార్యక్రమంపై కీలక వ్యాఖ్యలు చేశారు.

**ప్రజాదర్బార్‌లో 3,500 దరఖాస్తులు**

కల్లూరులో జరిగిన సత్తుపల్లి క్లస్టర్ ప్రజా దర్బార్‌లో సుమారు 3,500 దరఖాస్తులు అందాయని మంత్రి తెలిపారు. వాటిలో 1,800 ఇందిరమ్మ ఇళ్లకు, 500 రెవెన్యూ సమస్యలకు, 200 పెన్షన్లకు సంబంధించినవని వెల్లడించారు. భూ రీ-సర్వే ద్వారా మరో ఏడాదిన్నరలో రాష్ట్రంలోని రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు. అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ధరణిలో జరిగిన అక్రమాలపై విచారణ కొనసాగుతోందని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**రూ.2.77 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం**

అన్నపురెడ్డిపల్లి మండలంలో మంత్రి రూ.2.77 కోట్ల అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు చేసి, భీమునిగూడెంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు భూనిర్వాసితుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**గుడిసెలులేని తెలంగాణే లక్ష్యం**

చంద్రుగొండలో మంత్రి మాట్లాడుతూ గుడిసెలులేని తెలంగాణే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇప్పటికే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించామని, రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్ల మంజూరుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు.

**రూ.70.76 లక్షల చెక్కుల పంపిణీ**

కల్లూరు మండలం నారాయణపురంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి 64 మంది లబ్ధిదారులకు రూ.21.70 లక్షల సీఎంఆర్ఎఫ్, 49 మంది లబ్ధిదారులకు రూ.49.05 లక్షల కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ (ఓటరు నమోదు) కార్యక్రమాన్ని 100 శాతం విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు ఆగస్టు 3లోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

## చత్తీస్గఢ్ రాష్ట్రంలో భారీ వర్షాలతో

# ఇంద్రావతికి పోటెత్తిన వరద

- 10 లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల..
- భద్రాచలం వద్ద నేడు తొలి ప్రమాద హెచ్చరిక జారీ..
- జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి కలెక్టర్..

**భద్రాచలం జూలై 30 (జనంసాక్షి)**

చత్తీస్గఢ్ రాష్ట్రంలో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురియడంతో ఇంద్రావతి నది ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. దీంతో చత్తీస్గఢ్‌లోని పాతగూడ వద్ద నుంచి 10 లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల చేశారు. దీంతో భద్రాచలం వద్ద శుక్రవారం తెల్లవారుజాము నుంచి గోదావరి వరద క్రమేపి పెరగనుంది. సాయంత్రంకు గోదావరి తొలి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరికి ఈ సీజన్‌లో తొలిసారి మొదటి ప్రమాద హెచ్చరిక దాటనుండటంతో జిల్లా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు తెలిపారు. భద్రాచలం డివిజన్‌లో వరద పరిస్థితిని కేంద్ర జల సంఘం, నీటిపారుదల శాఖ అధికారులతో సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ట పర్యవేక్షిస్తున్నారు. కాగా భద్రాచలం వద్ద గోదావరి గురువారం సాయం?రంకు వరకు 29 అడుగులకు చేరి తిరిగి మళ్లీ తగ్గుముఖం పట్టింది. బుధవారం రాత్రి 16.30 అడుగులున్న గోదావరి గురువారం ఉదయం 6 గంటలకు 25.40 అడుగులకు చేరుకుంది. 9 గంటలకు 27.40, 11 గంటలకు 28.30 అడుగులకు, మధ్యాహ్నం 12 గంటలకు 29 అడుగులకు చేరుకొని నిలకడగా సాయంత్రం 4 గంటల వరకు నిలకడగా ఉంది. అనంతరరం 28.50 అడుగులకు తగ్గింది. మళ్లీ రాత్రి 8 గంటలకు 28.50 అడుగుల వద్ద నిలకడగా ఉంది.



## కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్స్

### స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి



స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి

**గుండాల జులై 30( జనంసాక్షి)** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు జరుగుచున్నవని స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గుండాల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో నాణ్యమైన విద్య బాలికలకు భరోసా విశాలమైన తరగతి గదులు ఆహ్లాదకరమైన వాతావరణం పరిశుభ్రమైన మరుగుదొడ్లు మెరుగైన డార్మిటరీ గదులు కంప్యూటర్ ల్యాబ్స్ అంకితభావం కలిగిన ఉపాధ్యాయుల బోధన విద్యార్థినీలకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పరిశుభ్రమైన త్రాగునీరు, శానిటరీ నాప్కిన్ వ్లాగింగ్ వెండింగ్ మెషిన్లు హెల్త్ కేర్ రికార్డ్స్ మెరుగైన మౌలిక వసతులు, 24 గంటల భద్రత సీసీ కెమెరాల ఏర్పాటు పేద విద్యార్థినులకు కార్పొరేట్ వసతులు అద్భుతమైన సేవలు అందుబాటులో ఉన్నాయని అన్నారు అనంతరం 6వ తరగతిలో ఆరు సీట్లు 7వ తరగతిలో 8 సీట్లు ఇంటర్ 1బబి ఇయర్ అగ్రికల్చర్ క్రాప్ ప్రొడక్షన్ విభాగం లో 18 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆగస్టు 5వ తేదీ లోపు మండల పరిధిలోని అర్హత గల విద్యార్థినిలు సంబంధిత పాఠశాల ప్రత్యేక అధికారులను (ఎస్ఓ ను ) నేరుగా సంప్రదించి ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## సర్వే నెం.218 పట్టాదారులకు న్యాయం చేయాలి

### కలెక్టర్‌కు బీఆర్ఎస్ వినతి



**ఖమ్మం, జూలై 30,(జనంసాక్షి):** రఘునాథపాలెం గ్రామంలోని సర్వే నెం.218లో ఇంటి స్థలాలు పొందిన పట్టాదారులకు న్యాయం చేయాలని కోరుతూ ఖమ్మం నగర బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2009లో పేదలకు పట్టాలు ఇచ్చినా స్థలాలు చూపించలేదని, అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో రఘునాథపాలెం సర్వే నెం.218లో సుమారు 650 మందికి ఇంటి స్థలాలు కేటాయించారని తెలిపారు. ప్రస్తుతం అమరావతి?హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ హైవే, మోడల్ స్కూల్ నిర్మాణాల కారణంగా పలువురు పట్టాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు తమ పార్టీ వ్యతిరేకం కాదని, అయితే పట్టాదారులకు నష్టం జరగకుండా ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. హైవేతో ప్రభావితమవుతున్న వారికి తక్షణ పరిష్కారం చూపడంతో పాటు మిగిలిన పట్టాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి నెలరోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, బిచ్చాల తిరుమలరావు, మలుసూరు, పొదిల నాగరాజు, రఘునాథపాలెం సర్వే నెం.218 పట్టాదారులు, బాధిత కుటుంబాలు పాల్గొన్నారు.

## మధిరలో నల్లబ్యాడ్జీలతో విబి-జి రామ్ జి ఉద్యోగుల నిరసన

ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే సమ్మె తప్పదు.. జేపీసీ హెచ్చరిక



**మధిర, జూలై 30 (జనంసాక్షి):** మూడు నెలలుగా వేతనాలు చెల్లించక పోవడంతో విబి-జి రామ్ జి ఉద్యోగులు మధిరలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బకాయి వేతనాలు వెంటనే విడుదల చేసి, ప్రతి నెలా మొదటి తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పే స్కేల్ అమలు, పదోన్నతులు కల్పించాలని కోరుతూ, ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు దిగుతామని జేఏసీ హెచ్చరించిందివేతనాలకై పోరుబాట.

# చండూరు అభివృద్ధికి 25 ఏళ్ల ప్రణాళిక..

● పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతాం.. ● పుల్లెంల నుంచి చండూరు వరకు విస్తృత పర్యటన.. ● సమస్యలు తెలుసుకుని పరిష్కారాలకు హామీ.. ● మౌలిక వసతుల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆదేశం.. ● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**చండూరు జూలై 30 (జనంసాక్షి)** చండూరు మున్సిపాలిటీతో పాటు మునుగోడు నియోజకవర్గాన్ని రాబోయే 25 ఏళ్ల జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. చండూరు మండలం పుల్లెంల గ్రామంలో మార్నింగ్ వాక్ నిర్వహించి వీధుల్లో పర్యటించిన ఎమ్మెల్యే ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. రహదారి వెడల్పు పనులను పరిశీలించి, వాటి వల్ల ప్రభావితమయ్యే ఇళ్ల వివరాలను అడిగి తెలుసు కున్నారు. గ్రామానికి అనుసంధాన రహదారులు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పుల్లెంలలోని నిరుపేదల గుడిసెలను సందర్శించి వారి జీవన పరిస్థితులను తెలుసుకున్న ఎమ్మెల్యే, సాంకేతిక కారణాలతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాని నిజమైన అర్హులను గుర్తించి జాబితా రూపొందిం చాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ, ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రం, గ్రామపంచాయతీ, కమ్యూనిటీ హాల్ భవనాలను పరిశీలించి, పనులు పూర్తి చేసేందుకు అవసరమైన అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. పుల్లెంల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే, విద్యార్థులకు అనుకూలంగా విశాలమైన ప్రాంగణంతో నూతన పాఠశాల భవనం నిర్మించేందుకు స్థలాన్ని గుర్తించాలని సూచించారు. గ్రామంలో ఉన్న దేవాదాయ శాఖ భూమిని ప్రజా ప్రయోజనాలకు కేటాయించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం చండూరు మున్సిపాలిటీలోని జంగాల కాలనీలో పర్యటించి కాలనీవాసులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా 10 భూస్థాయి నీటి ట్యాంకులు నిర్మించడంతో పాటు నిరుపయోగంగా ఉన్న మరో 10 ట్యాంకులను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి పాత భవనం స్థానంలో నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా యునాని వైద్యంపై అవగాహన కల్పించాలని సూచిస్తూ ఎమ్మెల్యే స్వయంగా యునాని మందులు తీసుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే, ప్రస్తుతం నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఒక ఎకరం స్థలంలో ఆధునిక సౌకర్యాలతో నూతన మున్సిపల్ కార్యాలయాన్ని నిర్మించాలని సూచించారు. పట్టణంలోని అంతర్గత రహదారులు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని, అవసరమైన నిధులు తీసుకువచ్చే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ప్రతి వార్డులో నిరుపేదలను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ బూతరాజు దశరథ, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ మల్లేశం, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల రక్షణలో

# రైతుల భాగస్వామ్యం కీలకం

- జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు
- లిఫ్టుల రక్షణ రైతు బాధ్యత -దొంగతనాలకు చెక్ పెడదాం
- హాజరైన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి





**హుజూర్‌నగర్, జూలై 30 (జనం సాక్షి):** వ్యవసాయానికి కీలకమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల భద్రత కోసం రైతులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ పిలుపునిచ్చారు. హుజూర్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల రైతులు, ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ శాఖ అధి. కారులతో గురువారం అవగాహన సదస్సు నిర్వ హించారు. లిఫ్ట్ ఇరిగేషన్ కేంద్రాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, వైర్లు, ఆయిల్ దొంగతనాలు చివరకు రైతులకే నష్టమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి లిఫ్ట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు రైతు కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

**లిఫ్టులను సొంత ఆస్తిగా భావించాలి**

**ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి**

ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి కోసం ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్లను రైతులు తమ సొంత ఆస్తిగా భావించి రక్షించుకోవాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి కోరారు. లిఫ్టులలో దొంగతనాలు జరిగితే సాగునీరు అందక రైతులే నష్టపోతారని అన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించాలని రైతులకు సూచించారు. పోలీసు శాఖ తరపున లిఫ్ట్ కేంద్రాల వద్ద పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేస్తామని ఎస్పీ నరసింహ తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను రైతులు తమ సొంత ఆస్తిగా భావించి రక్షించుకోవాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధి కారులు, ప్రజాప్రతినిధులు, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వ్యవసాయ రంగానికి నిరంతర నీరందించేందుకు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అనుక్షణం కృషి చేస్తున్నారని తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం, దొంగతనాల నివారణే ధ్యేయంగా ఇన్ని శాఖలను ఒకే వేదికపైకి తెచ్చి భారీ అవగాహన సదస్సు నిర్వహించిన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని, ఎస్పీ నరసింహను ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి సూర్యనారాయణ, ఇరిగేషన్ సిఇ నాగభూషణం, విద్యుత్ డిఇ రామ్మోహన్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత ఇరిగేషన్, వ్యవసాయ శాఖల అధికారులు, హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, రెండు నియోజకవర్గాల పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




**అన్నపురెడ్డిపల్లి, జూలై 30 (జనం సాక్షి)** ప్రజలకు కీలకమైన రెవెన్యూ సేవలు అందించే ప్రభుత్వ కార్యాలయమే శిథిలావస్థకు చేరుకోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అన్నపురెడ్డిపల్లి మండల తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయం ఎన్నో ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతుండగా, ప్రస్తుతం ఆ భవనం దయనీయ స్థితికి చేరుకుంది. వర్షం పడిన ప్రతిసారి పైకప్పు నుంచి నీరు కారుతూ గదుల్లోకి చేరుతుండటంతో ఉద్యోగులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయ గోడలపై తేమ, పగుళ్లు, రంగు ఊడిపోవడం, పైకప్పు లీకేజీలు, నేలలు దెబ్బతినడం వంటి సమస్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వరండాలో సిమెంట్ ఊడిపోవడంతో పెద్ద గుంతలు ఏర్పడి కార్యాలయానికి వచ్చే ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లో నడవాల్సి వస్తోంది. వర్షపు నీరు గదుల్లో నిలిచిపోవడంతో కార్యాలయ వాతావరణం మరింత అధ్వానంగా మారింది. ప్రతిరోజూ భూ సమస్యలు, ధరణి సేవలు, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, ఇతర రెవెన్యూ సేవల కోసం మండలంలోని వివిధ గ్రామాల నుంచి వందలాది మంది ప్రజలు కార్యాలయానికి వస్తుంటారు. అయితే కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఉద్యోగులు కూడా భయాందోళనల మధ్య విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. అన్నపురెడ్డిపల్లి మండలానికి శాశ్వత తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మించాలని ప్రజలు పలుమార్లు ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ కార్యాలయం ఇంత దయనీయ స్థితిలో ఉండటం బాధాకరమని పేర్కొంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రస్తుత భవనానికి తక్షణ మరమ్మతులు చేపట్టడంతో పాటు, అన్ని వసతులతో కూడిన శాశ్వత ఎమ్మార్వో కార్యాలయ భవనాన్ని నిర్మించాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## సీతమ్మ సాగర్‌కు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

### రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే పాయం కృతజ్ఞతలు



**అశ్వాపురం జులై 30 (జనంసాక్షి):** సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల అంశంలో సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇవ్వడం తెలంగాణ రైతాంగానికి శు భపరిణామమని పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా పినపాక నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు శాశ్వత సాగునీటి భద్రత లభిస్తుందని, రాష్ట్రంలోని పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.




## మైక్రోసాఫ్ట్ నుంచి సరికొత్త ఏఐ సూపర్ యాప్: సత్యనాదెళ్ల



**న్యూఢిల్లీ:**ఓపెన్ఏఐ, ఆంథ్రోపిక్‌కు పోటీగా మైక్రోసాఫ్ట్ కూడా సరికొత్త ఏఐ సూపర్ యాప్‌ను తీసుకురానుంది. ఈ విషయాన్ని కంపెనీ త్రైమాసిక ఫలితాల విడుదల వేళ సీఈవో సత్య నాదెళ్ల వెల్లడిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోపైలట్ చాలా వేగంగా చాట్‌బాట్ స్థాయిని దాటి సరికొత్త సూపర్ యాప్ రూపును సంతరించుకొంటోందని పేర్కొన్నారు. ఇది కీలక ముందడుగు అని అభివర్ణించారు. భవిష్యత్తులో దీనికి సంబంధించి మరిన్ని వివరాలు పంచుకొంటామని తెలిపారు. సాధారణ ఏఐ యాప్స్‌తో చేసే వాటి కంటే తమ సూపర్ యాప్‌తో చాలా పనులు సులువుగా చేయవచ్చని వివరించారు. ఈ ఏడాది మైక్రోసాఫ్ట్ వార్షిక ఆదాయం 331 బిలియన్ డాలర్లను దాటిందని సత్య నాదెళ్ల పేర్కొన్నారు. క్లౌడ్ వ్యాపారం 214 బిలియన్ డాలర్లుగా ఉందన్నారు. ఓ రకంగా తమ కంపెనీ ఆదాయం 2025లో ఈజిప్ట్ జీడీపీకి దగ్గర్లో ఉందని వ్యాఖ్యానించారు. జూన్ 30 నాటికి ముగిసిన త్రైమాసికానికి నికర ఆదాయం 35.8 బిలియన్ డాలర్లకు పెరిగిందని చెప్పారు. మరోవైపు దక్షిణ కొరియా టెక్ దిగ్గజం శామ్‌సంగ్ కూడా ఈ సారి కంపెనీ చరిత్రలో ఎన్నడూ ప్రకటించనంత లాభాన్ని వెల్లడించింది. మొత్తం 62 బిలియన్ డాలర్ల నిర్వహణ లాభం వచ్చినట్లు వెల్లడించింది. దీంతో దక్షిణ కొరియా మార్కెట్ సూచీ కోస్పి గురువారం కొంచెం పుంజుకొని దాదాపు 4%కి పైగా లాభాలను నమోదు చేసింది.

# లాభాల్లో ముగిసిన సూచీలు



**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా స్టాక్స్‌లో కొనుగోళ్లు కలిసొచ్చాయి. అమెరికా వడ్డీరేట్లు యథాతథంగా కొనసాగుతాయని పేర్కొన్నప్పటికీ.. భవిష్యత్‌లో రేట్ల పెంపు ఉంటుందన్న సంకేతాలతో మదుపర్లు అప్రమత్తత పాటించడం కనిపించింది. ఈ క్రమంలోనే వరుసగా రెండో రోజూ సూచీలు లాభపడ్డాయి. సెన్సెక్స్ 273.55 పాయింట్లు లాభంతో 77,928.15 వద్ద ముగిసింది. నిఫ్టీ 66.95 పాయింట్లు పెరిగి 24,317.15 వద్ద స్థిరపడింది. రూపాయితో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.67 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో మారుతీ, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, పవర్‌గ్రిడ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఆదానీ పోర్ట్స్, ఇండిగో, బజాజ్ బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, బీఈఎల్, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్ నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 91.09 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు ధర 4,068.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## స్విగ్గీ నష్టం రూ.791 కోట్లు..

### ఆదాయంలో మెరుగైన వృద్ధి

ముంబయి: ప్రముఖ ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ సంస్థ స్విగ్గీ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గానూ రూ.791 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1197 కోట్ల నష్టాన్ని కంపెనీ ప్రకటించింది. అప్పటితో పోలిస్తే నష్టం కాస్త తగ్గుముఖం పట్టింది. సమీక్షా త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 37 శాతం వృద్ధితో రూ.6,182 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.4,961 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.7023 కోట్లుగా ఉంది. మొత్తం ఖర్చులు 25 శాతం పెరిగి రూ.7813 కోట్లకు చేరినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. స్విగ్గీకి ఫుడ్ డెలివరీ వ్యాపారం లాభాలను తెచ్చిపెడుతోంది. ఈ విభాగంలో 48 శాతం వృద్ధితో రూ.299 కోట్ల నికర లాభాన్ని నమోదుచేసింది. ఆదాయం 23 శాతం వృద్ధితో రూ.2,208 కోట్లుగా ఉంది. ఇన్ స్టామార్ట్ రూ.651 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. ఆదా యం మాత్రం 53 శాతం వృద్ధితో రూ.1232 కోట్లకు పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో ఇన్‌స్టామార్ట్ డార్క్ స్టోర్ల సంఖ్య మరో 28 పెరిగాయి. మొత్తం స్టోర్ల సంఖ్య 1,171కు చేరింది.




## ఆంధ్రప్రదేశ్‌లో మోటార్‌సైకిల్ ప్లాంటుకు రూ.1,225 కోట్లు

### ఐషర్ మోటార్స్ బోర్డు ఆమోదం

**న్యూఢిల్లీ:**రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిళ్ల తయారీ సంస్థ ఐషర్ మోటార్స్, ఆంధ్రప్రదేశ్‌లోని తడలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ప్లాంటు కోసం తొలిదశలో రూ.1,225 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఇందుకు బోర్డు ఆమోదం తెలిపినట్లు జూన్ త్రైమాసిక ఫలితాల వెల్లడి సందర్భంగా సంస్థ ప్రకటించింది. మోటార్‌సైకిళ్ల ఉత్పత్తి పెంచేందుకు దశలవారీగా మొత్తం రూ.2,500 కోట్లు వెచ్చించాలన్నది సంస్థ ప్రణాళిక. ఈ ప్లాంటు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తే ఏడాదికి అదనంగా 4.5 లక్షల మోటార్‌సైకిళ్లు తయారు చేయొచ్చు. 2029-30 కల్లా ఈ ప్లాంటు పూర్తవుతుందని సంస్థ పేర్కొంది. 21% పెరిగిన లాభం: ఐషర్ మోటార్స్, జూన్ త్రైమాసికంలో రూ.1,462.51 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని ఆర్జించింది. 2025-26 ఇదే త్రైమాసిక లాభం రూ.1,205.22 కోట్ల కంటే ఇది 21.4% ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.5,041.84 కోట్ల నుంచి రూ.6,632.42 కోట్లకు పెరిగింది. వ్యయాలు కూడా రూ.4,052.02 కోట్ల నుంచి రూ.5,341 కోట్లకు చేరాయి. కంపెనీ ద్విచక్ర వాహన విభాగమైన రాయల్ ఎన్‌ఫీల్డ్ సమీక్షా త్రైమాసికంలో రికార్డు స్థాయిలో 3,32,940 వాహనాలు విక్రయించింది. 2025-26 ఇదే త్రైమాసికంలో అమ్మిన 2,61,326 బైక్‌ల కంటే ఇవి 27% అధికం.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,54,236 | ₹ 1,67,180 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,40,000

# రూ.2 లక్షల కోట్ల దివీస్

### 2020లో రూ.లక్ష కోట్ల మార్కెట్ విలువ • ఆరేళ్లలోనే రెట్టింపు




హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఔషధ సంస్థ దివీస్ లేబొరేటరీస్, మార్కెట్ విలువ పరంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశంలో సన్ ఫార్మా తర్వాత రూ.2 లక్షల కోట్ల మార్కెట్ విలువ మైలురాయిని అధిగమించిన రెండో కంపెనీగా నిలిచింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి, ఈ ఘనత సాధించిన ఔషధ సంస్థ దివీస్ మాత్రమే. 2010లో రూ.8,000 కోట్లుగా ఉన్న దివీస్ మార్కెట్ విలువ, 2020లో రూ.లక్ష కోట్లకు చేరింది. ఆ తర్వాత తన సామర్థ్యాన్ని పెంచుకుంటూ.. ఆరేళ్లలోనే రూ.2.07 లక్షల కోట్ల స్థాయికి చేరింది. బుధవారం (జులై 29) మదుపరుల కొనుగోళ్ల జోరుతో దివీస్ ల్యాబ్స్ షేరు ఎన్ఎస్ఈలో రూ.7,818.50 గరిష్ఠానికి చేరింది. మార్కెట్ ముగిసే సమయానికి రూ.7814.50 వద్ద స్థిరపడింది. ఒక్క రోజే ఈ షేరు 5.25% పెరిగింది. ఈనెల 1న షేరు విలువ రూ.6,542 కాగా, ఇప్పటికే రూ.1,276 పెరిగింది. అంతర్జాతీయ ఫార్మా కంపెనీలకు అవసరమైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ) సరఫరాలో దివీస్ తొలి స్థానంలో ఉంది. నొప్పుల నివారణ, దగ్గు మందు తదితర కీలక ఔషధాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది. అప్పుల్లేని కంపెనీగా దివీస్ కొనసాగుతోంది. కాకినాడ ప్రాజెక్టు సహా దాదాపు రూ.2,500 కోట్ల మూలధన వ్యయం ప్రణాళికలను సొంత నిధులతోనే చేపడుతుండటం మదుపరుల్లో నమ్మకాన్ని పెంచింది. జీడిమెట్ల, చౌటుప్పల్, విశాఖ తయారీ కేంద్రాల ఉత్పత్తుల్లో 85-90% అమెరికా, ఐరోపా దేశాలకే ఎగుమతి అవుతున్నాయి. డాక్టర్ మురళి దివీ సారథ్యంలోని ఈ కంపెనీ హైదరాబాద్‌ను ఫార్మా హబ్‌గా మార్చడంలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తోంది.

## బ్రిటన్ పోర్టుల్లోకి అదానీ గ్రూప్!

**న్యూఢిల్లీ:**అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ బ్రిటన్‌లోని అతిపెద్ద పోర్టు నిర్వహణ సంస్థ అసోసియేటెడ్ బ్రిటిష్ పోర్ట్స్ (ఏబీపీ)ని స్వాధీనం చేసుకునేందుకు బిడ్ వేయాలని పరిశీలిస్తున్నారని సమాచారం. ఇది కార్యరూపం దాల్చితే యునైటెడ్ కింగ్‌డమ్‌లో అదానీ గ్రూప్ చేసే తొలి పెట్టుబడి అవుతుంది. ప్రస్తుతం ఏబీపీ లో వాటాలు కలిగి ఉన్న రెండు కెనడియన్ పెన్షన్ ఫండ్లు తమ వాటాలు విక్రయించేందుకు సిద్ధమవుతుండగా.. వీటిని కొనుగోలు చేసే అంశాన్ని అదానీ పరిశీలిస్తున్నట్లు ఈ వ్యవహారంపై అవగాహన ఉన్న ముగ్గురు వ్యక్తులు తెలిపారని ఆంగ్లపత్రికలు పేర్కొన్నాయి. ఏబీపీలో కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డుకు 30%, ఆంటారియో మునిసిపల్ ఎంప్లాయీస్ రిటైర్మెంట్ సిస్టమ్‌కు 33.88% వాటాలున్నాయి. మరో 6% వాటా కలిగిన హెర్మెస్ అసెట్ మేనేజ్‌మెంట్ కూడా తన వాటా విక్రయించే అవకాశముంది. ఈ ఒప్పందం ముందుకు సాగినా ఈ ఏడాదిలో పూర్తయ్యే అవకాశాలు తక్కువే. బ్రిటన్ సముద్ర వాణిజ్యంలో కీలక సంస్థ: బ్రిటన్ సముద్ర మార్గం ద్వారా జరిగే మొత్తం వాణిజ్యంలో ఏబీపీ వాటా దాదాపు 25%. దేశవ్యాప్తంగా 21 పోర్టులను నిర్వహిస్తోంది. సంస్థలో సింగపూర్ ప్రభుత్వ సంపద నిధికి 20%, కువైట్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీకి చెందిన రెన్ హౌస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు 10% వాటాలున్నాయి.

# వన్నె తగ్గిన పసిడి..

### 6 శాతం పడిపోయిన డిమాండ్



**న్యూఢిల్లీ:** బంగారం కొనుగోళ్లకు దూరం ఉండాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు, పెరిగిన ధరలు ఈసారి బంగారం గిరాకీపై ప్రభావం చూపించాయి. ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో భారత్‌లో పసిడికి డిమాండ్ 6శాతం పడిపోయి 131.4 టన్నులుగా ఉందని ప్రపంచ స్వర్ణ మండలి వెల్లడించింది. అయితే, ధరలు ఆకాశాన్ని తాకడంతో విలువ పరంగా చూసుకుంటే గిరాకీ 50శాతం పెరిగి రూ.1,98,100 కోట్లకు చేరిందని తెలిపింది. 2026లో భారత్‌లో పుత్తడి డిమాండ్ 650 నుంచి 750 టన్నుల మధ్య ఉంటుందని డబ్ల్యూసీజీ అంచనా వేసింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. ఈ క్రమంలోనే విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకునేందుకు బంగారం కొనుగోళ్లను ఆపేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. దీనితో పాటు బంగారం దిగుమతులపై సుంకాలను విధించారు (ఎనిటతిజీ ఐనీశ్రీట టవఎజీనిట). ఈ క్రమంలోనే పసిడికి గిరాకీ తగ్గింది. జూన్ త్రైమాసికంలో ఆభరణాల డిమాండ్ 15 శాతం తగ్గి 75.1 టన్నులకు చేరింది. సుంకాల పెంపు, ప్రధాని పిలుపు మేరకు బంగారానికి డిమాండ్ తగ్గినప్పటికీ.. ఇది గ్రే మార్కెట్ నిర్వహణను, స్మగ్లింగ్‌ను ప్రోత్సహించే అవకాశం ఉందని డబ్ల్యూసీజీ రీజినల్ సీఈఓ సచిన్ జైన్ అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాలను సునిశితంగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. మరోవైపు, సమీక్షించిన త్రైమాసికంలో బంగారంలో పెట్టుబడులు పెరిగాయి. బార్, కాయిన్ డిమాండ్ 9 శాతం వృద్ధి నమోదు చేసి 50.3 టన్నులకు చేరింది. భారత గోల్డ్ ఈటీఎఫ్‌లు 4.2 టన్నులకు చేరాయి. మొత్తం బంగారం రీసైక్లింగ్ జూన్ త్రైమాసికంలో 17 శాతం తగ్గి 19.2 టన్నులుగా ఉంది. రెండో త్రైమాసికంలో నికర బంగారం దిగుమతులు 23 శాతం తగ్గి 98.1 టన్నులకు పడిపోయాయి.

### రూ.30 లక్షల కోట్లకు పసిడి తనఖా రుణాలు!

దేశంలో బంగారు ఆభరణాల తనఖాపై రుణాలు తీసుకోవడం అంతకంతకూ పెరుగుతోంది. 2028 మార్చి నాటికి ఈ వ్యాపారం రూ.30 లక్షల కోట్లకు చేరుతుందని దేశీయ రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా వేస్తోంది. 2026 మార్చి ఆఖరుకు ఈ వ్యాపారం రూ.18 లక్షల కోట్ల స్థాయికి చేరిందని సంస్థ పేర్కొంది. ఈ వ్యాపారంలో బ్యాంకులతో పోలిస్తే, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలే ముందుంటున్నాయని వివరించింది. రాబోయే రెండేళ్లలో పసిడి రుణ ఆస్తుల్లో 35% వృద్ధిని ఎన్‌బీఎఫ్‌సీలు కనబరుస్తాయనే అంచనాను వ్యక్తం చేసింది. 2025-26 చివరకు తమ మొత్తం రుణాల్లో పసిడి రుణాల వాటా 22% కాగా, 2027-28 చివరకు ఇది 23 శాతానికి పెరుగుతుందని వివరించింది. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో ఎన్‌బీఎఫ్‌సీల పసిడి రుణ వ్యాపారం 35% వార్షిక వృద్ధితో సాగొచ్చని, ఇదే సమయంలో బ్యాంకుల వ్యాపార వృద్ధి 30 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో పసిడి తనఖా రుణ వ్యాపారం 38% వార్షిక వృద్ధిని సాధించిందని నివేదిక తెలిపింది. కొత్త సంస్థల ప్రవేశంతో: పసిడి ధరల నేపథ్యం లో, ఈ వ్యాపారంలో నష్టాలు తక్కువని నివేదిక పేర్కొం ది. పెద్ద ఎన్‌బీఎఫ్‌సీలైన టాటా క్యాపిటల్, గోద్రేజ్ క్యాపిటల్ సంస్థలు కూడా ఈ వ్యాపారంలో ఉన్న సంస్థలను కొనుగోలు చేయడం ద్వారా పసిడి తనఖా రుణాల వ్యాపారంలోకి ప్రవేశించడం, కొత్తగా శాఖలను విస్తరించనుండటం వల్ల వ్యాపారం భారీగా పెరిగేందుకు కారణమవుతాయని విశ్లేషించింది.



## బీమా రంగంలోకి పతంజలి..

### 'మాగ్మా'లో వాటా కొనుగోలు

**ఢిల్లీ:** బాబా రామ్‌దేవ్‌కు చెందిన ప్రముఖ ఎఫ్ఎంసీజీ బ్రాండ్ పతంజలి త్వరలో బీమా రంగంలోకీ అడుగు పెట్టబోతోంది. ప్రస్తుతం ఎఫ్ఎంసీజీ, ఆయుర్వేద ఉత్పత్తులను విక్రయిస్తున్న ఈ కంపెనీ.. జనరల్ ఇన్సూరెన్స్ విభాగంలోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో మెజారిటీ వాటా కొనుగోలుకు బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ ఆమోదం తెలిపింది. మరో ఎఫ్ఎంసీజీ కంపెనీ డీఎస్‌గ్రూప్‌తో కలిసి పతంజలి ఈ కొనుగోలు చేపట్టింది. ఈ డీల్ ప్రకారం.. పతంజలి ఆయుర్వేదకు మాగ్మా ఇన్సూరెన్స్‌లో 73.56 శాతం వాటా దఖలుపడనుంది. డీఎస్ గ్రూప్‌నకు 24.5 శాతం వాటా దక్కనుంది. అదర్ పూనావాలా గ్రూప్‌నకు చెందిన సనోటి ప్రాపర్టీస్ ఎల్ఎల్‌పీ నుంచి రెండు కంపెనీలు కలిపి 98 శాతం వాటా కొనుగోలు చేయనున్నాయి. మూడు నెలల్లో ఈ లావాదేవీ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం మాగ్మా ఇన్సూరెన్స్ కంపెనీ మోటార్, హెల్త్, ప్రాపర్టీ, కమర్షియల్ ఇన్సూరెన్స్ ఉత్పత్తులను విక్రయిస్తోంది. ఆయుర్వేద ఉత్పత్తుల విక్రయంతో విపణిలోకి ఎంట్రీ ఇచ్చిన పతంజలి.. కొత్త కొత్త ఉత్పత్తులను చేర్చుకుంటూ వచ్చింది. పర్సనల్ కేర్, ప్యాకేజ్డ్ ఫుడ్స్, ఇతర వినియోగ వస్తువుల ఉత్పత్తులకు విస్తరించింది. ఈ కొనుగోలు ద్వారా పతంజలి సంస్థ ఫైనాన్స్ విభాగంలోకి అడుగుపెట్టనుంది. బీమా వ్యాపారం కోసం పతంజలి తన రిటైల్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను వినియోగించుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## హమ్మయ్య.. కార్చిచ్చు చల్లారుతోంది!..

### ఇంటి బాట పట్టిన 84 వేల మంది

**న్యూఢిల్లీ:**ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో చెలరేగిన కార్చిచ్చు క్రమంగా అదుపులోకి వస్తోంది. వారం రోజులుగా ఆ రెండు దేశాల ప్రభుత్వాలకు కంటిమీద కునుకులేకుండా చేసిన అగ్నికీలలు చల్లారుతున్నాయి. కార్చిచ్చు ముప్పుతో వారం రోజుల వ్యవధిలో 2 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించిన ఫ్రాన్స్.. ఇప్పుడు 84 వేల మంది తిరిగి ఇళ్లకు వెళ్లేందుకు తాజాగా అనుమతిచ్చింది. గత శుక్రవారం ప్రారంభమైన ఈ కార్చిచ్చు కారణంగా దాదాపు 42వేల హెక్టార్ల మేర అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైంది. అంటే.. ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగర విస్తీర్ణం కంటే నాలుగు రెట్లు ఎక్కువ. ప్రస్తుతం అక్కడ వాతావరణం అనుకూలించడంతో.. మంటలు ఆర్పేందుకు అవకాశం ఏర్పడింది. గాలిలో తేమశాతం పెరగడం, చల్లని వాతావరణం, కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కారణంగా త్వరలోనే మంటలు పూర్తిగా అదుపులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. గత రాత్రి మంటలు విస్తరించలేదని ఫ్రాన్స్ ప్రభుత్వం వెల్లడించింది. అయినప్పటికీ, అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపింది. 2,200 మంది అగ్నిమాపక అధికారులు, 20 ఎయిర్‌క్రాఫ్ట్‌లు విధుల్లో కొనసాగుతున్నట్లు పేర్కొంది. కార్చిచ్చు ఏర్పడిన బోర్డో ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున వర్షం కురిసింది. వాతావరణం అనుకూలించి మంటలు పూర్తిగా అదుపులోకి వస్తే.. వివిధ చోట్ల ఆశ్రయం పొందుతున్న వారు తిరిగి సొంత ఇళ్లకు చేరుకునేందుకు అనుతించనున్నట్లు అధికారులు తెలిపారు.



# చదివేదొకటి..చూసేదొకటి..

- చూసే వీడియోలకు చదువుకూ పొంతన ఉండటం లేదు
- ఐఎస్‌బీ పరిశోధనలో వెల్లడి



**హైదరాబాద్:** పిల్లలు యూట్యూబ్‌లో అధికంగా చూసే వీడియోల ఆదరణకూ, వారి విద్యాభ్యాసానికీ ఎలాంటి సంబంధం లేదని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) అధ్యయనంలో తేలింది. వీడియోలకు ఎక్కువ వీక్షణలు ఉన్నంత మాత్రాన వాటిలో విద్యావిలువలు ఉన్నట్లు కాదని, పిల్లలు చూస్తున్న కంటెంట్‌కీ.. వారు పొందుతున్న జ్ఞానానికీ పొంతన లేదని వెల్లడించింది. 'క్వాంటిఫైయింగ్ ది అకడమిక్ క్వాలిటీ ఆఫ్ చిల్డ్రన్స్ వీడియోస్ యూజింగ్ మెషీన్ కాంప్రెహెన్షన్' పేరిట ఈ పరిశోధన సాగింది. ఐఎస్‌బీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుమీత్ కుమార్, రోచెస్టర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన మల్లికార్జున తుపాకుల, ఆషికుర్ ఆర్.ఖుదాబక్ష్ ఈ అధ్యయాన్ని రూపొందించారు. పిల్లల కోసం నడుస్తున్న 134 యూట్యూబ్ ఛానెళ్లలోని దాదాపు 49,000 వీడియోలను పరిశోధక బృందం విశ్లేషించింది. 1 నుంచి 12వ తరగతి పాఠ్యపుస్తకాల్లోని 21,000 ప్రశ్నలు, విద్యా ప్రణాళిక ఆధారిత 6,300 కంటే ఎక్కువ ప్రశ్న-జవాబుల వివరాలను ప్రామాణికంగా తీసుకుని ఈ విశ్లేషణ నిర్వహించారు. ఎక్కువ వీక్షణలు సాధిస్తున్న వీడియోలన్నీ పాఠ్యాంశ విలువలను అందించడం లేదని, డిజిటల్ వేదికలు కంటెంట్‌ను చూపించే విధానంలో లోపాలున్నాయని అధ్యయనంలో తేలింది. విద్యాప్రణాళిక అధారంగా వీడియోల నాణ్యతను మూల్యాంకనం చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత నమూనాను అభివృద్ధి చేశారు. వీడియోలో మాట్లాడే సంభాషణలు, దృశ్యాలను ఒకేసారి విశ్లేషించడం ద్వారా, పాఠ్యపుస్తకాల ప్రశ్నలకు ఆ వీడియో సరైన సమాధానం ఇస్తుందో లేదో ఈ సాంకేతికత అంచనా వేస్తుంది. ఈ నమూనా 77.5% కచ్చిత ఫలితాలు సాధించిందని, డిజిటల్ సమాచార నాణ్యతను తనిఖీ చేసే సాధనంగా ఉపయోగపడుతోందని పరిశోధన వెల్లడించింది.

ప్రాథమిక భాషా నైపుణ్యాలు, కొన్ని అంశాలకు సంబంధించిన వీడియోలు అందుబాటులో ఉన్నా, శాస్త్రీయ ఆలోచనలు, సంక్లిష్ట భావనలకు సంబంధించిన వీడియోల లభ్యత తక్కువగా ఉందని అధ్యయనం గుర్తించింది. పై తరగతుల విద్యార్థుల విద్యా అవసరాలకు తగినట్లుగా డిజిటల్ కంటెంట్ రూపాంతరం చెందాలని సూచించింది. ఇంటర్నెట్‌లో సమాచారం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో.. కేవలం వినోదాన్ని ఇచ్చే, నిజమైన చదువును అందించే వీడియోలకు మధ్య వ్యత్యాసం గుర్తించడం తల్లిదండ్రులకు సవాలుగా మారిందని సుమీత్ కుమార్ తెలిపారు. పాఠ్యపుస్తకాల విద్యా ప్రణాళికలతో కంటెంట్‌ను అనుసంధానించడం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, డిజిటల్ వేదికలు విద్యా విలువలున్న వీడియోలకు ప్రాధాన్యం ఇవ్వొచ్చని నివేదిక తెలిపింది. యూట్యూబ్ వంటి వేదికలు కేవలం వీక్షణల సంఖ్య ఆధారంగా కాకుండా, విద్యా విలువల ప్రాతిపదికన తమ సిఫార్సు వ్యవస్థలను మెరుగుపరచుకోవాలని వివరించింది.

## అమెరికా దాడులతో దద్దరిల్లుతున్న ఇరాన్

దక్షిణ ఇరాన్ లో శక్తిమంతమైన పేలుళ్లు వినిపించాయి. ఖేష్మ్ ద్వీపాన్ని, అణువిద్యుత్ కేంద్రం ఉన్న తీరనగరం బుషెహర్‌ను అమెరికా సైన్యం టార్గెట్ చేసింది. ఖేష్మ్ ద్వీపంలో నివాస ప్రాంతాలపై క్షిపణి దాడి జరిగిందని ఇరాన్ స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. జోర్డాన్‌లోని ఎయిర్‌బేస్, కమాండ్ సెంటర్‌ను టార్గెట్ చేశామని ఐఆర్‌జీసీ వెల్లడించింది. అమెరికా బెదిరింపులు కొనసాగినంత కాలం.. ఇరాన్ వైపు నుంచి ప్రతిఘటన ఉంటుందని హెచ్చరించింది. అయితే ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను తాము అడ్డుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. తాము డజన్ల కొద్దీ ఇరాన్ లక్ష్యాలపై దాడులు చేసినట్లు పేర్కొంది. ఇంతకాలం ఇరాన్, గల్ఫ్ దేశాలకే పరిమితమైన యుద్ధం బుధవారం మరో టర్న్ తీసుకుంది. ఈజిప్ట్‌లోని డమియెట్టా పోర్ట్‌లోని అమెరికాకు చెందిన గ్యాస్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి జరిగింది ఎల్ఎన్‌జీ లోడింగ్, ఇతర ప్రక్రియలు జరుగుతోన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో భారీగా మంటలు ఎగిసిపడి, వేగంగా మరో ట్యాంకర్‌కు విస్తరించాయి. దాంతో అత్యవసర సహాయక బృందాలు నావికులను అక్కడి నుంచి తరలించాయి. ఇంధన నిల్వలున్న మరో దేశానికి ఘర్షణలు విస్తరించడంతో యుద్ధం తీవ్ర రూపం దాల్చనుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఫిబ్రవరి 28 పశ్చిమాసియాలో మొదలైన యుద్ధం ప్రపంచ దేశాలను ఇంధన సంక్షోభంలోకి నెట్టేసింది. ఈ యుద్ధం ముగింపు కోసం చేస్తోన్న ప్రయత్నాలతో ఘర్షణలు తాత్కాలికంగా మాత్రమే ఆగుతున్నాయి. అవగాహన ఒప్పందాన్ని పక్కనపెట్టి.. ఇటీవల 10 రోజులకుపైగా రెండు దేశాలు భారీగా చేసుకున్న దాడులకు కాస్త విరామం వచ్చినా.. మళ్లీ మొదలు కావడంతో దౌత్య చర్చలపై ఆశలు అడుగంటిపోతున్నాయి.

# వర్షాల వేళ అప్రమత్తంగా ఉండాలి

- శిథిల భవనాలు, లోతట్టు ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ
- అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి: కలెక్టర్
- ఆస్తి, ప్రాణ, పంట నష్టం వెంటనే నివేదించాలి
- సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు
- అత్యవసర సేవల కోసం జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూలై 30 (జనంసాక్షి):** జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వర్షాల కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.
అధికారులు తమ పరిధిలోని శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లు, లో లెవెల్ కల్వర్టులు, వంతెనలు, రహదారులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలు సంచరించకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. వర్షాల కారణంగా ఎక్కడైనా ఆస్తి, ప్రాణ, పంట నష్టం సంభవిస్తే వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. చెరువులు, కుంటలు, కాలువలు, జలాశయాల్లో నీటి ప్రవాహం, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, నీటి పారుదల, పోలీసు, విద్యుత్, ఆర్ అండ్ బీ, వ్యవసాయ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున దోమల నివారణ చర్యలు చేపట్టాలని, ప్రతి వర్షం అనంతరం డ్రై డే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. వర్షపు నీటిని వృథా కాకుండా సంరక్షించేందుకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, భూగర్భ జలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 93986 84240 నంబర్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గద్దం నగేష్, జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి వెంకట మాధవరావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# కరీంనగర్‌లో నూతన సిటీ బస్ సర్వీసులకు శ్రీకారం

- మూడు రూట్లలో మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల ప్రారంభం
- సిటీ బస్సుల్లో ప్రయాణించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రజలు ఆదరిస్తే మరిన్ని రూట్లు, అదనపు బస్సులు: మంత్రి

**కరీంనగర్ బ్యూరో, జూలై 30 (జనంసాక్షి):** కరీంనగర్ నగర ప్రజలకు మెరుగైన ప్రజారవాణా సేవలు అందించేందుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బస్‌స్టేషన్‌లో నూతన సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే సిటీ బస్సులో కరీంనగర్ నుంచి వాగేశ్వరి కళాశాల వరకు ప్రయాణించారు.
మొదటి దశలో కరీంనగర్-వాగేశ్వరి కళాశాల, కరీంనగర్-చింతకుంట, కరీంనగర్-కొత్తపల్లి హవేలీ మార్గాల్లో సిటీ బస్సులు నడుపనున్నట్లు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్‌లో చాలాకాలంగా ఉన్న సిటీ బస్సుల డిమాండ్‌ను నెరవేర్చామని చెప్పారు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులకు ఈ సేవలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వాగేశ్వరి విద్యాసంస్థలు, చింతకుంట, ఒద్దారం, కొత్తపల్లి ప్రాంతాలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. మెడికల్ కళాశాలలు ఉన్న ప్రతిమ, చల్మెడ, మానకొండూరు ప్రాంతాలకు కూడా త్వరలో బస్సులు నడపనున్నట్లు చెప్పారు. ప్రయాణికుల ఆదరణను బట్టి అదనపు బస్సులు, కొత్త రూట్లు, అవసరమైతే 24 గంటల సర్వీసులు కూడా ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రూట్లలో బస్సులు నడుపుతున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. కొత్త బస్సులు కొనుగోలు, సిబ్బంది నియామకాలు చేపట్టడంతో పాటు పెండింగ్ బకాయిలను కూడా చెల్లించినట్లు చెప్పారు. ప్రతి గ్రామానికి బస్సు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రస్తుతం ఆర్టీసీ రోజుకు సుమారు 35 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మేయర్ కోలాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ కుమార్‌దేశాయ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి

- సిరిసిల్లలో రూ.3.22 కోట్లతో రగుడు జంక్షన్ అభివృద్ధి పనుల ప్రారంభం
- వస్త్ర కార్మికులకు ఆర్డీ పాస్‌బుక్‌ల పంపిణీ
- చేనేత రంగానికి రూ.1360 కోట్లకు పైగా సాయం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**రాజన్న సిరిసిల్ల, జూలై 30 (జనంసాక్షి):**
నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సిరిసిల్లలో రూ.3.22 కోట్లతో రగుడు జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ, మోడల్ బస్‌షెల్టర్ల నిర్మాణ పనులను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వస్త్ర పరిశ్రమ కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్ పథకం ఆర్డీ పాస్‌బుక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సిరిసిల్ల చేనేతకు ప్రతీకగా నిలిచిందని, గత రెండేళ్లలో చేనేత రంగానికి రూ.1360 కోట్లకు పైగా ప్రభుత్వం అందించిందన్నారు. నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి, భద్రత, బీమా, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం నాణ్యమైన చీరలను కొనుగోలు చేస్తోందని, యార్న్ డిపో ఏర్పాటు ద్వారా సహకార సంఘాలకు మరింత ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సిరిసిల్లలో తయారవుతున్న ఇందిరా మహిళా శక్తి చీరలు నాణ్యతకు గుర్తింపుగా నిలుస్తున్నాయని అన్నారు. సిరిసిల్ల మోడల్ చీరకు జీఐ ట్యాగ్ వచ్చేలా కృషి చేయాలని సూచించారు. నేతన్నల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని, సిరిసిల్లతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమలో పేరుకుపోయిన బకాయిలను దశలవారీగా విడుదల చేసి నేతన్నల్లో విశ్వాసం పెంచామని తెలిపారు. 2024-25 సంవత్సరానికి 6.80 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3 కోట్ల మీటర్ల చీరల తయారీకి ఆర్డర్లు జారీ చేశామని చెప్పారు. ఇప్పటికే రూ.62 కోట్ల బిల్లులు చెల్లించామని వెల్లడించారు. అలాగే 25 హెచ్‌పీ పవర్‌లూమ్‌లకు విద్యుత్ సబ్సిడీ, రూ.50 కోట్లతో యార్న్ బ్యాంక్, కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు వంటి చర్యలతో చేనేత రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. రగుడు బైపాస్ జంక్షన్‌ను నేతన్న వృత్తికి ప్రతీకగా సుందరీకరించినట్లు పేర్కొన్నారు.
జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ గుడి చెరువు బండ్ పార్క్, రగుడు జంక్షన్ అభివృద్ధి పనులతో పాటు వస్త్ర తయారీ దశలను ప్రతిబింబించే శిల్పాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత ఏడాది సిరిసిల్లలో తయారైన ఇందిరా మహిళా శక్తి చీరలకు మంచి ఆదరణ లభించిందని, ఈ ఏడాది కూడా ప్రభుత్వం కొత్త ఆర్డర్లు ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, ప్రజాప్రతినిధులు, అధికారులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# రాంలీలా మైదానంను మరింత అభివృద్ధి చేస్తాం

**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్.**



**నిజాంపేట్ జులై 30 జనం సాక్షి :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 - సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ శ్రీ రాంలీలా మైదానం నూతన కమిటీ కార్యవర్గం సభ్యులు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ ఆధ్వర్యంలో గురువారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి రామ్ లీలా మైదానంలో నిరుపయోగంగా ఉన్న బోరుకు మోటారుకు బిగించడంతో పాటు విద్యుత్ సదుపాయాన్ని కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ నూతన కమిటీ అధ్యక్షులైన కొట్టే రవి, ప్రధాన కార్యదర్శి అయిన కొత్తకొండ రవిలను శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలకు, పండుగలకు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న శ్రీ రామ్ లీలా మైదానములను అభివృద్ధి చేసేందుకు కమిటీ సభ్యులకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు ధారం సాయికుమార్, మాణిక్య రెడ్డి, జాయింట్ సెక్రెటరీ మాసిరెడ్డి, శ్రీనివాస్, సెక్రటరీ లక్ష్మణ్, గోవిందప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీలు శ్రావణ్ కుమార్, వీరన్న, భాస్కర్ రెడ్డి, సభ్యులు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో
# 24 గంటల కంట్రోల్ రూమ్

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ సి. నారాయణరెడ్డి
- అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి

**రంగారెడ్డి, జూలై 30 (జనంసాక్షి):** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు తక్షణ సహాయ సేవలు అందించేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువుల వద్ద నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లవద్దని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, నీటితో నిండిన రహదారులను దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. విద్యుత్ తీగలు తెగిపడిన ప్రాంతాలకు దూరంగా ఉండాలని, చెట్లు కూలే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. చిన్నారులు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ముంపు, రవాణా అంతరాయం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. అందిన ప్రతి సమాచారంపై సంబంధిత శాఖలు వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.
అన్ని మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తమ పరిధిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు అధికారుల సూచనలు, వాతావరణ శాఖ హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## గ్రామాభివృద్ధికి అధికారులు-సర్పంచులు సమన్వయంతో పనిచేయాలి

**మొయినాబాద్ మండల సర్వసభ్య సమావేశంలో డీపీఓ సురేన్ మోహన్**

**మొయినాబాద్, జూలై 30 (జనంసాక్షి):** గ్రామాల సమగ్ర అభివృద్ధికి అధికారులు, సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి సురేన్ మోహన్ సూచించారు. గురువారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో హేమ బిందు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో రైతులకు ఎరువులు అందడం లేదని మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రైతు నమోదు చేసుకున్నప్పటికీ ఇతర ప్రాంతాలకు వెళ్లి ఎరువులు తెచ్చుకోవాల్సి వస్తోందని తెలిపారు. దీనిపై వ్యవసాయ అధికారులు స్పందిస్తూ మండలంలో ఒకే ఎరువుల విక్రయ కేంద్రం ఉందని, అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎట్టూనర్ పల్లి, శ్రీరామనగర్ తదితర గ్రామాల్లో నాలుగేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు సిబ్బంది లేక మూతపడి ఉన్నాయని సభ్యులు ప్రస్తావించారు. మండలంలో ఆరు అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 13 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వం నియామకాలు చేపట్టిన తర్వాత భర్తీ చేస్తామని అధికారులు తెలిపారు. చెరువుల ఆక్రమణలు, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, యూనిఫాంల పంపిణీ ఆలస్యం, మహిళా సంఘాల భవనాల నిర్మాణం తదితర అంశాలపై కూడా చర్చించారు. సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీపీఓ ఆదేశించారు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించడంతో పాటు పంచాయతీలు ఇంటి పన్నుల వసూళ్లను సక్రమంగా నిర్వహించాలని సురేన్ మోహన్ సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట

- కల్వకుర్తి అభివృద్ధికి ఇప్పటికే రూ.1500 కోట్లు ఖర్చు : ఎమ్మెల్యే కసిరెడ్డి
- తలకొండపల్లి మండల సర్వసభ్య సమావేశంలో హామీ
- గ్రామాల సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తామని వెల్లడి




తలకొండపల్లి, జూలై 30 (జనంసాక్షి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని అధికారులతో సమీక్ష నిర్వహించారు.సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు రహదారులు, సిమెంట్ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి సరఫరా, ఇతర మౌలిక వసతుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. జూలపల్లి-రాంపూర్-గట్టు ఇప్పలపల్లి మధ్య బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నందున వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే రూ.1500 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలోని సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించిన ఎమ్మెల్యే, సమావేశాలకు గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పథకాల అమలులో నిర్లక్ష్యం సహించబోమని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో పర్యటించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాల మెరుగుదలతో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి వై.వి. రామ్‌కుమార్, ఎంపీడీవో సీతారామమ్మ, తహసీల్దార్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నల్లబెల్లిలో పౌర హక్కుల అవగాహన సదస్సు

**యాచారం, జూలై 30(జనం సాక్షి )** యాచారం మండల పరిధిలోని నల్లబెల్లి గ్రామంలో సివిల్ రైట్స్ డే సందర్భంగా పౌర హక్కుల అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కిషన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తాసిల్దార్ అయ్యప్ప, ఎస్ఐ మధు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, చట్టాల పట్ల చైతన్యంతో మెలగాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో హక్కుల ఉల్లంఘన జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



## పొంగిపొర్లుతున్న నల్లవాగు, సింగీతం వాగులు

**కళ్యాణీ ప్రాజెక్టు వరద గేట్ల ఎత్తివేత**

**నిజాంసాగర్, జులై 29 జనంసాక్షి :** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలకళ సంతరించుకుంది. రెండు రోజులుగా జోరుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలలోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో చెరువులు, కుంటలు సైతం జలకళను సంతరించుకున్నాయి. సంగారెడ్డి జిల్లాలో జోరుగా కురుస్తున్న వర్షాలకు నిజాంసాగర్ మండలంలోని సర్పంగావ్పల్లి చౌరస్తా సమీపంలో గల నల్లవాగు మత్తడి పొంగిపొర్లుతూ మంజీరా పరివాహక ప్రాంతం సైతం జలకళను సంతరించుకుంది. నల్లవాగు మత్తడి పొంగిపొర్లుతుండడంతో మంజీరా పరివాహక ప్రాంతం రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నల్లవాగు మత్తడి పొంగిపొర్లితే ఇక తమకు సాగు నీటి ఇబ్బందులు ఉండవంటూ మంజీరా పరివాహక ప్రాంతానికి చెందిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక కళ్యాణీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 409.50 మీటర్లకు గాను ప్రస్తుతం 408.60 మీటర్లతో ఉండగా ఎగువ భాగం నుంచి కళ్యాణీ ప్రాజెక్టులోకి 430 క్యుసెక్కుల ఇన్ఫ్లా ప్రవహిస్తుండడంతో బుధవారం ఉదయం ప్రాజెక్టు రెండు వరద గేట్ల ద్వారా నీటిని మంజీరాలోకి విడుదల చేసినట్లు ఏఈఈ సాకేత్ తెలిపారు. ఎగువ భాగం నుంచి వస్తున్న ఇన్ఫ్రాకు అనుగుణంగా నీటి విడుదలను కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. పెద్దగుట్ట, గాంధారి తదిదర మండలాల్లో కురుస్తున్న వర్షాలకు సింగీతం వాగు పొంగిపొర్లుతూ సింగీతం ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా ప్రవహిస్తుంది.

## ఆగస్టు 3 వరకు అప్రమత్తమే అస్త్రం

- సర్ చివరి దశలో ప్రతి బిఎల్ఎ క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో పనిచేయాలి
- బోగస్ ఓట్ల ఏరివేత, అర్హులైన ఓటర్ల హక్కుల పరిరక్షణలో రాజీ ఉండొద్దు
- మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి

**తాండూరు జులై 30(జనంసాక్షి) :** ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనదే. ఆ ఓటు స్వచ్ఛతను కాపాడే బాధ్యత ప్రతి బిఎల్ఎలపై ఉందని తాండూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమం ఆగస్టు 3వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో తాండూర్ నియోజకవర్గంలోని బిఎల్ఎలు చివరి రోజు వరకు అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి బిఎల్ఎలు తమకు కేటాయించిన బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి పెండింగ్‌లో ఉన్న ప్రక్రియలను పూర్తి చేయాలని, అర్హులైన ఓటర్ల వివరాలు నమోదు కావడంతో పాటు నిబంధనలకు అనుగుణంగా బోగస్ ఓట్లను గుర్తించే ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఆగస్టు 3 చివరి గడువు కావడంతో ఒక్క రోజును కూడా వృథా చేయకుండా ప్రతి బూత్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించాలని, అవసరమైన చోట ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.బోగస్ ఓట్లను గుర్తించి, ఓటరు జాబితా స్వచ్ఛతను కాపాడడంలో మీ అందరి సహకారం అత్యంత కీలకం. మన కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తిస్తూ పారదర్శక ఓటరు జాబితా నిర్మాణానికి మన వంతు సహకారం అందిద్దాం అని పైలెట్ రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు.

# వేములవాడలో వరుణయాగం

- బస్‌స్టేషన్ ఆధునీకరణకు శంకుస్థాపన
- వరుణయాగంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు
- రూ.12 కోట్లతో గుడి చెరువు ట్యాంక్‌బండ్ పార్క్ ప్రారంభం
- రూ.1.62 కోట్లతో బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు శ్రీకారం
- మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన



**వేములవాడ, జూలై 30 (జనం సాక్షి):** వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ భీమేశ్వర స్వామి ఆలయంలో లోకకళ్యాణం, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలనే సంకల్పంతో మూడు రోజుల పాటు నిర్వహించే ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణయాగం వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందించారు. మొదటి రోజు స్వస్తి పుణ్యాహవాచనం, ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణ జపాలు, వరుణయాగ హోమం నిర్వహించగా, ఆగస్టు 1 వరకు ధారాభిషేకాలు, హోమాలు, పారాయణాలు కొనసాగనున్నాయి. సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు నిండి, భూగర్భ జలాలు పెరిగి రైతులు సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో యాగం నిర్వహిస్తున్నట్లు మంత్రులు తెలిపారు. అనంతరం రూ.12 కోట్లతో అభివృద్ధి చేసిన గుడి చెరువు ట్యాంక్‌బండ్ పార్కును మంత్రులు ప్రారంభించారు. పార్కులో 40 అడుగుల భారీ శివుని విగ్రహం, వాటర్ ఫౌంటెన్లు, వాకింగ్ ట్రాక్, పచ్చదనం, బోటింగ్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పొంగిపొర్లుతున్న మూలవాగు వద్ద మంత్రి తుమ్మల ప్రత్యేక పూజలు నిర్వహించారు.
అదే రోజు వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శంకుస్థాపన చేశారు. కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును కూడా ప్రారంభించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రూ.1.62 కోట్లతో బస్‌స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుతో ప్రయాణికుల సంఖ్య పెరగడంతో కొత్త బస్సుల కొనుగోలు, సిబ్బంది నియామకాలు చేపట్టినట్లు చెప్పారు. వేములవాడకు రోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తున్నాయని తెలిపారు.
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రముఖ దేవాలయ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులతో పాటు బస్‌స్టేషన్ ఆధునీకరణ కూడా వేగంగా సాగుతోందన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునీకరించిన బస్‌స్టేషన్ భక్తులకు, ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రపంచ మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా వేములవాడ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి సౌందర్య మాట్లాడుతూ ఉద్యోగాలు, ఉన్నత విద్య, విదేశీ అవకాశాల పేరుతో జరిగే మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో పరిచయాలు పెంచుకోవద్దని, వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వరద సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం

- పెద్దపల్లి జిల్లా పరిస్థితిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



**మంథని, జులై 30, (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లాలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో పలు కాలనీలు జలమయమైన నేపథ్యంలో సహాయక, పునరావాస చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం డా. బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి పెద్దపల్లి జిల్లా కలెక్టర్, సింగరేణి సీఎండీ, ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తెలంగాణ జెన్‌కో సీఎండీ, రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) అధికారులు, రామగుండం పోలీసు కమిషనర్ తదితర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్సులో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట వెంకటరమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కూడా పాల్గొన్నారు. రామగుండం పారిశ్రామికవాడలో నిలిచిపోయిన వరద నీరు తొలగించేందుకు నాలాల్లో ఉన్న ఆటంకాలను తొలగించాలని మంత్రి ఆదేశించారు. వరద సహాయక చర్యల్లో సింగరేణి, ఎన్టీపీసీ అధికారులు చురుకుగా పాల్గొని జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. వీర్లపల్లి గ్రామంలోకి నివాస ప్రాంతాలు జలమయమైన నేపథ్యంలో గ్రామంలోకి వరద నీరు చేరకుండా ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామస్తులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా ఇంటి స్థలాల పట్టాలు అందజేసే ప్రక్రియను వేగవంతం చేయాలని పెద్దపల్లి కలెక్టర్‌కు సూచించారు. గోదావరిఖనిలో వరద తీవ్రత అధికంగా ఉన్నందున మున్సిపల్, రెవెన్యూ శాఖలకు పోలీసులు పూర్తి సహకారం అందించాలని రామగుండం పోలీసు కమిషనర్‌కు ఆదేశించారు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రామగుండంలో విపత్తు నివారణ బృందాలను పూర్తిస్థాయిలో రంగంలోకి దించాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాలోని 1,021 చెరువుల్లో దాదాపు 80 శాతం నిండటం సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. దీంతో జిల్లాలోని సుమారు 2.7 లక్షల ఎకరాలకు సాగునీటి కొరత ఉండదన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు గురువారం సాయంత్రానికి 20 టీఎంసీల కు చేరనున్నాయని తెలిపారు. నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఒక్క చుక్క నీరూ వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత వీర్లపల్లి గ్రామంతో పాటు గోదావరిఖని, రామగుండం పారిశ్రామికవాడ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సింగరేణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# ప్రజా పాలనే ప్రగతికి పునాది

## ఉప్పల్‌కు రూ.76.46 కోట్ల అభివృద్ధి వరాలు

- వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది



**ఉప్పల్ , జూలై 30 (జనం సాక్షి ):** ప్రజా పాలనే అభివృద్ధికి చిరునామా అని, ప్రజల సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్లు అన్న భావనతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో రూ.76.46 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు వజ్రేష్ యాదవ్తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం భారీ అప్పుల భారం మోయాల్సి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఒకవైపు అప్పుల భారాన్ని తగ్గిస్తూనే, మరోవైపు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తోందని చెప్పారు. గ్రామాలు, పట్టణాలు, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు నిధుల కొరత రానివ్వబోమని స్పష్టం చేశారు. ఉప్పల్ నియోజకవర్గంలో చేపట్టనున్న పనుల్లో వెంకట్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో రూ.12 కోట్లకు పైగా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం, ఉప్పల్, బీరప్పగడ్డ డివిజన్లలో రూ.2.50 కోట్లతో రోడ్ల అభివృద్ధి, చిలుకానగర్, కుషాయిగూడ ప్రాంతాల్లో రూ.1.28 కోట్లతో రోడ్ల విస్తరణ, మరమ్మతులు చేపట్టనున్నారు. ఉప్పల్ ఎక్స్‌రోడ్ బస్‌స్టాప్‌ను వి.టి. కమాన్ ప్రాంతానికి తరలించేందుకు రూ.3.20 కోట్లతో అదనపు డ్రైవ్‌వేలను నిర్మించనున్నారు.

**అలాగే ఉప్పల్ భగాయత్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి**

మూసీ నది వరకు వర్షపు నీటి కాలువలు, ఎస్‌డబ్ల్యూ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.23.40 కోట్లు, కాప్రా, చర్లపల్లి డివిజన్లలో వర్షపు నీటి కాలువలు, పైప్‌లైన్ నిర్మాణాలకు రూ.8.50 కోట్లు, కుషాయిగూడలోని కాప్రా నాలాపై ఆర్‌సీసీ కల్వర్టుల నిర్మాణానికి రూ.1.30 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

క్రీడా, సామాజిక మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న మంత్రి, ఉప్పల్ భగాయత్‌లో రూ.4.95 కోట్లతో అత్యాధునిక మల్టీ స్పోర్ట్స్ అరేనా, రామంతాపూర్‌లో భజరంగ్ వ్యాయామశాల అభివృద్ధికి రూ.90 లక్షలు, ప్రధాన రహదారులపై రూ.5.50 కోట్లతో ఫుట్‌పాత్‌ల నిర్మాణం, బీరప్పగడ్డలో శ్మశానవాటికల అభివృద్ధికి రూ.50 లక్షలు, రాఘవేంద్ర కాలనీలో స్టీల్ గిర్డర్ వంతెన నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మంత్రి ప్రసంగం అనంతరం అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## అంగన్వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

**రుద్రంగి జూలై 30 (జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రుద్రంగి మండలంలో ఖాళీగా ఉన్న రెండింటిలో మానాల (దృష్టి లోపం ఉన్న వికలాంగులు) కీమ్యా నాయక్ తండాలో ఒకటి ఎస్టికి కేటాయించబడిన అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా సంక్షేమ అధికారి ప్రకటన విడుదల చేశారు. అంగన్వాడీ కేంద్రం ఉన్న గ్రామానికి చెందిన స్థానిక వివాహిత మహిళలు మాత్రమే అర్హులు. 18 నుండి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులు జూలై 28 నుండి ప్రారంభం కాగా, ఆగస్టు 7 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుంది. ఇంటర్మీడియట్ మార్కులకు 70, అనాథలకు 10, ఇంటర్వ్యూకు 10, వితంతువుకు 5, దివ్యాంగులకు 5 మార్కుల చొప్పున మొత్తం 100 మార్కుల ప్రాతిపదికన ఎంపిక ఉంటుంది. దరఖాస్తుతో పాటు ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ మెమో, కుల, నివాస, ఆధార్ పత్రాలను జత చేయాలని మండల సూపర్వైజర్ మమత తెలిపారు.

# ఫీజుల బకాయిల విడుదలలో జాప్యం సరికాదు బీజేవైఎం

- ఫీజులు బకాయి-బీజేపీ లడాయి కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు



**చేవెళ్ల, జూలై 30 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో గురువారం చేవెళ్లలోని వివేకానంద, శ్రీ చైతన్య కళాశాలల్లో "ఫీజులు బకాయి--బీజేపీ లడాయి" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజు భూపాల్ గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అభినయ్ గౌడ్, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ మల్లారి వైభవ్ రెడ్డి, బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదలలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. ఫీజులు చెల్లించలేక పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బకాయిల చెల్లింపులో జాప్యం కారణంగా కళాశాలల ఆర్థిక పరిస్థితి కూడా దెబ్బతింటోందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలన్నింటినీ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ, బీజేవైఎం నిరంతరం పోరాటం కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుంచం శ్రీనివాస్ ఆంజనేయులు గౌడ్, కృష్ణ గౌడ్, బీజేవైఎం నాయకులు ఇంద్రసేనారెడ్డి, పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, జయశంకర్ గౌడ్, పత్తి సత్యనారాయణ, సామ కృష్ణారెడ్డి, గాజులగూడం శ్రీనివాస్ రెడ్డి, శివకుమార్ గౌడ్, ఎర్రవల్లి అశోక్, అల్లాడ అభిషేక్ రెడ్డి, పాగా వెంకటేష్, వడ్డే గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- జేపీసీ జిల్లా కార్యదర్శి రవీందర్ రెడ్డి, ఇంచార్జ్ డీఆర్డీఓ కృష్ణారెడ్డికి వినతి



**రంగారెడ్డి, జులై 30 (జనంసాక్షి) :** ఉపాధి హామీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని చేసి కార్యదర్శి రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు డిఆర్డిఓ రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి పిడి కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను అందజేయాలని ఏంటి కోరారు. ఉద్యోగుల పదోన్నతులు బదిలీల విషయంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చేసిన హామీ నీటికి అమలు కావడంలేదని ఆందోళన వెలిబుచ్చారు. గత రెండు దశాబ్దాలుగా గ్రామీణ అభివృద్ధిలో నిరంతరం సేవలందిస్తున్న ఉద్యోగులకు భద్రత కరువైందని అన్నారు గత సంవత్సర కాలంగా ఉద్యోగుల వేతనాలు మూడు నుండి నాలుగు నెలల అవుతున్న అందడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ఉద్యోగులకు ప్రతినెల వేతనాలు అందిస్తున్నామని చెబుతున్న తమ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. ఓవైపు పాఠశాలలు ప్రారంభమై ఫీజుల భారం నెత్తిన పడుతుందన్నారు. పాఠశాలలో కళాశాలల ఫీజులతో పాటు ఇంటి అద్యలో విద్యుత్తు నిత్యవసర వస్తువుల కొనుగోలు బ్యాంకు ఈఎంఐ లో వంటి చెల్లించలేక ఇబ్బందులకు గురవుతున్నామని తెలి. కనీసం విధులకు చేరాలంటే రవాణా ఖర్చులకు కూడా ఇబ్బందువుతోందన్నారు. ఇలాంటి సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు మంత్రి దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు అయినా ఎలాంటి స్పష్టత లభించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముందుంచిన తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన బాట పడతామని తెలిపారు. ఉద్యోగులకు 2026 ఆగస్టు 15లోపు పే స్కేల్ అమలు చేసి, ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లించే విధానాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఆర్‌డిఎస్ బోర్డు సమావేశంలో ఆమోదించిన అన్ని నిర్ణయాలను తక్షణ అమలు చేయాలన్నారు. సెలవు రోజుల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు, రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే నిబంధనల ప్రకారం తగిన ప్రయోజనాలు కల్పించాలన్నారు. సిఆర్డి కార్యాలయంలో ఫైనాన్స్, హెచ్ఆర్ వింగ్ మధ్య సమన్వయ లోపాన్ని నివారించాలని వేతనంలో విడుదల ఏర్పాటుచేసిన జాప్యాన్ని శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యోగుల సంక్షేమం, న్యాయమైన హక్కుల పరిరక్షణ కోసం ఆగస్టు 16 నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు, దశలవారీ ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అవసరమైతే సమ్మెలోకి వెళ్లేందుకు కూడా వెనకడబోమన్నారు.

ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ల సఘం జిల్లా అధ్యక్షులు నర్సింలు, కంప్యూటర్ ఆపరేటర్ రా జల్లా అధ్యక్షులు రహమత్ తదితరులు ఉన్నారు.

# భూగర్భ జలాల పెరుగుదలకు చక్కటి ఉపాయం

- ప్రతి నీటి చుక్కను భూమిలోకి చేరే విధంగా చేయడం
- తెలంగాణ జలసిరి వాల్పోస్టర్ విడుదల



**బొంరాస్ పేట, జూలై 30 (జనం సాక్షి):** ఎల్ నినో ప్రభావం వర్షభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ జలసిరి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్ అన్నారు. గురువారం ఏర్పుమళ్ళ గ్రామంలో తెలంగాణ జలసిరి వాల్పోస్టర్ ను స్థానిక సర్పంచ్ బందెయ్య, ఉప సర్పంచ్ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాల పెరుగుదలకు చక్కటి ఉపాయం ప్రతి నీటి చుక్కను భూమిలోకి వెళ్లేలా చేయడం ఒకటే సరైన మార్గం అన్నారు. వివిజిరాంజీ, తెలంగాణ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇంకుడు గుంత, ఊట కుంట,పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం కల్పించిందన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ నీటిని వృధా చేయకుండా రోడ్లపైకి నీరు వదలకుండా ఇంకుడు గుంతలు నిర్మించు కోవాలని పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు, ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి, వార్డు మెంబర్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

# పౌర హక్కుల పరిరక్షణే లక్ష్యం : ఏసిపి మాధవి



**సైదాపూర్ జులై 30 (జనం సాక్షి) :** సైదాపూర్ మండలం సోమారం గ్రామంలో గురువారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మాధవి మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు విధులను కూడా తెలుసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరిం చాలని సూచించారు. చట్టాలు కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, సమాజంలో శాంతి, సామరస్యాల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలకు పౌర హక్కులు, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్, తహసిల్దార్ గుఱ్ఱం శ్రీనివాస్ గౌడ్, ఆర్ఐ వినోద్ సర్పంచ్ కందుల అనిత అంజి గ్రామ ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు

# బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

- బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టానికి 50 ఏళ్లు
- రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించిన ప్రభుత్వం
- స్వేచ్ఛా రథం ప్రారంభం.. అవగాహన గీతం ఆవిష్కరణ
- రక్షణతో పాటు పునరావాసానికీ ప్రాధాన్యం




**శామీర్‌పేట్, జూలై 30 (జనం సాక్షి):** బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని ప్రభుత్వ శాఖలు, న్యాయ వ్యవస్థ, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరీ అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవం, బంధిత కార్మిక వ్యవస్థ (రద్దు) చట్టం అమలై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం, న్యాయ విశ్వవిద్యాలయం, అంతర్జాతీయ న్యాయ మిషన్ సంయుక్తంగా రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా పంచాక్షరీ, న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి శ్రీకృష్ణ దేవరావు కలిసి బంధిత కార్మిక వ్యవస్థపై అవగాహన కల్పించే స్వేచ్ఛా రథను ప్రారంభించారు.

పంచాక్షరీ మాట్లాడుతూ బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం అమలులోకి వచ్చి 50 సంవత్సరాలు గడిచినా ఇంకా అక్కడక్కడా ఇటువంటి ఘటనలు కొనసాగడం ఆందోళనకరమన్నారు. మానవ అక్రమ రవాణా, బంధిత కార్మిక వ్యవస్థలు మానవ గౌరవం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలకు సంబంధించిన అంశాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ న్యాయ మిషన్ జాతీయ కార్యక్రమాల డైరెక్టర్ మెర్లిన్ ఫ్రీడా మాట్లాడుతూ చట్టం అమలులోకి వచ్చినప్పటికీ రాతిగనులు, ఇటుక బట్టీలు, రైస్ మిల్లులు వంటి రంగాల్లో ఇంకా కార్మికుల దోపిడీ కొనసాగుతోందని తెలిపారు. అవగాహనను కార్యాచరణగా మార్చి సమిష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సదస్సులో బంధిత కార్మిక వ్యవస్థపై రూపొందించిన అవగాహన గీతాన్ని ఆవిష్కరించారు. గాయకుడు, గేయరచయిత పల్లె నరసింహ ఆ గీతాన్ని ఆలపించారు. బాధితుల రక్షణ, పునరావాసం కోసం కార్మిక శాఖ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌ను వినియోగించాలని గీతం ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం 50 సంవత్సరాల సందర్భంగా రూపొందించిన స్మారక పుస్తకాన్ని, హెల్ప్‌లైన్ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. బంధిత కార్మిక వ్యవస్థ నుంచి విముక్తి పొంది ప్రస్తుతం గ్రామపంచాయతీ అధ్యక్షురాలిగా ఉన్న పి. లింగ మ్మ మాట్లాడుతూ బాధితులకు అండగా నిలిచి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు, 380 మంది బంధిత కార్మిక వ్యవస్థ బాధితులు, న్యాయవిశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక, ఎగుమతికి..ఆధారిత కేంద్రంగా రంగారెడ్డి జిల్లా

**జిల్లాలో ఎగుమతుల ప్రోత్సాహానికి మెగా సదస్సు : అదనపు కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి**




**రంగారెడ్డి జూలై 30 (జనంసాక్షి) :** పారిశ్రామిక ఎగుమతులకి రంగారెడ్డి జిల్లా ఆధారిత కేంద్రంగా ఆవిర్భవించిందని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. జిల్లాలో ఎగుమతులను ప్రోత్సహించడానికి, ఇప్పటికే ఉన్న పరిశ్రమలను తమ ఉత్పత్తులను ఎగుమతి చేసేలా ప్రోత్సహించడానికి, మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో రంగారెడ్డి జిల్లా ఒక వ్యూహాత్మక స్థానాన్ని సాధించిందని తెలిపారు. రాష్ట్రంలోని అత్యంత చైతన్యవంతమైన పారిశ్రామిక, ఎగుమతి ఆధారిత జిల్లాలలో ఒకటిగా ఆవిర్భవించిందన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉండటం వల్ల పరిశ్రమల స్థాపనకు అవకాశం లభిస్తుందని తెలిపారు. జిల్లా మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, నైపుణ్యం, మానవ వనరులు, పరిశోధనా సంస్థలు, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ప్రాప్యత పరంగా గణనీయమైన ప్రయోజనాలను అందిస్తుందన్నారు. సంవత్సరాలుగా, ఇది ఐటీ, ఐటీఈఎస్, రక్షణ, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ మెటీరియల్స్, సోలార్ ప్యానెల్స్, ప్లాస్టిక్ ఉత్పత్తులు, క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్ ఆధారిత పరిశ్రమలలో బలమైన ఉనికితో ఒక ప్రధాన తయారీ, సేవల కేంద్రంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డీజీఎఫ్‌టీఎస్.ఎ. చవాన్, జీఎం ఎం. శ్రీ లక్ష్మి, సుమతి పాల్గొన్నారు.

# భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**టిపిసిసి డెలిగేడ్ కల్వకుంట్ల సుజిత్ రావు**



**మెట్ పల్లి, జులై 30 (జనం సాక్షి)** ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రాకూడదని ప్రమాదాలకు గురి కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని టీపీసీసీ డెలిగేట్ మెంబర్ కల్వకుంట్ల సుజీత్ రావు కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు కురువనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారని, అందువల్ల ప్రజలు భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు బయటకు వెళ్లకుండా ఇంట్లోనే జాగ్రత్తగా ఉండాలని,పట్టణంతో పాటు పలు మండలాలు, గ్రామాల ప్రజలు వరద ప్రవాహం ఉన్న వంతెనలు, కల్వర్ట్, రహదారులపై నుండి దాటవద్దని, శిథిల వ్యవస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండవద్దని, తడిగా ఉన్న కరెంట్ పోల్స్, ట్రాన్స్‌ఫర్స్ తాకవద్దని, శివారు ప్రాంతాల్లో చేపల వేటకు ఎవరు వెళ్ళొద్దని సూచించారు. అదే విధంగా రైతులు కరెంటు బావుల దగ్గరికి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, వరద నీరు వెళ్లే నాలాలు, మ్యాన్ హోల్స్ సమీపంలోకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడే ప్రమాదాలు గతంలో చూశామని, కావున ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వర్షాలు, వరదల వల్ల సహాయక చర్యలు చేపట్టేందుకు స్థానిక అధికారులు సిద్ధంగా ఉన్నారని, కానీ అన్నిటి కన్నా ముఖ్యంగా ఎవరికివారు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసరమైతే, ఏదైనా సంఘటన జరిగితే స్థానిక అధికారులకు సమాచారం అందించి సహాయక చర్యలు పొందాలని కోరారు ప్రభుత్వం సంబంధిత కార్యాలయాలలో అధికారులను అప్రమత్తం చేసిందని ఏదైనా అత్యవసరం అయితే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

# ప్రతి పేద కుటుంబానికీ ప్రభుత్వ పథకాలు చేరాలి

- అమలులో అధికారులదే కీలక బాధ్యత: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- ప్రతి 45 రోజులకు సమీక్షించి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశం
- గ్రామాల్లో సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణకు చర్యలు
- శాఖల సమన్వయంతోనే సమర్థవంతమైన పాలన సాధ్యమని స్పష్టం



**రంగారెడ్డి, జులై 30 (జనం సాక్షి):** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగం పైనే ఉందన్నారు. మంచాల మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకాల అమలులో గ్రామ కార్యదర్శుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రతి 45 రోజులకు ఒకసారి పురోగతిని సమీక్షించి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అక్రమ కార్యకలాపాలకు ఏ అధికారి సహకరించరాదని హెచ్చరించారు.

నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలోని ప్రవేశ మార్గాలు, కీలక కూడళ్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ విషయంలో పోలీసు అధికారుల సూచనల మేరకు చర్యలు చేపట్టాలని తెలిపారు. పశువైద్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అందిస్తున్న సేవల వివరాలను కూడా క్రమం తప్పకుండా నమోదు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇరవై నాలుగు గంటల విద్యుత్ సరఫరా అందిస్తున్న నేపథ్యంలో అనవసర విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఒకవేళ విద్యుత్ సరఫరా నిలిపి వేయాల్సి వస్తే ముందస్తుగా ప్రజలకు సమాచారం అందించాలని, విద్యుత్ కోతలకు సంబంధించిన వివరాలను గ్రామపంచాయతీల్లో ప్రత్యేక రిజిస్టరులో నమోదు చేయాలని కార్యదర్శులకు సూచించారు. వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించడం, అంగన్ వాడీ సేవల అమలుపై ఐసీడీఎస్ అధికారులతో సమీక్షించారు. అలాగే ఎక్సైజ్, రహదారులు-భవనాలు, వ్యవసాయం, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై అధికారులతో చర్చించారు. విధుల నిర్వహణలో ఎలాంటి ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లొంగకుండా ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. మెరుగైన పాలన కోసం అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీడీవో వసంతలక్ష్మి, డీఈ ఇంద్రసేనారెడ్డి, తహసీల్దార్ వెంకటప్రసాద్, ఏఈ మల్లారెడ్డి, హౌసింగ్ డీఈతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి స్మృతిగ్రంథం ఆవిష్కరణ



హైదరాబాద్, జూలై 30 (జనంసాక్షి): తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా గురువారం రాజ్‌భవన్‌లోని లోక్ భవన్‌లో రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి, తెలంగాణ మాజీ ప్రధాన అటవీ సంరక్షణాధికారి(పీసీసీఎఫ్) అండ్ హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్(హెచ్‌వోఎఫ్ఎఫ్) పరేష్ కుమార్ శర్మ రచించిన 'ఫుట్‌ప్రింట్స్ ఇన్ ది ఫారెస్ట్- మెమొరీస్ ఆఫ్ ఏ ఫారెస్టర్' పుస్తకాన్ని అధికారికంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రచయిత పరేష్ కుమార్ శర్మతో పాటు ఎస్ఆర్ఏఎస్ పబ్లిష్ ప్రతినిధి సుప్రియా భాలే రావు, ప్రముఖ అటవీ నిపుణుడు, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ మనోరంజన్ భంజా, సైకాలజీ కౌన్సిలర్ నేహా వ్యాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరేష్ కుమార్ శర్మ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకు పైగా అటవీ శాఖలో పనిచేసిన అనుభవాలను భావితరాల అధికారులతో పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. ప్రస్తుతం సేవలో ఉన్న అధికారులు, కొత్తగా సివిల్ సర్వీసులో చేరే అభ్యర్థులు, ప్రకృతి ప్రేమికులు, సివిల్ సర్వీసులకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా జాతీయ అటవీ విధానం, వాతావరణ మార్పులపై భారతదేశం చేసిన అంతర్జాతీయ కట్టుబాట్లను దృష్టిలో ఉంచుకుని ప్రకృతి, అడవుల పరిరక్షణకు విధాన నిర్ణేతలు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని, ఈ రంగానికి బడ్జెట్ కేటాయింపులను పెంచాలని గవర్నర్‌ను కోరారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు అందుబాటులో ఉండాలంటే అడవుల సంరక్షణ అత్యంత కీలకమని ఆయన అన్నారు. ఈ పుస్తకం ప్రస్తుతం అమెజాన్‌లో అత్యధికంగా విక్రయమవుతున్న పుస్తకాలలో ఒకటిగా నిలిచిందని తెలిపారు.

# పంపులను ఆన్ చేసి జలాశయాలను నింపాలి

- రిజర్వాయర్‌లను నింపాలనే సోయి రాకపోతే ఎలా?
- మాజీమంత్రి శ్రీనివాసగౌడ్




హైదరాబాద్, జూలై30 (జనంసాక్షి) : గోదావరి, కృష్ణా నదుల ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతోంది. కానీ ప్రాజెక్టులలోని అన్ని పంపులను ఆన్ చేసి, రిజర్వాయర్లను నింపుకోవాలనే సోయి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూరాల నుంచి కిందున్న అన్ని రిజర్వాయర్లు, అన్ని పంప్‌సెట్లు ఆన్ చేసుకోవాలి.. అన్ని రిజర్వాయర్లు నింపుకోవాలి.. తాగునీటి అవసరాలకు మాత్రమే మేం నీళ్లిస్తాం.. వ్యవసాయానికి నీళ్లివ్వం అనే ధోరణిలో అధికారులు మాట్లాడుతున్నారు. దాదాపు నిన్న 45-50 వేల క్యూసెక్కుల పవర్ జనరేషన్ పేరు మీద నీళ్లు వదులుతున్నరు.. కానీ ఉన్న రిజర్వాయర్లను నింపాలి.. పంపులు ఆన్ చేయాలనేది మాత్రం విస్మరించారని అన్నారు. గోదావరి, కృష్ణా నదుల ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతోంది. కొన్ని పంపులు ఆన్ చేశారు.. మరికొన్ని చేయలేదన్నారు. నీళ్లు వచ్చినప్పుడు ఒడిసి పట్టుకోవాలి కానీ వదలన్నీ బంద్ అయినప్పుడు ఏం చేస్తరని ప్రశ్నించారు. వరదలు వచ్చి జూరాల నిండుతున్నా పంపులు ఆన్ చేయలేదన్నారు. రైతులంతా ధర్నా చేస్తాం.. మేమే ఆన్ చేసుకుంటమని ధర్నా చేస్తే నిన్న ఆన్ చేశారు. ఇన్‌ఫ్లో ఎంత ఉందో అవుట్ ఫ్లో కూడా అంతే పవర్ జనరేషన్ పేరు మీద మొత్తం కింది వెళ్లిపోతున్నయన్నారు. ఎల్ నినో దృష్ట్యా గోదావరి, కృష్ణా నదుల నుండి కిందకి వృథాగా పోతున్న ప్రతి చుక్కను ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఉంది. సరైన సమయంలో స్పందించకపోతే పాలమూరు ఎడారి కాక తప్పదని అధికారులు, ప్రభుత్వానికి హెచ్చరించారు.

# వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన



హైదరాబాద్, జూలై30 (జనంసాక్షి): తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల వల్ల ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# ఎగుమతుల వృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

- అనుకూలమైన విధానాల అమలుపై దృష్టి
- ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో సంజయ్ జాజు



హైదరాబాద్, జూలై30 (జనంసాక్షి) : రాష్ట్రంలో ఎగుమతుల వృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త మార్కెట్ల అన్వేషణ, ఎగుమతులకు అనుకూలమైన విధానాల అమలుపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సి.ఎస్. అధ్యక్షతన రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలు, తయారీ (మ్యానుఫ్యాక్చరింగ్) యూనిట్లు, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, హస్తకళలు, ఐటీ ఆధారిత సేవలు తదితర రంగాల ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ఎగుమతుల ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమివ్వడంతో పాటు తెలంగాణను దేశంలోని ప్రముఖ ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం నుంచి రూ.1,22,655 కోట్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయని అధికారులు సమావేశంలో తెలిపారు. ఈ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు మరింతగా ఎగుమతి చేసేందుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ అధికారులతో సమన్వయం పెంపొందించి రాష్ట్ర ఎగుమతుల వృద్ధికి మరింత కృషి చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ సమావేశంలో పర్యాటక, సంస్కృతి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, రవాణా శాఖ కమిషనర్ ఇల్లంబర్తి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డా.జి.ముకుంద రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఎగుమతుల ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక



- వ్యవసాయం, అనుబంధ రంగాల పరిరక్షణకు నిపుణుల కమిటీ కీలక సిఫార్సులు
- ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డికి సమగ్ర నివేదిక అందజేసిన చిన్నారెడ్డి
- కార్యాచరణ ప్రణాళిక అమలుకు సుమారు రూ.802.92 కోట్ల నిధులు అవసరం
- నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, సాగునీరు, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలను పరిరక్షించేందుకు రూపొందించిన రాష్ట్ర స్థాయి సమగ్ర కార్యాచరణ నివేదికను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి గురువారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి ఎతీశ్రతీస బోధి సెంటర్ లో అందజేశారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి, వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులు కృపాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయం మీడియా సెంటర్‌లో నిపుణుల కమిటీ ఛైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో ఏర్పడే సవాళ్లను ముందుగానే అంచనా వేసి, వివిధ శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. రైతులకు నష్టం తగ్గించేలా నీటి వినియోగంలో పొదుపు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, నాణ్యమైన విత్తనాల అందుబాటు, పశుగ్రాస భద్రత, ఉద్యాన పంటల విస్తరణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు వంటి అంశాలకు నివేదికలో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు ఊరటనిచ్చాయని ఆయన తెలిపారు. ఈ వర్షాలతో లభించిన తేమను, అందుబాటులోకి వచ్చిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకొని ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలను విజయవంతంగా సాగు చేసుకునేలా ప్రభుత్వం అమలు చేయదగిన ఆచరణాత్మక సూచనలను కమిటీ ప్రభుత్వానికి అందజేస్తుందని చెప్పారు. అనంతరం వివిధ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు సంయుక్తంగా రూపొందించిన నివేదికలోని ముఖ్యాంశాలను కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నివేదికలో తక్షణ, మధ్యకాల, దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళికలతో పాటు రైతుల జీవనోపాధి పరిరక్షణ, నీటి వనరుల సమర్థ వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, పశుగ్రాస భద్రత, గ్రామీణ ఉపాధి కల్పన వంటి అంశాలపై సమగ్ర సిఫార్సులు చేశారు.

రాష్ట్రంలో సాధారణ నైరుతి రుతుపవనాల వర్షపాతం 740.60 మిల్లీమీటర్లు కాగా, జూలై 27 నాటికి 234.80 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదై, సాధారణంతో పోలిస్తే సుమారు 30 శాతం లోటు నమోదైనట్లు కమిటీ పేర్కొంది. రాష్ట్రంలోని అత్యధిక జిల్లాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో పాటు భూగర్భ జలమట్టం కూడా గణనీయంగా పడిపోయినట్లు నివేదికలో వివరించింది. వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో సాగు విస్తీర్ణం తగ్గినందున, నీటి అవసరం ఎక్కువగా ఉండే పంటలకు బదులుగా కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, రాగులు, నూనెగింజలు, కూరగాయలు, పశుగ్రాస పంటలు వంటి ప్రత్యామ్నాయ పంటలను గ్రామాల వారీ కార్యాచరణ ప్రణాళికతో విస్తృతంగా ప్రోత్సహించాలని కమిటీ సూచించింది. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను 75 శాతం వరకు సబ్సిడీపై రైతులకు అందించాలని సిఫార్సు చేసింది. వరి సాగును నీటి లభ్యత ఆధారంగా పరిమితం చేయడంతో పాటు డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని, బ్రాడ్ బెడ్ అండ్ ఫరో, రిడ్జ్ అండ్ ఫరో, మల్చింగ్, వర్షపు నీటి సంరక్షణ, ఫార్మ్ పాండ్లు, భూగర్భ జలాల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని నివేదిక సూచించింది. ఉద్యాన పంటల సాగును విస్తరించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని కమిటీ అభిప్రాయపడింది. తక్కువ వ్యవధి కూరగాయల సాగు, ఆయిల్‌పామ్, పండ్ల తోటలు, పట్టుపరిశ్రమ ఆధారిత సాగును ప్రోత్సహించాలని, డ్రిప్ ఇరిగేషన్, శాశ్వత పందిళ్లు, షేడ్‌నెట్ హౌస్‌లు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలకు సబ్సిడీలు అందించాలని సూచించింది. పశుసంవర్ధక రంగంలో పశుగ్రాస కొరత తలెత్తకుండా జిల్లా వారీగా పశుగ్రాస బ్యాంకులు ఏర్పాటు చేయడం, మేత పంటల సాగును విస్తరించడం, సైలేజ్, హే తయారీ, అజోల్లా సాగు, పశుగ్రాస విత్తనాల పంపిణీ, అవసరమైతే పశు శిబిరాల నిర్వహణ, పశువులకు తాగునీటి వసతుల కల్పన వంటి చర్యలు చేపట్టాలని కమిటీ సిఫార్సు చేసింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చెక్‌డ్యాంలు, ఫార్మ్‌పాండ్లు, చెరువుల పూడికతీత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీఛార్జ్ పనులను విస్తృతంగా చేపట్టి నీటి వనరులను బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సూచించింది.

మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, జలాశయాల్లోని నీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత కల్పించాలని నివేదిక పేర్కొంది. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, శాస్త్రవేత్తలు సమన్వయంతో రైతులకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సాంకేతిక సూచనలు నిరంతరం అందించాలని, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ సూచించింది. సేంద్రియ ఎరువులు, జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, వర్మీ కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటు, పంటలు, తాగునీరు, పశుగ్రాసం, విద్యుత్ సరఫరా, ప్రజారోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రత్యామ్నాయ పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అవసరమైతే మార్కెట్ జోక్యంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రతిపాదించిన ఈ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను తక్షణమే అమలు చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల జీవనోపాధి, తాగునీటి భద్రత, పశుగ్రాస లభ్యత, గ్రామీణ ఉపాధి పరిరక్షణతో పాటు రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని మరింత స్థిరంగా నిలబెట్టవచ్చని కమిటీ పేర్కొంది. ఈ కార్యాచరణ ప్రణాళిక అమలుకు సుమారు రూ.802.92 కోట్ల నిధులు అవసరమవుతాయని నివేదికలో అంచనా వేసింది.

# భావజాల ప్రచారం నుంచి ప్రజా ఉద్యమాల దిశగా బీసీఐఎఫ్ అడుగులు

**బీసీ ఇంటెలెక్టువల్స్ ఫోరం రెండో వార్షికోత్సవ సమావేశం విజయవంతం**





- జెండావిష్కరించిన వ్యవస్థాపక అధ్యక్షులు టి.చిరంజీవులు

హైదరాబాద్ (జనంసాక్షి) : బీసీ ఇంటెలెక్టువల్స్ ఫోరం (బీసీఐఎఫ్) రెండవ వార్షికోత్సవ సమావేశం హైదరాబాద్ కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి బీసీఐఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బీసీఐఎఫ్ జెండా, కండువా, లోగోలను ఆవిష్కరించారు. అలాగే ఆగస్టు 9న నల్గొండలో నిర్వహించనున్న బీసీ సామాజిక న్యాయ పోరాట సభ పోస్టర్లను కూడా ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వీరస్వామి, వైస్ చైర్మన్ బెనర్జీ, సభ్యులు, సూరగోని రమేష్, కూరపాటి రమేష్, చంద్ర శేఖర్, ఇప్పనపల్లి సాంబయ్య, శ్రీకాంత్, ఎం లింగేష్ యాదవ్, వివిధ సంఘాల నాయకులు ,ఫోరం రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో సంస్థ భవిష్యత్ కార్యాచరణపై విస్తృత చర్చలు జరిగాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో శిక్షణా వ్యవస్థను బలోపేతం చేయాలని తీర్మానించారు. సోషల్ మీడియా వేదికలను సమర్థవంతంగా వినియోగించి బీసీఐఎఫ్ భావజాలాన్ని గ్రామస్థాయికి విస్తరించడంతో పాటు యువతను విస్తృతంగా ఉద్యమంలో భాగస్వాములను చేయాలని సమావేశం నిర్ణయించింది. బీసీఐఎఫ్‌ను భవిష్యత్తులో రాజకీయ పార్టీగా మార్పు చేయాలా అనే అంశంపై కూడా చర్చ జరిగింది. ఈ విషయంపై మరింత విస్తృత సంప్రదింపులు అవసరమని సభ్యులు అభిప్రాయపడటంతో, తుది నిర్ణయాన్ని భవిష్యత్తులో తీసుకోవాలని నిర్ణయించి అంశాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. బీసీఐఎఫ్ కేవలం భావజాల ప్రచార సంస్థగా కాకుండా, ప్రజల దైనందిన సమస్యలు, సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యక్ష ఉద్యమాలు చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సంస్థను విస్తృత ప్రజా భాగస్వామ్యంతో, బలమైన సంస్థాగత నిర్మాణంతో ముందుకు తీసుకెళ్లాలని, సామాజిక న్యాయం సాధన లక్ష్యంగా కార్యాచరణను మరింత వేగవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది.



# నందిపంప్ హౌజ్ ద్వారా ఎత్తిపోతలు

పెద్దపల్లి, జూలై30 (జనంసాక్షి) : కాళేశ్వరం ప్రాజెక్టు అనుబంధ లింక్ -2 ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలోని నంది పంప్ హౌస్ ద్వారా గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగు తున్నాయి. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం నుంచి ఇక్కడి పంపు హౌస్ నుంచి నీటి ఎత్తిపోతల పక్రియ మొదలుపెట్టిన విషయం తెలిసిందే. గురువారం నీటి ఎత్తిపోతలు కొనసాగాయి. 1,4,5,6 మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఒక్కో మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున మొత్తం 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసి నంది రిజర్వాయర్ లోకి ఎత్తిపోస్తు న్నారు. అనంతరం అదే పరిమాణంలో నంది రిజర్వాయర్ క్రష్ గేట్ల ద్వారా జలాలు ఏడో ప్యాకేజీ జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ లోకి వెళుతుంది. ఆ పంప్ హౌస్ లోని నాలుగు బహుబలి మోటా ర్లను ఆన్ చేసి అక్కడ నుంచి వరద కాలువ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి నీటిని తరలిస్తున్నారు.

# నిండుకుండలా జూరాల ప్రాజెక్టు..

## 12 గేట్లు ఎత్తివేత

దరూరు, జూలై 29 (జనంసాక్షి) : ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నిండుకుండలా మారింది. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. అధికారులు విడుదల చేసిన రీడింగ్ ప్రకారం జూరాలకు 89,640 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, దిగువకు 89,487 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు 12 స్పిల్‌వే గేట్లను ఎత్తి 47,112 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అదనంగా విద్యుత్ కేంద్రం ద్వారా 37,997 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 317.48 మీటర్లు ఉండగా, నిల్వ 7.608 ుటీజగా ఉంది. జూరాలకు మంచి వరద రావడంతో గద్వాల, జోగులాంబ జిల్లాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ లిఫ్టులతో పాటు ఆర్ఎంసీ, ఎల్ఎంసీ కాలువలకు నీరు అందుతుండటంతో ఈసారి పంటలకు ఇబ్బంది ఉండదని భరోసా వ్యక్తం చేస్తున్నారు. జూరాల నుంచి భారీగా నీరు విడుదల అవుతున్నందున కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులు కోరారు. నది ఒడ్డుకు వెళ్లవద్దని సూచించారు.


జూరాల ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేస్తున్న దృశ్యం


నిండుకుండలా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు

## శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు జలకళ

మంచిర్యాల ప్రతినిధి జులై 30 (జనం సాక్షి) : ఉపరితల ఆవర్తనంతో గత రెండు రోజుల నుండి రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు నదులు ఉదృతంగా ప్రవహిస్తున్నాయి . భారీ వర్షాలతో మంచిర్యాల జిల్లా తడిసి ముద్దయింది. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని గుడిపేట సమీపంలోని గోదావరి నదిపై ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ జలకళను సంతరించుకుంది . గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎగువ భాగం నుండి క్యాచ్ మెంట్ ఏరియా నుండి భారీగా వరద నీరు పోటెత్తుతుంది.ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి సామర్థ్యం148 అడుగుల గాను 147.70 అడుగుల నీటిమట్టం చేరుకుంది. 20.175 టీఎంసీల గాను 19.34 టీఎంసీల నీరు చేరుకుంది. ఎల్లంపల్లి 62 గేట్లగాను 15 గేట్లు ఎత్తి 1 55 635 క్యూసెక్కుల నీటిని గోదావరి లోకి వదిలారు. రాత్రి 9 గంటల వరకు 4 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు.ఇరిగేషన్ అధికారులు ముందస్తుగా గోదావరి పరివాహక ప్రాంతంలో ప్రజలు వెళ్లరాదని విజ్ఞప్తి చేశారు . ముఖ్యంగా ప్రాజెక్టు దిగువన గల గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు, రైతులు, మత్స్యకారులు, గొర్రెల కాపరులు, పల్లెకారులు, ఇతరులు నది ఒడ్డుకు లేదా నదీ ప్రవాహ ప్రాంతంలోకి వెళ్లరాదని ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రవీంద్ర చారి విజ్ఞప్తి చేశారు .

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370